వారాంతం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కడప fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-2-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 364 పేజీలు: 10+4 వెల: 6.50


టెక్నాలజీ దిగ్గజం మెటాకు సుప్రీంకోర్టు వార్నింగ్

హెచ్1బి వీసా ప్రక్రియ ఇక మరింత కఠినం

5లో

# 'లడ్డూ' కల్తీపై విచారణ కమిషన్



మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో డి.సిఎం పవన్, మంత్రి అచ్చెన్నాయుడు, సిఎస్ విజయానంద్

## తిరుమల ప్రసాదానికి అపచారం చేసినవారు తప్పించుకోలేరు: సిఎం చంద్రబాబు

### అసలు సూత్రధారులను తేల్చేందుకే కమిషన్

### విచారణలోని వాస్తవాలు ఛార్జిషీటులో ఎలా మిస్?

**విజయవాడ,ఫిబ్రవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో మహా అపచారానికి పాల్పడిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గంలో సిట్ నివేదికపై చర్చ కొనసాగింది.ఈ సమావేశంలో తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంపై అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిషన్ వేయాలని ప్రతిపాదించారు.దీనికి మంత్రివర్గ సమావేశంలో ఏక గ్రీవనిర్ణయం తీసుకున్నారు. ఎజెండాలోని అన్ని అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై చర్చించారు. లడ్డూ కల్తీ జరిగిన విధానం, వివిధ విభాగాల తప్పిదాలను వివరిస్తూ నివేదిక ఉంది. ఇందులో ప్రభుత్వానికి సిట్ సమర్పించిన నివేదికలో పాత్రధారులపై మాత్రమే సిఫార్సు చేసిందని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. విచారణ అంశాలకు, ఛార్జ్ షీట్‌లో ఉన్న అంశాలు, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్ షీట్‌లో ఎందుకు మిస్ అయ్యాయనే దానిపై ప్రధానంగా చర్చ జరిగింది. విచారణ అంశాలు, ఛార్జ్ షీట్ లో అంశాలు, ప్రభుత్వ నివేదికలో తేడాలపై అధ్యయనం చేసి వాస్తవాలను సమర్పించేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ ద్వారా విచారణ బృందం ఏర్పాటు చేసి నిర్ణీత కాలపరిమితిలో నివేదిక తెప్పించుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. వైఎస్సార్సీపీ హయాంలో టెండర్ నిబంధనల్ని సడలించటంతోనే కల్తీకి

>>2



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు పయ్యావుల, నాదెండ్ల, పార్థసారథి, సత్యకుమార్ యాదవ్

## 'నెయ్యి కల్తీ' దోషులపై కఠిన చర్యలు

### మంత్రులు పయ్యావుల, సత్యకుమార్, పార్థసారథి, నాదెండ్ల

**విజయవాడ, ఫిబ్రవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** వేంకటేశ్వరస్వామి కొలువైవున్న తిరుమల తిరుపతి దేస్థానం పవిత్రతను కాపాడటం ప్రభుత్వం ప్రథమ కర్తవ్యమని రాష్ట్రఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శ్రీవారి ప్రసాదం నెయ్యికల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు తీసు కోవడంజరుగుతుందన్నారు.ఈఅంశాన్ని సమగ్రంగా సమీక్షించి

>>2

## ప్రభుత్వానికి సిట్ నివేదిక

### నిబంధనోల్లంఘనలపై వివరణ ఇచ్చిన దర్యాప్తు సంస్థ

**విజయవాడ,ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏపీ ప్రభుత్వానికి వివరణాత్మక నివేదిక సమర్పించింది. 2019-2024 మధ్య కాలంలో జరిగిన ఘోర తప్పిదాలు, నిబంధనల ఉల్లంఘనలు, ఉద్దేశ్యపూర్వక మోసాలను వివరిస్తూ 11 పేజీల లేఖలో సిట్ తన దర్యాప్తు అంశాలను పేర్కొంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.సిట్ తన నివేదికలో 2020లో ఎటువంటి అధ్యయనం, శాస్త్రీయత లేకుండా టెండర్ నిబంధనలు మార్చారు. దీంతో అర్హత లేని కంపెనీలకు టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చారు. 20202023 మధ్య ఈ అర్హత లేని కంపెనీలే కల్తీ నెయ్యి సరఫరా చేశాయి.నెయ్యి సరఫరా సంస్థలకు కనీసం రూ.250కోట్ల టర్నోవర్ ఉండాలన్న నిబంధనను రూ.150 కోట్లకు తగ్గించారు. డైరీ రంగంలో 3 ఏళ్ల అనుభవం ఉండాలన్న నియమాన్ని ఏడాదికి కుదించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరణ నిబంధనను పూర్తిగా తొలగించారు.12 టన్నుల వెన్న తీయాల్సిన నిబంధనను 8 టన్నులకు తగ్గించారు. పర్చేజ్ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా చెవిరెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి పాత్రను సిట్ నిర్దిష్టంగా ప్రస్తావించింది.

>>2

# అమెరికా సుంకాల తగ్గింపుతో ఆక్వారంగానికి మేలు



### రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతి దారులకు భారీ లాభం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఫిబ్రవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా ప్రభుత్వం భారతీయ సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన టారిఫ్‌ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం కింద ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందన్నారు. గతంలో 25 శాతం టారిఫ్‌కు అదనంగా శిక్షాత్మక టారిఫ్‌లతో కలిపి మొత్తం 50-58 శాతం వరకు టారిఫ్ భారం పడటంతో, 2025 ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో అమెరికాకు భారతదేశం నుంచి జరిగే సముద్ర ఆహార ఎగుమతులు పరిమాణంలో సుమారు 15 శాతం తగ్గి 2.01 లక్షల మెట్రిక్ టన్నులకు, విలువలో 6.3 శాతం తగ్గి 1.72 బిలియన్ అమెరికన్ డాలర్లకు పడిపోయాయని గుర్తు చేశారు. ముఖ్యంగా అమెరికాకు ప్రధానంగా ఎగుమతి అయ్యే ఫ్రోజెన్ ష్రింప్ ఈ పరిస్థితి వల్ల తీవ్రంగా ప్రభావితమైందన్నారు. టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల పోటీ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందని, నిలిచిపోయిన కొత్త ఎగుమతి ఆర్డర్లు తిరిగి ప్రారంభమవుతూ, బాండెడ్ గోదాముల్లో నిల్వ ఉన్న సరుకును విడుదల చేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాబోయే నెలల్లో అమెరికాకు సముద్ర ఆహార ఎగుమతులు 10 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని, 2025-26 రెండో అర్థ భాగంలో ఎగుమతులు టారిఫ్‌కు ముందు ఉన్నస్థాయికి చేరుకునే

>>2

## ఎపి సహా 30 ప్రాంతాల్లో ఫోరెన్సిక్ ల్యాబ్‌లు

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**విజయవాడ.ఫిబ్రవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా మొత్తం 30 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఫోరెన్సిక్ సైన్స్ లేబరెటరీలు ఉన్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం లోక్ సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానం కేంద్రమంత్రి ఇచారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న FSLలలో డీఎన్ఏ విశ్లేషణ మరియు సైబర్ ఫోరెన్సిక్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి నిర్భయ నిధుల పథకం కింద 244.89 కోట్ల నిధులు మంజూరు చేయడం

>>2

## అంబటి ఇంటిపై దాడి ఘటన 31మందిపై కేసు నమోదు

### ఎ1, ఎ2గా ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త

**గుంటూరు ,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి అంబటి రాంబాబు కార్యాలయము ఇంటిపై జరిగిన దాడి కేసులో 31 మందిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. అంబటి అంబటి కార్యాలయంతో పాటు ఇంటి పై జరిగిన దాడి కేసులో పోలీసులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. దాడి కేసులో A1 పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, A2 ఎమ్మెల్యే భర్త గల్లా రామచంద్ర రావు పై కేసులు నమోదు చేశారు. వీరితోపాటు మరికొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్రిక్తతలు సృష్టించడంతోపాటు దాడి చేసిన కేసు కేస్ పై పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నారు. అంబటి రాంబాబు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ కేసులు నమోదయ్యాయి.

## నేడు మాజీ సిఎం గుంటూరు పర్యటన

### అంబటి కుటుంబాన్ని పరామర్శించనున్న జగన్

**గుంటూరు ప్రభాతవార్త, ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి నేడు గుంటూరు జిల్లాలో పర్యటిం చనున్నారు. రెండు రోజుల

>>2



## త్రిసభ్య కమిటీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

### తన వద్ద ఉన్న ఆధారాలు కమిటీకి అందజేత

**రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కోడూరు పట్టణంలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగి తనను లైంగిక వేధింపులకు గురి చేశాడని ప్రచార మాధ్యమాలలో తెలియజేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారం రోజుల క్రితం త్రిసభ్య కమిటీని వేసి విచారించవలసిందిగా ఆదేశించారు. త్రి కమిటీ సభ్యులు సభ్యులు విజయవాడ ఇంద్రకీలాద్రి దేవస్థానం బోర్డు సభ్యులు తంబళ్లపల్లి రమాదేవి, అనంతపురం జిల్లా కార్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ టి సి వరుణ్, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్ మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలోని రాజు కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌నుపిలిపించి విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమం మొదట 11 గంటల సమ యంలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతున్న సందర్భంలో ఒంటిగంట మధ్యలో ఉన్నట్లుండి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అతివేగంగా త్రిసభ్య కమిటీ ముందుకు చేరుకుని తన వద్దఉన్న వివరాలను కమిటీకి

>>2

## పకృతి వ్యవసాయ క్షేత్రంగా ఎపి

### వచ్చే ఐదేళ్లలో 50 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం

### ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ: సిఎం చంద్రబాబు





మంగళవారం వ్యవసాయశాఖపై సమీక్షలో డిజి రైతు బజార్ యాప్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. దీనిని సమర్థవంతగా అమలు చేస్తూ... 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులు, 50లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయం, అను బంధ శాఖలపై అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే వ్యవసాయ విద్యార్థులు ప్రకృతి సాగు చేయడం ద్వారా దానివల్ల వచ్చే ఫలితాలను స్వయంగా తెలుసుకనేలా చేయాలన్నారు. ప్రకృతి సాగుకు సంబంధించి ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ వంటివి ఈ ఏడాది ఏప్రిల్ కల్లా వచ్చేలా చూడాలని ఆదేశం చారు. అలాగే జూన్‌నాటికి రాష్ట్రమంతటా పూర్తి కావాలని ముఖ్యమంత్రిసూచించారు. సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతటా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులునిర్వహిస్తామని సీఎం చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లో ఏపీ వ్యవసాయ ఉత్పత్తులవాటా అధికంగా ఉండేలా చూడాలన్నారు.

**ఎల్‌నీనో ఎదుర్కొనేలా ప్రణాళికలు:** రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులు నష్టపోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రాంతాల్లో సంప్రదాయ పంటల స్థానంలో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ భారత్ విస్తార్ వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. రాయలసీమలో ఒకప్పుడు నీటి సమస్య ఉండేది సమర్థ నీటి నిర్వాహణతో ఈ ఏడాది ఆ సమస్యను తీర్చాం అన్ని రిజర్వాయర్లు నింపడంతో సాగునీటికి లోటు లేకుండా చేశామన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం నేపథ్యంలో రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి,ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు.

**ఇకపై ఆక్వా సాగు నమోదు తప్పనిసరి:** ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కల్టివేషన్, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఇలా అన్ని అంశాలు అంతర్జాతీయ స్థాయిలో కోకో సిటీలో ఉండాలన్నారు.మామిడి,కోకో, జీడిమామిడి, కొబ్బరితోటల్లో అంతర్ పంటల సాగుకు అవకాశాలు ఉన్నాయని రైతుల్ని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అరటి ఉత్పత్తిలో

>>2

# త్వరలోనే నంది అవార్డులు

### చిత్రపరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: మంత్రి దుర్గేష్



అవార్డులు అందుకున్న కళాకారులతో మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఫిబ్రవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏప్రిల్ నుండి ఇందుకోసం అవసరమైన కార్యాచరణను ప్రారంభిస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ రెండవ బ్లాక్ లోని ఛాంబర్ లో మంత్రి కందుల దుర్గేష్ ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 పోటీల్లో గెలుపొందిన విజేతలను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహతో లఘు చిత్రాలు రూపొందించిన యువ దర్శకులు, సాంకేతిక నిపుణులు, నటీనటులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా జనవరి 11న రాష్ట్ర స్థాయిలో ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ప్రతిష్టాత్మకంగా మాఏపి ఆధ్వర్యంలో తెనాలిలో ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 ను విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల నిర్వాహకులు మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ ఆంధ్రప్రదేశ్( మా ఏపీ)వ్యవస్థాపకులు, సినీదర్శకులు దిలీప్ రాజా కృషిని కొనియాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాల నిర్వహణపై ప్రకటన చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు ధీటుగా అమరావతిని సినిమా రంగానికి కేంద్రబిందువుగా మార్చాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. సామాజిక చైతన్యంతో కూడినటువంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకులు దిలీప్ రాజా ఏపీలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి చేయాలని

>>2





## ఇద్దరు విద్యార్థి నేతల కిడ్నాప్

### ఎంబి వర్సిటీ యాజమాన్యంపై ఆరోపణలు

### పోలీసుల రంగప్రవేశంతో కథ సుఖాంతం

### మోహన్‌బాబు, విష్ణుపై కేసులు నమోదు

**తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా తిరుచానూరుమార్గంలోని తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఎస్ వి యూనివర్సిటీ నేత వినోద్‌లు మంగళవారం మధ్యాహ్నం కిడ్నాప్‌కు గురయ్యారు. ఈ ఇద్దరి విద్యార్థిసంఘాల నాయకులను మోహన్‌బాబు యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు మార్గమధ్యంలోని కిడ్నాప్ చేసి వారిని సుదూరప్రాంతంలో బంధించారు. ఈ సంఘటన పెద్ద దుమారంతో కలకలం రేపింది. అసలు విద్యార్థినేతలను ఎందుకు కిడ్నాప్ చేశారనేది విద్యార్థులకు తెలియక ఆందోళనకు గురయ్యారు. కిడ్నాప్ సంఘటన జరిగిన సంఘటనను విద్యార్థి సంఘాలనేతలు తిరుపతిజిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్,

>>2



మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపీలు

## టీడీపీ ఎంపీలకు తేనీటి విందు ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లా

**విజయవాడ,ఫిబ్రవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా టీడీపీ పార్లమెంటు సభ్యులకు విందు ఇచ్చారు. ఎంపీలు శ్రీకృష్ణదేవ రాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు హరీష్., భరత్, నాగరాజు, అప్పలనాయుడు, లక్ష్మీనారా యణలు ఈ విందులో పాల్గొన్నారు.లోక్‌సభా కార్యకలాపాలపై టీడీపీ ఎంపీల అభిప్రాయం ఈ సందర్భంగా ఓం బిర్లా స్పీకర్ అడిగి తెలుసుకున్నారు.సభ కార్యకలాపాలు ఇంకా బాగా జరిగేందుకు సూచనలు తీసుకున్నారు.తొలిసారి సభకువచ్చిన వారికి ఎక్కువ అవకాశాలు ఇవ్వా లనిఎంపీలు కోరారు.దీనివలన సభ మర్యాదలు, పద్ధతులు, విధానాలు తెలుసుకో వడానికి వీలు కలుగుతుందన్నారు. తమవిజ్ఞప్తికి స్పీకర్ సాను కూలంగా స్పందించినట్లు ఎంపీలు అనంతరం మీడియాకు వివరించారు. ఇక స్పీకర్ ఓం బిర్లాని ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపీలు దుస్సాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసారు.

## ఎపి సహా 30 ప్రాంతాల్లో ఫోరెన్సిక్ ల్యాబ్‌లు

>> జరిగిందన్నారు. ఇందులో ఢిల్లీ, చండీగఢ్, కోల్ కతా, అస్సాం, భోపాల్, పూణేలలో ఉన్న ఆరు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీల్లో సౌకర్యాల కోసం మహిళా భద్రత పథకం కింద 126.84 కోట్ల నిధులు కేటాయించగా, వీటిలో ఇప్పటివరకు 22.51 కోట్లు వినియోగించ బడ్డాయని మంత్రి తెలిపారు. సైబర్ ఫోరెన్సిక్ రంగంలో శిక్షణ కార్యక్రమాలు కోసం నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం గత ఐదు సంవత్సరాలలో 66 శిక్షణా కార్యక్రమాలను నిర్వహించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్ దినీలిలి లో 37.34 కోట్లతో నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ లేబరెటరీ (విదినీలి) నెలకొల్పినట్లు చెప్పిన కేంద్ర మంత్రి, తాజా సమాచారం ప్రకారం ఇక్కడి ల్యాబ్ లో 181 కేసులు ఫోరెన్సిక్ పరీక్షల కోసం పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. భారత రాజ్యాంగం లోని ఏడవ షెడ్యూల్ ప్రకారం శాంతిభద్రతల పరిరక్షణ, పౌరుల ప్రాణాలకు ఆస్తులకు రక్షణ, దర్యాప్తు, నేరాలు మరియు నేరస్తులపై విచారణ, ఫోరెన్సిక్ సైన్స్ సౌకర్యాలు అన్నీ రాష్ట్రాల ఆధీనంలోనే ఉన్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఇచ్చిన సమాధానంలో కేంద్రమంత్రి వెల్లడించారు.

## త్వరలోనే నంది అవార్డులు

>>నిరంతరం తపిస్తున్నారన్నారు. సినిమా రంగం అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేవలం ఆంధ్ర ప్రదేశ్ లోని ఔత్సాహిక కళాకారులనుమాత్రమే ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 203 షార్ట్ ఫిల్మ్ ఎంట్రీలురాగా 2 వేల మంది నటీనటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన చంద్రశేఖర్‌శకునాల తీసిన 'మహా వృక్షం' ప్రథమ బహుమతిని పొందగా శ్రీకాకుళంకు చెందిన శ్రీనివాసరావు 'సింహాద్రి అప్పన్న' ద్వితీయ బహుతిని, పాలకొల్లుకు చెందిన నవీన్ కుమార్ 'అబద్ధం వర్సెస్ నిజం' తృతీయ బహుమతిని పొందింది. ఈ సందర్భంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు లక్ష రూపాయల నగదును అందించారు. ఉత్తమ నటిగా సుజిత( మనం), ఉత్తమ కేరెక్టర్ నటిగా సాయి ప్రకర్ష ( అబద్ధం వర్సెస్ నిజం) నటుడు పవన్ శర్మ(మన్నుమిన్ను) బాలనటి హర్షతు స్నీసా, యంగ్ టాలెంట్ రిత్విక్ రెడ్డి (అస్త్ర) త్రివిక్రమ్ (డెబ్యూ డైరెక్టరు ) విలన్ మీసాల భాస్కర్,తెలుగు స్క్రిప్ట్ పరిశీలకులు మంజులూరి లక్ష్మీ క్రమపతి మాస్టర్, జగదీష్,దర్శకత్వం నరేష్ దోనె తదితరులను సినిమాటోగ్రఫీ మంత్రి కం దుల దుర్గేష్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. దర్శకులు దిలీప్ రాజా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ఏపీయువత అద్భుతాలు సృష్టించగలరని, ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. మరింత ప్రోత్సాహం అందిస్తే ఎవరెస్ట్ నైనా ఎక్కగలమనే దృఢ సంకల్పాన్ని విజేతల్లో నింపామని దిలీప్ రాజా పేర్కొన్నారు.

## అమెరికా సుంకాల తగ్గింపుతో ఆక్వారంగానికి మేలు

>> అవకాశముందని చెప్పారు. ఈ పరిణామంతో సముద్ర ఆహార ప్రాసెసింగ్ రంగంలోని లాభ మార్జిన్లు కూడా మెరుగవుతాయని, అధిక టారిఫ్ కాలంలో 5-5.5 శాతానికి తగ్గిన ప్రాసెసర్ల మార్జిన్లు టారిఫ్ తగ్గింపు అనంతరం తిరిగి 7-8 శాతం స్థాయికి చేరే అవకాశముందన్నారు. కేంద్ర బడ్జెట్ 2026లో సముద్ర ఆహార ప్రాసెసింగ్‌కు అవసరమైన ఇన్‌పుట్స్‌పై కల్పించిన డ్యూటీ రాయితీలు ఈ రంగానికి అదనపు మద్దతును అందించనున్నాయని తెలిపారు. అమెరికా మార్కెట్ పునరుద్ధరణతో పాటు యూరోపియన్ యూనియన్, చైనా, వియత్నాం, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి అమెరికేతర మార్కెట్లకు భారతీయ సముద్ర ఆహార ఎగుమతులు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయని, 2025-26 ప్రారంభంలో ష్రింప్ ఎగుమతుల్లో అమెరికేతర మార్కెట్ల వాటా సుమారు 57 శాతానికి చేరడం మార్కెట్ విభిన్నీకరణకు నిదర్శనమని అన్నారు. దేశంలో సముద్ర ఆహార ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ టారిఫ్ తగ్గింపు వరంగా మారుతుందని, ఎగుమతుల పునరుద్ధరణతో రాష్ట్రంలోని మత్స్య, ఆక్వా రంగాల్లో రైతులు, మత్స్యకారులకు ఆదాయ స్థిరత్వం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు, స్థూల విలువ జోడింపు కూడా మెరుగుపడతాయని మంత్రి అచ్చె న్నాయుడు స్పష్టం చేశారు.అంచనాల ప్రకారం 2025-26 లో దేశవ్యాప్తంగా మొత్తం సముద్ర ఆహార ఎగుమ తులు 14-15 లక్షల మెట్రిక్ టన్నులకు చేరే అవకాశముందని పేర్కొంటూ, మొత్తం మీద అమెరికా టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడం భారతీయ సముద్ర ఆహారఎగుమతుల పునరుద్ధరణకు, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ సామర్థ్యాన్ని పెంపొందించడానికిముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ మత్స్యరంగస్థిరమైన అభివృద్ధికి కీలకమని తెలిపారు.

## మణిపూర్ సీఎంగా యమ్నం ఖేమ్‌చంద్

### ఢిల్లీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న శాసనసభా పక్షం

**ఇంఫాల్, ఫిబ్రవరి 3:** జాతుల వైరంతో రెండున్నరేళ్లపాటు అట్టుడికిన ఈశాన్యరాష్ట్రం మణిపూర్‌లో ఇపుడు ప్రభుత్వం ఏర్పాటవుతోంది. ఇప్పటివరకూ కొనసాగిన రాష్ట్రపతి పాలన ముగియడంతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధం అయింది. బిజెపి శాసనసభా పక్ష నాయకుడిగా మణిపూర్ ఎమ్మెల్యే యుమ్నం ఖేమ్‌చంద్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైన్మార్, బంగ్లాదేశ్‌లకు సరిహద్దుల్లో ఉన్న ఈ రాష్ట్రంలో వచ్చే 13వ తేదీనాటికి రాష్ట్రపతి పాలన అమలయి ఏడాది పూర్తవుతుంది. ఢిల్లీలో మణిపూర్ బిజెపి నేతలు ఎమ్మెల్యేలు, ఎన్డీయే కూటమి పార్టీల ఎమ్మెల్యేలు సమావేశం అయి ఖేమ్‌చంద్‌ను శానసభా పక్ష నాయకునిగా ఎన్నుకోవడంతో కథ సుఖాంతం అయింది. మణిపూర్ కేంద్ర పరిశీలకులు తరుణ్‌చుఘ్, ఈశాన్యరాష్ట్రాల ఇన్‌ఛార్జి సంబిత్‌పాత్రాలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతుల వైరంతో అట్టుడికిపోయిన మణిపూర్‌ను చక్కదిద్దేందుకు 2025 ఫిబ్రవరినుంచి రాష్ట్రపతి పాలన విధించారు. హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్‌కుమార్‌భల్లాను గవర్నర్‌గా నియమించి పరిస్థితులను పూర్తిగా అదుపులోకి తీసుకురాగలిగిన కేంద్రం దశలవారీగా సడలింపులు కూడా ఇచ్చింది. 60 మంది సభ్యులున్నర అసెంబ్లీలో 32 మంది బిజెపి అభ్యర్థులు 2022లో ఎన్నికయానయరు. ఐదుగురు జెడియు ఎమ్మెల్యేలు ఎన్నికయి తర్వాత బిజెపికి మారిపోయారు.

ఇతర ఎమ్మెల్యేలు నేషనల్‌పీపుల్స్ పార్టీనుంచి ఆరుగురు, నాగా పీపుల్స్ ఫ్రంట్‌ఖుంచి ఐదుగురు, కాంగ్రెస్‌నుంచి ఐదుగురు, ఇద్దరు కూకి పీపుల్స్ అలయన్స్, ఒకరు జెడియునుంచి కొనసాగుతుంటే ముగ్గురు స్వతంత్రులు కూడా ఉన్నారు. ఎమ్మెల్యే ఒకరు మరణించడంతో ఒకస్థానం ఖాళీగానే ఉంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బహుశా ఉప ఎన్నికలకు రావచ్చని అంచనా.

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి జనసేన మద్దతు

### ఎన్నికల ప్రచారం చేసేందుకు పవన్ కళ్యాణ్ అంగీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి3:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి మద్దతుఇస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చారు. దీంతో పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన నివాసంలో, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా పలు కీలక అంశాలపై సార్థక చర్చ జరిగినట్లు బిజెపి వర్గాలు పేర్కొన్నాయి.జనసేన పార్టీ తరఫున భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతును పవన్ కళ్యాణ్ ప్రకటించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి సానుకూలంగా అంగీకరించారు.

# 'లడ్డూ' కల్తీపై విచారణ కమిషన్

>> బీజం పడిందని కేబినెట్ అభిప్రాయ పడింది. ఈవోగా ఉన్న సింఘాల్ నడిచిన నిబంధల్ని తిరస్కరించి వివక్షణాధికారం ఉన్నప్పటికీ ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది. వైఎస్సార్సీపీ హయాంలో 2022లో చేయించిన విచారణ నివేదికలోనే కల్తీ నిర్ధారణ అయినా చర్యలు తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది. సిట్ నివేదికతోపాటు ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంపై కేబినెట్ లోతుగా చర్చించింది. లడ్డూలో రసాయనాలు వాడకం అంశంలో విస్తుపోయే అంశాలు బయట పడుతున్నాయని మంత్రులు తెలిపారు. అడ్వకేట్ జనరల్‌ను మంత్రివర్గం కేబినెట్‌కు పిలిపించింది. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్‌తో చర్చించారు. సిట్ ప్రభుత్వానికి రాసిన 14 పేజీల లేఖలోని చివరి పేరాలో కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి అప్పట్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించింది. నెయ్యి సరఫరాకు ఉన్న నాణ్యతా ప్రమాణాలను బలహీనపరిచేలా వ్యవహరించారని, నిబంధనల తయారీలో మనసు పెట్టకుండా పనిచేశారని పేర్కొంది. దీనివల్ల నెయ్యి నాణ్యతలోనూ రాజీ జరిగిందని తెలిపింది. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరాకు 2019 ముందున్న కఠిన నిబంధనలను వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే మార్చేశారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు పాలు సేకరించాల్సిన అవసరం లేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో పనిలేదని సడలించారు. మూడేళ్లపాటు కార్యకలాపాలు నిర్వహించాలనే నిబంధనను మినహాయింపు ఇచ్చారు. టర్నోవర్ మొత్తాన్ని రూ. 250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించారు. సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ తప్పు చేసి దొరికితే ఎవరైనా సిగ్గుపడతారు కానీ జగన్ కు అదేమీ లేదన్నట్లుగా కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎదురు దబాయిస్తున్నారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. వ్యక్తిగత విమర్శల కంటే సబ్జెక్ట్‌లోని వాస్తవాలు ప్రజల్లోకి తీసుకెళ్తే ఉపయోగం ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఆ దిశగా నేతలు ప్రిపేర్ అయ్యేలా బాధ్యత తీసుకోవాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. సిట్ నివేదికపై వైఎస్సార్సీపీ చేస్తున్న దుష్ప్రచారంపై చర్చించారు. దీనిపై సిట్ నివేదిక తెప్పించాలని కేబినెట్ కోరింది. ఇప్పటికే సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ దాఖలుచేసిన ఛార్జిషీట్ వేసిన విషయాన్ని అధికారులు చెప్పారు. 1985 నాటి నుంచి తాను ప్రతి సబ్జెక్ట్ ఎలా ప్రిపేర్ అయి మాట్లాడింది మంత్రులతో సీఎం పంచుకున్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో ప్రత్యర్థి రాజకీయ పార్టీ వైసిపి కుట్రలను సమన్వయంతో ఎదుర్కోవాలన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంలో అత్యంత గౌరవంతో వ్యవహరించాలన్నారు.సీఎం చంద్రబాబు ఆదేశాలకు భిన్నంగా ఏదీ జరుగకూడదన్నారు.

# 'నెయ్యి కల్తీ' దోషులపై కఠిన చర్యలు

>> సత్వరమే తుది నివేదికను ప్రభుత్వానికిని సమర్పించేందుకు స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ప్రభుత్వం నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ తో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో అజండా అంశాలను పక్కనబెట్టి మరీ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) లడ్డు ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యిలో జరిగిన కల్తీలపై ప్రత్యేక దర్యాప్తుబృందం సమర్పించిన నివేదికను సమగ్రంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ నివేదిక, భారత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ పర్యవేక్షణలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా సమర్పించబడినదన్నారు. సిట్ నుండి ప్రభుత్వానికి రెండు పత్రాలు అందాయని, వాటిలో ఒకటి ఇప్పటికే కోర్టులో దాఖలు చేయబడిన చార్జ్ షీట్, మరొకటి ప్రభుత్వానికి ప్రత్యేకంగా పంపిన 11 పేజీల గోప్య నివేదిక అని తెలిపారు. కోర్టు చార్జ్ షీట్‌ను అధికారికంగా కాగ్నిజెన్సులోకి తీసుకున్న తర్వాతనే అది ప్రభుత్వానికి మరియు సంబంధిత కక్షిదారులకు అందుబాటులోకి రానుందన్నారు. క్యాబినెట్ ముందు ఈ నివేదికను ఉంచి, అందులో పేర్కొన్న ప్రధాన అంశాలు మరియు తేలిన లోపాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగిందన్నారు. నెయ్యి నమూనాలను పరిశీలించిన సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్ నివేదికలో పలు సస్పెక్టెడ్ అడల్ట్రెంట్స్ (కల్తీ పదార్థాలు) సోయాబీన్, సన్‌ఫ్లవర్, రేప్‌సీడ్, కాటన్‌సీడ్, ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో, లార్డ్ మొదలైనవి ఉన్న అవకాశం ఉన్నట్లు తేలిందన్నారు. నివేదికలో పేర్కొన్న దోషులపై తగిన చట్టపరమైన మరియు పరిపాలనాత్మక చర్యలు తీసుకోవాలని క్యాబినెట్‌సమావేశంలో నిర్ణయం తీసుకోవడంజరిగిందన్నారు.క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి పేర్కొన్నట్లుగా, తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటం ప్రభుత్వ కర్తవ్యమని, శ్రీవారి సేవలో ఏ భక్తుడి విశ్వాసం, భక్తి, పవిత్రత ఏ విధంగానూ దెబ్బతినకూడదని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వానికి సిట్ నివేదిక

>> టెండర్ కండిషన్లు మొదలుకుని నెయ్యి సరఫరా వరకు ప్రతి అంశంలో ఉల్లంఘనలు జరిగాయని పేర్కొంది. కల్తీ నెయ్యిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో 2022 మే 25న సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు శాంపిల్స్ పంపారు. పరీక్షల్లో వైష్ణవి డైరీ, బోలేబాబా డైరీల నుంచి వచ్చిన నెయ్యి కల్తీ అయినట్టు నిర్ధారణ అయింది. అయితే, అడిషనల్ ఈవో ధర్మారెడ్డి సహా అధికారులు ఈ నివేదికను పరిగణలోకి తీసుకోలేదు.

# ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా ఎపి

>> దేశంలోనే రెండో స్థానంలో ఉన్నప్పటికీ, ఎగుమతుల విషయంలో వెనకబడ్డామని, ఎగుమతులపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే, స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో లంబసింగిలో పెద్దఎత్తున కుంకుమపువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలన్నారు. ఆక్వా సాగు వివరాలను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్ట్‌ను రైతులకే ఇవ్వాలని సీఎం నిర్దేశించారు. వ్యవసాయం, అనుబంధం రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు.



## పార్లమెంటు ఆవరణలో వైసిపి ఎంపిల నిరసన

**విజయవాడ.ఫిబ్రవరి 3, ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని వెరసి శాంతి భద్రతలు విఫలమయ్యాయని వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పార్లమెంటు ఆవరణంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఇళ్లు, కార్లు తగుల బెట్టడం, తప్పుడు కేసులు నమోదు చేసి వేధించడం వంటి దుశ్చర్యలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగ పాలనకు బదులు సొంతంగా రూపొందించుకున్న రెడ్ బుక్ రాజ్యాంగంను అమలు చేస్తున్నట్లుగా పరిస్థితి మారిందని, దీనివల్ల ప్రజలకు, ప్రతిపక్షాలకు న్యాయం పూర్తిగా దూరమైందని తీవ్రంగా విమర్శించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజిని ఇళ్లపై జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఇవి కూటమి ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలకు స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, పోలీసులు నిస్సహాయ స్థితిలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితిపై ప్రధాని, కేంద్ర హోం మంత్రి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిన బాధ్యత తీసుకోవాలని వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు డిమాండ్ చేశారు.

# బహిరంగ సభకు అనుమతివ్వాలంటూ హైకోర్టులో వైసిపి పిటిషన్

### నేడు విచారణ చేపట్టనున్న హైకోర్టు

**విజయవాడ.ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమకు సిఎం చంద్రబాబు అన్యాయం చేస్తున్నారంటూ జరపబోయే బహిరంగ సభకు పోలీసులు అనుమతినివ్వలేదంటూ వైసిపి దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం విచారిస్తామని హైకోర్టు ప్రకటించింది. రాయలసీమకు, రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సిఎం ద్రోహం చేస్తున్నారనే విషయాన్ని బహిరంగ సభ ద్వారా ప్రజలకు తెలియజేయాలని ప్రయత్నిస్తే అనుమతినివ్వలేదంటూ నంద్యాల జిల్లా వైసిపి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం విచారణ చేపడతామని న్యాయమూర్తి జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం వెల్లడించారు.



మంగళవారం న్యూఢిల్లీలో టిడిపి ఎంపీలతో చర్చిస్తున్న మంత్రి నారా లోకేష్

## ఢిల్లీలో టీడీపీ ఎంపీలతో సమావేశమైన మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ఎంపీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కాగా, రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు, నిధులు రాబట్టేందుకు లోకేశ్ రేపు (ఫిబ్రవరి 4) కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు. ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు.

అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

# ఇద్దరు విద్యార్థి నేతల కిడ్నాప్

>> ఎస్పీ సుబ్బరాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ మనోహరచారి రంగంలోకి దిగి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంట వ్యవధిలో కిడ్నాప్ గురైన ఇద్దరు ఎస్ఎఫ్ఐ లీడర్లను రక్షించారు. అంతేకాకుండా కిడ్నాప్ చేసిన వారిపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులు నమోదు చేశారు.కిడ్నాప్‌ను ప్రోత్సహించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సుబ్బరాయుడు, హామీ ఇచ్చారు. సినీ నటుడు మోహన్ బాబు చంద్రగిరి పరిధిలోని ఎ.రంగంపేటలో ఎంబియూను నిర్వహిస్తున్నాడు. ఆ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అందిన ఫిర్యాదులు,వినతులతో న్యాయం కోసం విద్యార్థి సంఘాలు తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించే పనిలో కదిలింది. ర్యాలీగా వెళుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ నాయకుడు వినోద్‌పై కలెక్టర్ కార్యాలయం వద్ద సినీ నటుడు మోహన్ బాబు అనుచరులుగా ఉన్న 30 మంది వేర్వేరు వాహనాలలో సినిమారీల్‌ను తలపించేలా ముందుకు ఉరికారు. అక్కడికక్కడే ఇద్దరు నేతల్ని వాహనాల్లో ఎత్తుకెళ్ళారు. దీంతో విద్యార్థులు మరింతగా రెచ్చిపోయారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమాచారం తెలుసుకున్న సిపిఎం నేత కందారపు మురళి వెంటనే రంగంలోకి దిగారు. కిడ్నాప్‌కు గురైన విద్యార్థులను కాపాడేందుకు పోలీసు అధికారులను సంప్రదించారు. వెంటనే జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అదనపు ఎస్పీ రవి మనోహరచారికి ఆదేశాలిచ్చారు. ఆయన వెంటనే బలగాలతో ఎంబియూ ప్రాంతానికి చేరు కుని కిడ్నాప్‌కు గురైన ఇద్దరు విద్యార్థినేతలను రక్షించి వారి చెర నుండి తీసుకువచ్చారు. విద్యార్థి నాయకులకు అపాయం తలపెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని మోహన్ బాబుకు కందారపు మురళి హెచ్చరిక చేశారు. యూనివర్సిటీలో తప్పులు సరిదిద్దుకోమంటే దాడికి పాల్పడతారా అని ప్రశ్నించారు. అంతేగాక వెంటనే విద్యార్థులను పోలీసులు కాపాడటంతో తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.

దీంతో పోలీసులు చివరకు ఎంబియూ నిర్వాహకులు మోహన్‌బాబు, విష్ణులపై కేసు నమోదు చేశారు.ఈ సంఘ టనను పలువురు రాజకీయనేతలు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా తప్పుపట్టాయి.

## త్రిసభ్య కమిటీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

>> అందజేశారు. అదేవిధంగా ఆ పార్టీకి చెందిన 45 మంది కార్యకర్తలను విడివిడిగా ప్రశ్నించారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన కమిటీ సమావేశం సాయంత్రం 6గంటలకు ముగిసింది. అనంతరం విచారణ కమిటీ సభ్యులు వరుణ్, శివశంకర్, రమాదేవిలు విలేకరులతో మాట్లాడుతూ విచారణ వివరాలను రాష్ట్ర జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

**తన వద్ద వున్న ఆధారాలను కమిటీకి అందజేశా: ఎమ్మెల్యే:** ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ విచారణ కమిటీ ముందు తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన తాను చెప్పిన వివరాలతో పాటు తన వద్ద ఉన్న ఆధారాలను త్రిసభ్య కమిటీకి అందజేసినట్లు అరవ శ్రీధర్ విలేకరులకు తెలియజేశారు.

## ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కేసు నమోదు

**రైల్వేకోడూరు,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వేకోడూరు ఎమ్మెల్యే తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని, కేసు నమోదు చేయాలని ఒక మహిళా ఉద్యోగి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశాలతో ఎట్టకేలకు మంగళవారం రైల్వేకోడూరు టౌన్ సిఐ చంద్రశేఖర్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై బిఎంఎస్ 318(2), 318(4), 351 (2) సెక్షన్ల కింద కేసు చేశారు. ఈ మేరకు సిఐ విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నేడు మాజీ సీఎం జగన్ గుంటూరు పర్యటన

>> క్రితం అంబటి కుటుంబము కార్యాలయంపై జరిగిన దాడి నేపథ్యంలో అంబటి కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ రానున్నారు.ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి గుంటూరు బయలుదేరుతారు ( వయా...మంగళగిరి, కాకాని, ఏటుకూరు బైపాస్ సర్వీస్ రోడ్, కేవీపీ (వీఐపీ) రోడ్, చుట్టుగుంట, కలెక్టర్ ఆఫీస్, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల మీదుగా సిద్దార్థనగర్‌లోని అంబటి నివాసానికి చేరుకుంటారు), టీడీపీ రౌడీల చేతిలో దాడికి గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసంలో అంబటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం గుజ్జనగుండ్ల, స్తంభాల గరువు, కలెక్టర్ ఆఫీస్, చుట్టుగుంట, కేవీపీ (వీఐపీ) రోడ్, ఏటుకూరు బైపాస్ సర్వీస్ రోడ్, కాకాని, మంగళగిరి మీదుగా తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

### వారం - వర్జ్యం

04-02-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, శ్రవణ కార్తె
తదియ రా. 12.14
పూర్వఫల్గుణి రా. 10.17
వర్జ్యం : తె. 5.42-7.21
దు.ఉ. 11.59-మ. 12.45
శుభసమయం : ఉ. 6.30-7.15,సా. 6.30-7.00
రాహుకాలం - మ. 12.00-1.30

### వార్తాఫలం

**మేషం :** నిజమైన శ్రేయస్సును మీకు చేకూర్చగలిగితే ఎవరన్నది తెలుసుకోగలుగుతారు.పోటీ పరీక్షలలో విజయం.

**వృషభం:** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల పరంగా చెప్పుకోదగిన మార్పు లేవీ చోటు చేసుకోవు.ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**మిథునం:** పెరుగుతున్న ధర వరలు ఆదాయ, వ్యయాలు మిమ్మల్ని ఆలోచింప చేస్తాయి. వత్తిడి అధికం.

**కర్కాటకం:** బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తారు. వాటి తాలూకా ప్రతి ఫలాలను ఎంతమాత్రమూ ఆశించరు.

**సింహం:** మీ పరోక్షంలో జరుగుతున్న విషయాలను కూడా నిశితంగా వ్యవహరిస్తారు.పోటీ పరీక్షలలో విజయం.

**కన్య:** పనులు అప్రయత్నంగా పూర్తి కాగలవు. పెట్టుబడులకు తగిన సహాయం లభిస్తుంది. వాహన సౌఖ్యం.

**తుల:** శత్రువులు బలహీన పడతారు. దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి. వ్యాపారాలు విస్తరిస్తాయి.నూతన విద్యావకాశాలు కలవు.

**వృశ్చికం:** ఉద్యోగాలలో చికాకులు తొలుగుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడుతారు. వస్త్రలాభం.

**ధనుస్సు:** రహస్య సమాచారం వెలుగు చూస్తుంది. పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వాహన సౌఖ్యం కలదు.

**మకరం:** ఆర్థిక లావాదేవీల్లో ఒడిదుడుకులను ఎదుర్కొనవలసి వస్తుంది. చెల్లింపులకు వత్తిడి పెరుగుతుంది.

**కుంభం:** వ్యవహారాలు సానుకూల పడతాయి. ఆస్తి వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి. వాహనాల కొనుగోలు.

**మీనం :** సోదరుల నుండి ఆశించిన విధంగా సహాయసహకారాలు అందు కుంటారు. గృహయోగం.విలువైన ఆభరణాలు కొనుగోలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'లీకు'వీరులను కనిపెట్టలేరా!?

## పట్టుకునే సాహసం చేయలేదెందుకో?

### వైసిపికి ఉప్పందిస్తున్న ఆ గూఢచారులు ఎవరు... టిటిడిలో ఆరని దుమారం



తిరుమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని భక్తులు సమర్పిస్తున్న కానుకలతో వేతనాలు అందుకుంటున్న ధార్మిక సంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో అంకితభావంతో, సేవానిరతితో ఉద్యోగం చేస్తున్న కొందరు ఉద్యోగులు సంస్థలో విషయాలను వైసిపి నేతలకు ఉప్పందిస్తున్నారనే ఆరోపణలు సద్దుమణగలేదు. ఓ వైపు భక్తిభావంతో కొలువులు సాగదీస్తున్న అధికారులు, ఉద్యోగులు మరో వైపు సంస్కరణల పేరుతో తీసుకుంటున్న నిర్ణయాలను ముందుగానే పసిగట్టి తమకు అనుకూలంగా మలచుకునేందుకు కొందరు ఉద్యోగులు ఇప్పటికీ పెత్తనం చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఏకంగా ఓ ఉన్నతాధికారి కూడా గత ప్రభుత్వంలో పెద్దలకు, గత బోర్డులో కొందరికి ఇప్పుడూ విశ్వాసంచూపతున్నారనే ఆరోపణలు ఉద్యోగుల్లో చర్చసాగుతోంది. "తల్లిపాలు తాగి రొమ్ముగుద్దడం"అనే లెక్కన దేవుని పేరు చెప్పి ఉద్యోగం వెల్లదీస్తున్న కొందరు అధికారులు, సిబ్బంది భక్తుల కానుకలతో వేతనాలు అందుకుంటూ వారికే మోసం చేయడం అనే రీతిలో తయారయ్యారనేది ఏడాదిన్నర క్రిందటే టిటిడి బోర్డు పెద్దలు గుర్తించారు. ధార్మికసంస్థలో పనిచేస్తూ ఆ సంస్థ గురించి కీడుతలపెట్టేవారిని వెదికి దూరంగా పెట్టాల్సిన టిటిడి ఉన్నతాధికారులు తమ పంచనచేర్చుకుని పెత్తనం చేయించడం ఎంతవరకు సరైందనే విమర్శలు టిటిడి అత్యధికశాతం ఉద్యోగుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. 2024 నవంబర్‌లో నూతన టిటిడి బోర్డు కొలువుదీరింది. టిటిడి ఛైర్మన్‌గా బిఆర్‌నాయుడు అధ్యక్షతన అప్పట్లో ఇఒగా సీనియర్ ఐఎఎస్ అధికారి జె.శ్యామలరావు పాలనసాగించారు. అయితే ఆయన టిటిడిలో సుప్రీమ్‌గా ఉండే బోర్డు చెప్పిన అంశాలను కూడా అమలుచేయలేకపోవడం, కొందరు గత వైసిపి బోర్డుకు అనుకూలుగారుగా, పైకి తెల్లదుస్తులు ధరించి విధులు నిర్వహిస్తున్నా లోపలకు వైసిపి రంగులతో కాలం వెల్లబుచ్చారనే ఆరోపణలు లెక్కకు మించిఉన్నాయి. ఏకంగా టిటిడిలో గోశాలలో గోవుల మరణాలు, అన్యమత ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించడం వంటివి ముందుగానే గత బోర్డు పెద్దలకు లీకులు వెళ్ళిపోయాయి. ఉద్యోగుల బదిలీలకు కూడా కొందరు మోకాలడ్డుపడటం గత అధికారుల పాలన ఏ పాటిదో అర్థమవుతుంది. లీకు వీరులను కనిపెట్టి బయటకు పంపడంలో బోర్డు తోబాటు టిటిడి ఇఒ, అదనపు ఇఒ, జెఇఒ స్థాయి అధికారులు వెనుకడుగు వేశారంటే పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. ఏకంగా ఓ వివాదంలో తనకు రెండువేల మంది ఉద్యోగులు గూఢచారులుగా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారని మాజీ ఛైర్మన్ ,వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి బహిరంగంగా వెల్లడించారంటే వారితో అంటకాగుతున్న ఉద్యోగులు ఎవరనేది టిటిడి విజిలెన్స్ విభాగం కూడా కనిపెట్టలేకపోయింది. ఇదంతా ఒక ఎత్తయితే అసలు కొంతమందిని గుర్తించి వారిని ఉన్నచోటు నుండి దూరంగా బదలీచేయడమే తప్పదని భావించిన టిటిడి బోర్డుకు కూడా ఎదురుదెబ్బతగిలేలా ఆ గూఢచారులు పావులు కదిపి దానికి చరమగీతం పెట్టించారంటే ఎంతటి సాహసవంతులో తెలుస్తుంది. ఇక మొన్నటికిమొన్న టిటిడిపై పలు విమర్శలు, ఆరోపణలు వచ్చినా వాటిని బలంగా ఖండించే ఉద్యోగులు లేరంటే అతిశయోక్తిలేదు. ఇఒ శ్యామలరావు బదిలీ తరువాత సిఎం చంద్రబాబుకు అత్యంత విశ్వాసపాత్రుడుగా, ఎలాంటి నిర్ణయమైనా ధైర్యంగా తీసుకుని అమలుచేయడంలో దిట్టగా ఉన్న సీనియర్ ఐఎఎస్ అధికారి అనిల్‌కుమార్‌సింఘాల్ టిటిడి ఇఒగా రెండవసారి బాధ్యతలు చేపట్టారు. ఆయన లీకువీరుల భరతం పట్టడానికి ముందుగా డిప్యూటీ ఇఒ స్థాయి అధికారుల బదలీలతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు, చివరకు ఆ బదలీలను లీకువీరులు కొందరు ముందుగానే పసిగట్టి వైసిపి నేతల ద్వారా పలు రకాల ఆరోపణలు చేసి బదలీలను ఆపించేయడం మరో పెద్దట్విస్ట్. చివరకు బోర్డు సూచనలతో ఇఒ సింఘాల్ కూడా సాహసం చేయలేకపోయారనేది ఉద్యోగుల్లో చర్చ. అదేగాక ఆలయంలోపల విధులు నిర్వహించే పలువురు ఉద్యోగులు, సిబ్బందితోబాటు వసతి కల్పన విభాగంలో పలుచోట్ల విధుల్లో ఉన్న ఉద్యోగులు నేమ్‌బ్యాడ్జ్ ధరించాలనే నిర్ణయాన్ని అమలుచేయలేకపోవడం మరో మైనస్. సామాన్యభక్తులకు అదీ చేశాం... ఇదీ చేశాం అని ఢంకా మ్రోగించుకుంటున్న బోర్డు పెద్దలు,, టిటిడి అధికారులు లీకువీరులైన వైసిపి అనుకూల ఉద్యోగులను మాత్రం కనిపెట్టే సాహసం చేయలేకపోవడం కొసమెరుపు. ఇదే సమయంలో కల్తీనెయ్యి వ్యవహారంలో ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌ను తప్పించిన ప్రభుత్వం నూతన ఇఒగా ముఖ్యమంత్రి కార్యాలయం పేషీలో ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రను నియమించింది. ఆయన తిరుమలకు రాకముందే ఇప్పుడు లీకువీరులు గురించి మరోసారి బాహాటంగానే టిటిడి ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఏకంగా తిరుమలలోని వసతి కల్పన విభాగంలో కొందరు సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, దర్శన టిక్కెట్లు మంజూరుచేసే అదనపు ఇఒ కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, కల్యాణకట్టలో ఎఇఒ స్థాయి ఉద్యోగి చేస్తున్న నిర్వాకం బోర్డు పెద్దలకు తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారనే అపవాదు మూటగట్టుకుంటున్నారు. వీరందరిపై నిఘా ఉంచాల్సిన టిటిడి విజిలెన్స్ విభాగం తందాన అనే రీతిలో ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం టిటిడిలో 6,800మంది వరకు శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు. దాదాపు రెండువేలమందికిపైగా తిరుమలలోనే విధులు నిర్వహిస్తున్నారు.. వీరిలో లీకువీరులను పట్టుకోలేకపోతుండటంతో సంస్థలో అంతర్గత వ్యవహారాలు బయటకు పోతున్నా కనిపెట్టలేకపోతుండటం విచారకరం.

## శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం



తిరుమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్తప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళరూపం దర్శనంతో మనసు ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు శుభాలు కలగాలని, మంచి జరగాలని వేడుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో హిమాచల్‌ప్రదేశ్ మాజీ సిఎం జయరాంఠాగూర్, సినీనటి దివి, బిగ్‌బాస్ కంటెస్టెంట్ అశురెడ్డి, సింగర్ విజయప్రకాశ్ వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపం లో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అత్యుత్తమ ఫలితాల దిశగా పనిచేయాలి: టిటిడి జెఇఒ

తిరుమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్తప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడి పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని టిటిడి జెఇఒ (వైద్యం, విద్య) డాక్టర్ ఎ. శరత్ అధికారులకు సూచించారు. తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఉన్నత పాఠశాలను ఆయన అధికారులతో కలిసి మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, విద్యార్థుల ప్రగతిని ఆయన సమీక్షించారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో విద్యార్థులను మరింత జాగురూకతతో తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. రాష్ట్ర ,జిల్లా స్థాయిలలో ప్రథమ స్థానాలు సాధించే లక్ష్యంతో విద్యాబోధన జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిఇఒ వెంకట సునీలు, ఎస్‌జిఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, ఎస్‌ఇ మనోహరం, అదనపు ఆరోగ్యఅధికారి డాక్టర్ సునీల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# లాభాల బాట పట్టిన వైజాగ్ స్టీల్



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో యేడాదిలో అనూహ్య ప్రగతి
- 94 శాతానికి చేరిన ప్లాంట్ కెపాసిటీ యుటిలైజేషన్
- స్టీల్ ప్లాంట్ పురోగతిని సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

విజయవాడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖ ఉక్కు మళ్లీ లాభాల బాట పట్టింది. ఏడాదిన్నంలో అనూహ్య ప్రగతి సాధించిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ 2026 జనవరిలో రూ.54 కోట్ల లాభాన్ని ఆర్జించింది. సచివాల యంలో మంగళవారం విశాఖ ఉక్కు పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీఎండీ మనీష్ రాజ్ గుప్తా, సీఎస్ కె.విజయానంద్ సహా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజర య్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిరం తరం అందిన సహకారంతో గతంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి బయటపడిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తుతం రోజుకు 19,401 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేస్తోందని ఆ ప్లాంట్ సీఎండీ ముఖ్యమంత్రికి వివరించారు. 202425 రెండో త్రైమాసికంలో రోజుకు కేవలం 9,215 టన్నుల హాట్ మెటల్‌ను మాత్రమే ఉత్పత్తి చేయ గలిగామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిగా పని చేస్తుండటంతో ఉత్పత్తి భారీగా పెరిగిందని అధికారులు సీఎంకు తెలియ చేశారు. స్టీల్ ప్లాంట్ కెపాసిటీ యుటిలైజేషన్‌లో రికార్డు స్థాయిలో 94శాతానికి చేరుకుందని తెలిపారు. గత ఏడాది 45శాతం మాత్రమే ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయగలిగామని అన్నారు. పన్నులు, విద్యుత్ బకాయిలు, నీటి సరఫరా లాంటి వేర్వేరు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో ఆర్థికంగా నష్టాల నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల దశకు చేరుకుందని వివరించారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా & పారిశుధ్య విభాగం
No. TO/52/2025, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 27.01.2026
కడప YSR జిల్లా యొక్క పులివెందుల RWS & S డివిజన్‌లో 1 పని కొరకు రూ.10.00 లక్షలు అంచనా ధరతో ఇ-ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్‌దారులు టెండర్ షెడ్యూల్స్‌ను ఇ-మార్కెట్ ప్లేస్ https://tender.eprocurement.gov.in లో 02.02.2026 నుండి 09.02.2026కు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. ఫోన్ నం. 8074034999.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, RWS & S డివిజన్, పులివెందుల
DIPR.No.18980/CL/Advt/1/1/2022-23, తేది: 03.02.2026



ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ
ప్రాజెక్ట్ ఆఫీసు, రాయపూడి గ్రామం, తుళ్ళూరు మండలం, అమరావతి - 522237
పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ
(ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – ఏపీ సిఆర్‌డిఏ)
ఫైల్ నెం.: MAU61-PLG0CCMP/38/2025-PLG
నోటిఫికేషన్: రాజధాని నగరానికి సంబంధించిన జోనింగ్ నిబంధనల్లో ప్రతిపాదిత సవరణలు
గెజిట్ నోటిఫికేషన్ నెం:41 అమరావతి, బుధవారం, జనవరి 21, 2026 జి.1037
పబ్లిక్ నోటీసు
(ఏపీ సిఆర్‌డిఏ చట్టం, 2014 – సెక్షన్ 39 మరియు 41)
ఏపీ సిఆర్‌డిఏ చట్టం, 2014లోని సెక్షన్ 39(1) మరియు 41(3) ప్రకారం లభించిన అధికారాలను వినియోగించుకొని, రాజధాని నగరానికి సంబంధించిన జోనింగ్ నిబంధనల్లో సవరణలను ఏపీ సిఆర్‌డిఏ ప్రతిపాదిస్తోంది. ఈ నోటిఫికేషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే, వాటిని రాతపూర్వకంగా కమిషనర్, ఏపీ సిఆర్‌డిఏ, ప్రాజెక్ట్ కార్యాలయం, రాయపూడి, అమరావతి, ఆంధ్రప్రదేశ్ – 522237 అనే చిరునామాకు, ఈ పబ్లిక్ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 30 రోజుల్లోగా పంపవచ్చు.
అభ్యంతరాలు లేదా సూచనలు పంపే వారు తమ పేరు, చిరునామా, ఫోన్ లేదా ఫ్యాక్స్ నంబర్, ఈ-మెయిల్ వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. సంప్రదించేందుకు సరైన వివరాలు లేని అభ్యంతరాలు లేదా సూచనలు పరిగణనలోకి తీసుకోబడవు.
షెడ్యూల్

| క్రమ సంఖ్య | వివరణ | అమరావతి జోనింగ్ నిబంధనల(ZR) ప్రకారం ఉన్న సమాచారం | అమరావతి రాజధాని నగర జోనింగ్ నిబంధనలకు ప్రతిపాదిత సవరణ |
|---|---|---|---|
| 1 | రాజధాని నగర జోనింగ్ నిబంధనల ప్రకారం, రాజధాని అమరావతి నగర పరిధిలో హోటళ్లకు ప్రతి 100 చదరపు మీటర్లకు ఒక పార్కింగ్ స్థలం ఉండే విధంగా ఉన్నటువంటి నిబంధనను అమరావతి ప్రభుత్వ సముదాయం(ఏజీసీ) ప్రాంతంతో సమానంగా అమలు చేయడం. | అమరావతి రాజధాని నగర జోనింగ్ నిబంధనలలోని అనుబంధం–2 ప్రకారం, మొత్తం ఫ్లోర్ విస్తీర్ణంలో ప్రతి 50 చదరపు మీటర్లకు ఒక పార్కింగ్ స్థలం ఉండాలి. | అమరావతి రాజధాని నగర జోనింగ్ నిబంధనలలో హోటళ్లకు సంబంధించిన పార్కింగ్ నిబంధనలను అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసి) ప్రాంతంతో సమానంగా సవరించే ప్రక్రియను చేపట్టేందుకు అథారిటీ అనుమతి ఇచ్చింది. ఈ సవరణను అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ సిఆర్‌డిఏ కమిషనర్‌కు అథారిటీ అధికారపూర్వకంగా అనుమతి ఇచ్చింది. అలాగే, భవిష్యత్తులో పెరుగుతున్న పార్కింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డబుల్ స్టాక్ పార్కింగ్ విధానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను అథారిటీ ఆదేశించింది. |
| 2 | రాజధాని నగరంలోని పి1 – ప్యాసివ్ వినోద జోన్ పరిధిలో అనుమతించే నిర్మిత విస్తీర్ణంలో మార్పులు చేయడం. | ప్లాట్ విస్తీర్ణంలో గరిష్టంగా 10 శాతం లేదా 500 చదరపు మీటర్లు(ఈ రెండింటిలో తక్కువ విలువను పరిగణించడం జరుగుతుంది) వరకు మాత్రమే అభివృద్ధి పనులకు అనుమతి ఉంటుంది. | తీర్మానం: పి1 – ప్యాసివ్ వినోద జోన్‌లో అభివృద్ధికి సంబంధించిన నిబంధనను సవరించి, ప్లాట్ విస్తీర్ణంలో గరిష్టంగా 10 శాతం వరకు మాత్రమే అభివృద్ధికి అనుమతి ఉండేలా అథారిటీ ఆమోదం తెలిపింది. పి1 జోన్‌లో చేపట్టే ఏ అభివృద్ధి పనులకైనా రివ్యూ ప్యానెల్ అనుమతి తప్పనిసరిగా ఉండాలని కూడా అథారిటీ నిర్ణయించింది. |
| 3 | 300 చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భవనాలకు అనుమతించే ఎత్తు లెక్కించేటప్పుడు, పార్కింగ్ ఫ్లోర్ ఎత్తును మినహాయించి పరిగణనలోకి తీసుకోవడం. | అమరావతి రాజధాని నగర జోనింగ్ నిబంధనల అనుబంధం–2 ప్రకారం, 300 చదరపు మీటర్లు లేదా అంతకంటే పెద్ద ప్లాట్లలో రెసిడెన్షియల్ వినియోగానికి ఉపయోగించే భవనాల గరిష్ట ఎత్తు నిర్ణయించేటప్పుడు పార్కింగ్ ఫ్లోర్ ఎత్తును కూడా కలుపుకుని లెక్కించబడుతుంది. | తీర్మానం: అథారిటీ అమరావతి రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో ఈ సవరణను ఆమోదించింది. అమరావతి రాజధాని నగర జోనింగ్ నిబంధనల అనుబంధం–2 ప్రకారం, 300 చదరపు మీటర్లు లేదా అంతకంటే పెద్ద ప్లాట్లలో రెసిడెన్షియల్ వినియోగానికి ఉపయోగించే భవనాల ఎత్తును గణించేటప్పుడు పార్కింగ్ ఫ్లోర్ ఎత్తు మినహాయింపుకు అనుమతించబడుతుంది. పార్కింగ్ ఫ్లోర్ ఎత్తు కనీసం 2.5 మీటర్లు ఉండాలి. పార్కింగ్ ఫ్లోర్‌లో మెకానికల్ సిస్టమ్, లిఫ్ట్ ఉంటే, ఆ ఫ్లోర్ ఎత్తు కనీసం 4.5 మీటర్లు ఉండాలి. హై రైజ్ భవనాలలోని పార్కింగ్ ఫ్లోర్లను సైతం భవనం ఎత్తు గణించేటప్పుడు మినహాయిస్తారు. |
| 4 | అమరావతి నగరంలోని పీ2 జోన్‌కు సంబంధించి జోనింగ్ నిబంధనలలో మార్పులు. | అమరావతి రాజధాని నగర జోనింగ్ నిబంధనల అనుబంధం–1 మరియు అనుబంధం–2. | తీర్మానం: పీ2 జోన్‌కు సంబంధించిన జోనింగ్ నిబంధనల్లో ఈ సవరణలు చేయబడ్డాయి. జోనింగ్ నిబంధనల అధ్యాయాలు VIII అనుబంధం–1(ఉపయోగ మ్యాట్రిక్స్) మరియు IX అనుబంధం–2 ప్రకారం, తక్కువ సాంద్రత గల నివాస యూనిట్లు(G+2 అంతస్తులు) మరియు గ్రూప్ డెవలప్‌మెంట్ అనుమతించబడతాయి. FSI విలువ 1:1 ఉంచడంతో పాటు మిగతా విస్తీర్ణాన్ని పచ్చదనం కోసం ఉంచాలి. నిర్దిష్ట నిబంధనలు: భవనం యొక్క కవరేజ్ గరిష్టంగా 50% గరిష్ట FSI 1:1 కనీస ప్లాట్ విస్తీర్ణం 300 చ.గజాలు కనీస సెట్‌బ్యాక్ 2.5 మీటర్లు భవనం గరిష్ట ఎత్తు 10 మీటర్లు అదే విధంగా, ఏపీ సిఆర్‌డిఏ ఆధీనంలో ఉన్న భూమిలో సమీప వాణిజ్య విస్తీర్ణం, స్కీమ్ పరిధిలో ప్రజాహితార్థం కల్పించబడే మౌలిక సౌకర్యాలు అనుమతించబడతాయి. |

సం/- కమీషనర్, ఏ.పి.సి.ఆర్.డి.ఏ.


## వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు

# అధిక బిల్లుల నుంచి ఊరట

- కిలో వోల్ట్ యాంపియర్ రియాక్టివ్ అవర్ ఫీచర్ బ్లాక్ చేయండి
- వసూలు చేసిన సొమ్మును ఇప్పుడిచ్చే బిల్లుల్లో సర్దుబాటు చేయాలి
- డిస్కంలకు విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలు

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: వాణిజ్య కనెక్షన్ల ఎల్‌టీ విద్యుత్ వినియోగ దారులకు అధికంగా వస్తున్న బిల్లులపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. బిల్లుల పెరుగుదలకు కారణమైన కిలోవోల్ట్ యాంపియర్ రియాక్టివ్ అవర్ ఫీచర్‌ను వెంటనే బ్లాక్ చేయాలని డిస్కంలను ఆదేశించింది. ఇప్పటికే వసూలు చేసిన అదనపు బిల్లుల మొత్తాన్ని సంబంధిత వినియోగదారులకు తర్వాత జారీ చేసే బిల్లుల్లో సర్దుబాటు చేయాలని సూచించింది. గతంలో వైకాపా ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు కేవీహెచ్ విధానంలో బిల్లులు ఇవ్వాలని విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించింది.

ఈ విధానంలో పవర్ ఫ్యాక్టర్ నిర్వహణ కోసం వినియోగదారులు సొంతంగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. వాటి వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించకపోవడంతో కిలో వాట్ తో పోలిస్తే కిలో వోల్ట్ యాంపియర్ వినియోగం ఎక్కువగా నమోదయ్యేది. కేవీహెచ్ వినియోగం ఆధారంగా డిస్కంలు బిల్లులు ఇచ్చేవి. దీంతో వినిచయోగదారులకు బిల్లుల మోత మోగాది. అధిక బిల్లుల నుంచి వారికి ఊరట కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

వైకాపా ప్రభుత్వం నిర్ణయం మేరకు పరిశ్రమలు, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు 2019-20 ఆర్థిక సంవత్సరం కేవీహెచ్ విధానంలో బిల్లింగ్ చేయాలని కమిషన్ డిస్కంలకు సూచించింది. ఇందుకోసం స్మార్ట్ మీటర్లలో అధిక లీడింగ్ రియాక్టివ్ ఎనర్జీ ఫీచర్‌ను అన్‌బ్లాక్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు డిస్కంలు అన్‌బ్లాక్ చేశాయి. పవర్ ఫ్యాక్టర్ నిర్వహణకు వినియోగదారులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. అయితే, వాటి నిర్వహణపై అవగాహన లేకపోవడంతో రాత్రివేళల్లో కొందరు స్విచ్ ఆపేవారు కాదు. కెపాసిటర్లు రియాక్టివ్ పవర్‌ను వినియోగించుకోవడంతో బిల్లులు పెరిగిపోయేవి. అధిక బిల్లుల వ్యవహారంపై వినియోగదారులు డిస్కంల నుంచి అందిన వినతులను పరిగణనలోకి తీసుకుని కమిషన్ పరిశీలించగా సాధారణ మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత బిల్లులు పెరగడానికి కెపాసిటర్లు రియాక్టివ్ పవర్‌ను వినియోగించుకోవడమే కారణమని గుర్తించింది. దీంతో కేవీఏఆర్‌హెచ్ ఫీచర్‌ను మళ్లీ బ్లాక్ చేయాలని కమిషన్ డిస్కంలకు విద్యుత్ నియంత్రణ మండలిఉత్తర్వులు ఇచ్చింది.

## ఉద్యోగిని సర్వీస్ నుంచి తొలగించడం పెద్ద శిక్ష

విజయవాడ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఉద్యోగిని సర్వీసు నుంచి తొలగించడం పెద్ద శిక్ష అని, ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగింపు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని హైకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాంటి ఉత్తర్వులు చట్టం ముందు చెల్లవని స్పష్టంచేసింది. ఓ కళాశాలలో ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, వాచ్‌మెన్‌ను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఇంటర్ బోర్డు కమిషనర్ 2005 ఫిబ్రవరి 7న జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ విద్యాశాఖ అధికారులు దాఖలు చేసిన అప్పీలను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహనాథ శర్మల ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

## గీతం వర్సిటీకి భూ బదలాయింపుపై హైకోర్టులో విచారణ

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: గీతం సంస్థకు రూ.5 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను బదలాయించడంపై హైకోర్టులో విశాఖ పట్నంకు చెందిన న్యాయవాది గ్రేస్ పిల్ దాఖలు చేసారు. రాజకీయ ప్రయోజనాలతో ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా ప్రైవేట్ సంస్థలకు బదలాయించడం చట్టవ్యతిరేకమన్న పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. గీతం సంస్థకు ప్రభుత్వ భూమిని కేటాయిస్తుందనడానికి ప్రభుత్వం తరఫు న్యాయవాది ఆధారాలు లేవన్నారు. ప్రభుత్వం చట్టపరంగానే గీతం సంస్థకు భూమి బదలాయిస్తున్నదని గీతం సంస్థ తరఫు న్యాయవాది తన వాదనలను విన్పించారు. పిల్‌ను కొట్టివేయాలని ప్రభుత్వ తరఫు న్యాయవాది అభ్యర్థించగా, పిల్‌ను పూర్తిగా విచారించకుండా కొట్టివేయలేమని హైకోర్టు పేర్కొంది. పూర్తి ఆధారాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశించింది.

## ఎమ్మార్పీ ధరకే మద్యం విక్రయించాలి - డి.సిఎం పవన్ కల్యాణ్

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం ధరలు నిర్దేశిత గరిష్ట ధర(ఎమ్మార్పీ) కన్నా ఎక్కువగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఏపీలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదులపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్(ట్విట్టర్) వేదికగా ట్వీట్ పెట్టారాయన. కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని పవన్ చెప్పుకొచ్చారు. అది ప్రభుత్వానికి చెడ్డ పేరు కూడా తెస్తోందని పేర్కొన్నారు. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. సంబంధిత శాఖ అధికారులు మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. అధిక ధరలకు విక్రయించే మద్యం వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు పవన్ సూచించారు.


BAJAJ FINANCE
బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యువెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యువెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్‌ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(11-03-26) అనంతపుర్ - కల్యాణ్‌దుర్గ్ రోడ్; PIV9SGL15615245, 16138458. అనంతపుర్ - సుభాష్ రోడ్; PGA7SGL15616518, 15688787, 15778558, 15774508, 15800376, 15887111. బద్వేల్ - ఫోర్ రోడ్ సర్కిల్; PJU6SGL14354540, 15927362, 16017704, 16037872. బొబ్బిలి - పెద్ద బజార్ మైన్ రోడ్; PKI4SGL15897590, 15992225, 16030917, 16048677. చిలకలూరిపేట్ - ఎన్ఆర్‌టీ సెంటర్; PJU5SGL15688411. చిరాల - సంత బజార్; PEJ9SGL15803648, 15803253, 15829153, 16148243. చిత్తూర్ - డి ఐ రోడ్; PMM5SGL15598017. కడప - భాగ్యనగర్ కాలోని; PGA9SGL15619343, 15620019, 15774992, 15827986, 16151533. గుంతకల్ - వెజిటబుల్ మార్కెట్; PBV9SGL15645226, 15665180, 16046777. (12-03-26) గుంటూర్ - కొత్తపేట; PEK1SGL15780067, 15779128. హిందూపూర్ - ధన లక్ష్మీ రోడ్; PEG4SGL14563064, 14868215, 14870035, 14920999, 15599409, 15637875, 15810207, 15809857, 15807286, 15962190, 16103827, 16137108. జంగారెడ్డిగూడెమ్ - ఏలూరు మైన్ రోడ్; PGH1SGL15847128, 15847861, 15917161. కడప - ఎన్‌టీఆర్ సర్కిల్; PIW8SGL15581967, 15669899, 15656202, 16119049. కాకినాడ - జగన్నాయిక్‌పూర్; PBW1SGL16116504, 16119976. కాసీబుగ్గ - కేటీ రోడ్; PEG5SGL15906755, 16129005. కర్నూల్ - గాంధీ నగర్; PBW2SGL15697240, 15715733, 15732962. మదనపల్లె - ఎన్‌టీఆర్ సర్కిల్; PEG6SGL15657744, 15915068, 15985825, 16103965, 16131126, 16142934. నందిగామ - మైన్ రోడ్; PLN1SGL15797577, 15968957. (13-03-26) నంద్యాల్ - శ్రీనివాస్ నగర్; PEO1SGL15810580, 15933575, 15985699, 15984234, 16038169. నరసారావుపేట్ - అరుండేల్‌పేట్; PEO2SGL14564766, 14874954, 15895090, 16030071. నర్సీపట్నం - మైన్ రోడ్; PIW7SGL15692372, 15806006, 15873197. నెల్లూర్ - బీబీఎల్; P468SGL15571175, 15849137. నెల్లూర్ - కనకమహల్ సెంటర్; P19ISGL15918758, 16054270. నెల్లూర్ - నవాబ్‌పేట్; PXB4SGL15699551, 15761201, 15809113, 15889743, 15929659, 15963521, 15996266, 16011095, 16117607. నెల్లూర్ - వేదయపాలెం; PXB5SGL14449545, 15699878, 16101855, 16102518. ఒంగోలె అద్దంకి - బస్ స్టాండ్ సెంటర్; PEJ8SGL15637583, 15800045, 15928712, 15958616, 16056313, 16138664. పెందుర్తి - మైన్ రోడ్; POJ5SGL15997406, 16012336. (16-03-26) పీలేరు - కడప రోడ్; PEG3SGL14796335, 15689270, 15980139. రైల్వే - కోడూరు నేతాజీ రోడ్; PGC5SGL15666042, 15868039, 16045488. రాజమండ్రి - ఏవీ అప్పారావ్ రోడ్; PKD8SGL16136932. రాయచోటి - బంగ్లో రోడ్; PBW4SGL13826029, 15786644, 15844898, 15876961, 15896206, 16012826, 16037712, 16124006. శ్రీకాకుళం - రామలక్ష్మణ్ జంక్షన్; PBW5SGL15624528, 16027505. శృంగవరపు - కోట; PBW6SGL15984370, 16015234. సూళ్లూర్‌పేట - పాండు రంగ స్ట్రీట్; PBW7SGL15616267, 15669529, 15811080, 15811617, 15930553, 15930191, 15980552, 15988845, 16137038. తాడిపత్రి - యల్లనూర్ రోడ్; PBW8SGL15713742. (17-03-26): తణుకు - వెలుపురు రోడ్; PLH8SGL15781646. తెనాలి - గాంధీ చౌక్; PEK2SGL16140399. తిరుపతి - బైరాగి పట్టెడ; PMB8SGL13582070, 14515344, 14847307, 15642830, 15802992. తిరుపతి - కొర్లగుంట; PNB1SGL15823757. తిరుపతి - తిలక్ రోడ్; PMB9SGL15972545. తుని - సినివా రోడ్; PBW9SGL15640961, 15874460, 15907146, 16052905, 16073412, 16098859, 16143873. విజయవాడ - అజీత్ సింహ్ నగర్; PLB9SGL15956513, 16077895. విజయవాడ - భవానిపురం; PMB1SGL15624217, 15623202, 15798279, 15811313, 16034917. విజయవాడ - చిట్టీ నగర్; PMB3SGL15827472, 15898252, 15911968, 16125519. (18-03-26): విజయవాడ - గురునానక్ కాలోనీ; PGH4SGL16008942. విజయవాడ - ఇబ్రాహింపట్నం; PMB6SGL15642778, 15778521, 15839368, 15840120. విజయవాడ - మొఘల్‌రాజ్‌పురం; PGA8SGL15800678. విజయవాడ - రామవరపాడు; PMB5SGL15896819. వైజాగ్ - బీజీఎల్; PNQ5SGL15601980, 15641561, 15797639, 15798006, 15825988, 15826499, 15853715, 15848053, 16073626, 16074953. వైజాగ్ - ద్వారకానగర్; PI52SGL14690882, 15720363, 15739706, 16056277, 16145975. వైజాగ్ - గోపాలపట్నం; PB91SGL15583817, 15957902, 16053477. వైజాగ్ - హెచ్‌బీ కాలోనీ; PI58SGL16122855. (20-03-26) వైజాగ్ - కంచర పాలెం; PI54SGL15579100, 15848174, 15864120, 15908279, 15967993. వైజాగ్ - మధురవాడ; PI93SGL15812509, 16067359, 16098460, 16096407, 16145564. వైజాగ్ - ఎన్ఏడీ జంక్షన్; PI94SGL16006972. వైజాగ్ - కొత్త గాజువాక; PI53SGL15887919, 15898293, 15907862. వైజాగ్ - పెద్దవాల్తైర్; PI56SGL15598330, 15986875. వైజాగ్ - పెందుర్తి; PI92SGL15668999, 15723433, 15767225, 15809343, 16025644, 16026394. విజయనగరం - ఫోర్ట్ ఏ జీ రోడ్; PBX1SGL16094762. విజయనగరం - ఎంజీ రోడ్; PCZ4SGL14360171, 16027494.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

జన్మనిచ్చిన తల్లిదండ్రులను పూజించనియులుగా చూడలేనివారు దైవారాధన చేయడం శుద్ధ దండగ.

-సెక్కన్

# అడుగంటుతున్న భూగర్భజలాలు!

జలం జీవనాధారం. నీరు ఎక్కడుంటే అక్కడ జీవం ఉంటుంది. అందుకే 'ఎప్పుడు ఎడతెగక పారు యేరు..'ఉన్నచోటే ఎంపిక చేసుకోమన్నాడు సుమతీ శతకకారుడు. బర్రె పోతేకానీ పాడి సంగతి తెలియదంటారు. బావి ఎండిపోతే నీటి విలువ తెలుస్తుంది. వేసవి వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణమైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనరాహిత్యంతో పాటు ప్రకృతి సహాయనిరాకరణ కూడా తోడుకావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాలబారిన పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఎంతో సాధించామని చెప్పుకుంటున్నా ఇప్పటికీ దేశంలోని ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. అలాని నీటి సమస్య పరిష్కారం కోసం ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదని చెప్పడం లేదు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు, పెడుతున్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్రస్థాయి వరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యతీవ్రంగా ఉంటుంది. గత రెండు, మూడేళ్లుగా వర్షాలు కొన్ని ప్రాంతాల్లో అవసరానికి మించి పడుతున్నాయి. దేశవ్యాప్తంగా చూసినా వర్షాలు ఈ యేడాది సమృద్ధిగానే కురిసినట్టు అధికార లెక్కలు చెప్తున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో కుంభవృష్టి కురువగా, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాకాలంలో కూడా నీటికి కటకటలాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశవ్యాప్తంగా దాదాపు రెండువందల జిల్లాల్లో తక్కువ వర్షపాతం కురిసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈసారి వేసవిలో నీటికొరత తీవ్రంగా ఉండే అవకాశాలున్నట్లు భూగర్భశాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. బోరుబావుల వినియోగం దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోతున్నది. విద్యుత్ డిమాండ్‌తోపాటు నీటి వృథా కూడా పెరుగుతున్నదనే చెప్పొచ్చు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్ నీటివృథాను భారీగా పెంచుతున్నది. మరొకపక్క తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశంలోని అనేక రాష్ట్రాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా భారత్‌లో యేటా 250 ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు వినియోగిస్తున్నారు. దీనిపై ఏదో నామమాత్రపు నిబంధనలు ఉన్నా పట్టించుకోవడం లేదు. వాస్తవంగా దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకులను అవసరానికి మించి వాడుతున్నారు.పరిస్థితి ఇలాగేకొనసాగితే భూగర్భజలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ విధానాల వల్ల సన్నకారు, చిన్నకారు,మధ్యకారు రైతులు కొంతమేర లాభపడిన మాట వాస్తవమే అయినా నానాటికీ బోరుబావుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తున్నది. భూగర్భజలాల వినియోగం మూడింతలు పెరగడం, నీటి నియమాలు నీరుగారిపోతున్నాయనేందుకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో యాభైశాతం, రాజస్థాన్‌లో అరవైశాతం,కర్ణాటక,తమిళనాడులో నలభైశాతం భూగర్భజలాలు అధికంగా వాడుతున్నట్లు అనధికార లెక్కలు చెబుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో ఇష్టానుసారంగాలక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని గతంలోనే కేంద్రం అంగీకరించింది. పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానంగా దేశంలో 250 జిల్లాల్లో ఇనుము, 228 జిల్లాల్లో ఫ్లోరైడ్, 129 జిల్లాల్లో క్షారత్వం, 39 జిల్లాల భూగర్భజలాల్లో పాషాణం స్థాయి అధికంగా ఉన్నట్లు కేంద్రం గతంలో వివరించింది. ఇక పాతాళంలోకి దిగజారిపోతున్న జలాలను పైకి తోడడానికి అటు విద్యుత్ కానీ, ఇటు డీజిల్ కానీ వాడకం పెరిగిపోతున్నది. ఇంకొకపక్క రాబోయే వేసవిలో మంచినీటి కొరతను ఆసరాగా చేసుకొనికొందరు దళారులు వ్యాపారం విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక ప్రాంతాల్లో నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారం అదుపు లేకుండాపోతున్నది.ఇప్పుడు ఈవ్యాపారం నగరాలకేకాక,మండల కేంద్రాలకు,గ్రామాలకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా మంచినీటి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నాఅడిగేవారు, అడ్డగించేవారు లేకుండాపోతున్నారు. కలుషితనీరు అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయి. పాలకులు మంచినీటి విషయంలో ప్రత్యేక చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏ మాత్రం క్షేమంకాదు.ఇంకొకపక్క లక్షలాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా సముద్రంపాలవుతున్నది. ప్రజల్లో అవగాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రాను రాను తీవ్ర రూపం దాల్చుతున్నది. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి నుంచేపటిష్టమైన ప్రణాళికతో యుద్ధప్రాతిపదికపై చర్యలుచేపట్టాల్సిన అవసరం ఉంది.

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

గతంలోని వైఫల్యాలు భవిష్యత్తులో విజయాలకు మార్గం సుగమం చేస్తాయి.



సిసి కోల్టన్

# ప్రజావాక్కు



### పాజిటివ్ దృక్పథం అవసరం

విద్యార్థి పరీక్షలో పాస్ అయినా వ్యాపారికి వ్యాపారంలో లాభం వచ్చినా నిరుద్యోగికి మంచి ఉద్యోగం ఒరొకినా ఎన్నికల్లో ఏదైనా రాజకీయపార్టీ గెలిచినా ఎంతో ఆనందిస్తారు. వారి ఆనందానికి పట్టపగ్గాలు ఉండవు. స్నేహితులని, చుట్టాలని ఇరుగుపొరుగు వారిని కలిసి వీరితో తమ ఆనందాన్ని పంచుకుంటారు. అందిరికి మిఠాయి తినిపిస్తారు. వ్యతిరేకంగా జరిగితే తీవ్ర నిరాశకు గురవుతారు. సర్వం కోల్పోయినట్లు బాధపడుతుంటారు. అలాగే ఆటలో క్రీడాకారులు విజేతగా నిలిచినా ఇలానే ఉంటుంది. సంతోషంతో గంతులు వేస్తూ మైదానంలో తిరుగుతారు. సంతోషంలో వారికి మాట కూడా తడబడుతుంది. ఓడినప్పుడునీరసపడుతుంటారు.అయితే ఇలాఎవరూ ప్రవర్తించకూడదు. మనిషి జీవితం అంటేనే సుఖదుఃఖాలు.

- మిథునం, హైదరాబాద్

### సాదాబైనామా వర్తింప చెయ్యాలి

రెండువేల పదిహేను సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని42గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయడం జరిగింది. 2020 అక్టోబర్, నవంబర్ నెలలో భూమి పాస్ బుక్ కానీ రైతులు, సాదబైనామా ద్వారా కొనుగోలు చేసినవారికీ, పాస్‌బుక్‌ల కోసం అప్లై చేసుకోమని అప్పటి తెరాస ప్రభుత్వం చెపితే, మీ సేవ లో కొన్ని వేల మంది రైతులు, కొన్ని వేల ఎకరాల భూమి పాస్ బుక్‌ల కోసం అప్లై చేసుకున్నారు. ఇప్పుడు కోర్టు స్టేఎత్తి వేసిన పిదప 42 గ్రామాల రైతులకు వర్తించదు, అని రెవిన్యూ అధికారులు చెప్పుతున్నారు. విలీనమైన గ్రామాలలోని, రైతుల వ్యవసాయ భూములకు కూడా వర్తింపా చేయాలి.

- బీరం రాములు, వరంగల్

### ఆచరణ ఏదీ?

అత్యున్నత పదవిలోఉన్నవారుఅట్టడుగుస్థాయిలోని వారు వారని వీరని కాదు ఏ ఒక్కరు సంయమనం పాటించడం లేదు. తరచు ఆగ్రహావేశాలను ప్రదర్శిస్తూ ఒకరిపై ఒకరు విరుచుకుపడుతున్నారు. ఇష్టమొచ్చినట్లు తిట్టుకుంటున్నారు. ఈవిషయంలో ఏఒక్కరు తగ్గడం లేదు. ఈతిట్లు జుగుప్సాకరంగా కర్ణకఠోరంగఉంటున్నాయి.మహిళలను వయసులో పెద్దవారినీ వీరు వదలటం లేదు. మహాత్మాగాంధీ, గౌతమ బుద్ధుడు, ఆదర్శంగా తీసుకోవాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ఇక గాంధీ ముక్త్ భారతేనా?

జవహర్‌లాల్‌నెహ్రూ గాంధీకి అత్యంత సన్నిహితుడు, స్నేహితుడు. దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూతో కలిసి బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాటం చేశారు.ఆ తరువాత గాంధీ మద్దతుతో నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారు. నెహ్రూకి కుడి భుజంలా ఉండి సలహాలు, సూచనలు ఇచ్చేవారు.నెహ్రూకి కూడా గాంధీ అంటే వల్లమాలిన అభిమానం, గౌరవం. ఈ కారణంతోనే నెహ్రూ తన కుమార్తె పేరుకి చివరన గాంధీని చేర్చారు. ఆ తరువాత ఈ ఆనవాయితీ కొనసాగుతూవచ్చింది. అయితే నెహ్రూ అంటే ప్రస్తుత పాలకలకు అసలు గిట్టదు. అతి చాలక నెహ్రూ కుటుంబంతో ఇప్పుడు ఎంతో మంది గాంధీలు ఉన్నారు. వారందరు ప్రస్తుత పాలకులకు ప్రత్యర్థులు.

- శాస్త్రి, హైదరాబాద్

### డిజిటల్ విప్లవం

డిజిటల్ విప్లవం మన జీవనశైలిని సులభతరం చేసినప్పటికీ, మానవ సంబంధాల మధ్య పెను మార్పులను తీసుకువచ్చింది. ప్రపంచం మన గుప్పిట్లోకి చేరిందన్న సంతోషంలో, పక్కనే ఉన్న మనుషులకి మనం దూరమవుతున్నాం. ఒకే గదిలో ఉన్నా, భోజన టేబుల్ వద్ద కూర్చున్నా సంభాషణల కంటే మొబైల్ నోటిఫికేషన్లకే ప్రాధాన్యత ఇస్తున్నాం. స్నేహితులతో ముఖాముఖి కలిసే సందర్భాలను వీడియో కాల్స్, ఎమోజీలు భర్తీ చేస్తున్నాయి,దీనివల్ల భావోద్వేగాల్లో లోతు తగ్గి సామాజిక వియోగం ఏర్పడుతోంది.వందల కొద్దీ సోషల్ మీడియా స్నేహితులు ఉన్నా, మనసువిప్పి మాట్లాడుకునే వారు కరువవుతున్నారు. వర్చువల్ ప్రపంచంలోని కృత్రిమ జీవనశైలితో పోల్చుకుంటూ యువత ఆందోళన, ఒంటరితనం వంటి మానసిక సమస్యల బారిన పడుతున్నారు. నిజానికి సమస్య సాంకేతికతలో లేదు, మన వినియోగ విధానంలోనే ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బదలీ అయినవారికి పోస్టింగ్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్నప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీల బదలీలను నిర్వహించిన వారికి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలి.పోస్టింగ్ ఇవ్వకుండా ఎక్కడివారిన అక్కడే ఉంచినట్లయితే బదలీలు వృధా అవుతాయి. కొంత మందికి పోస్టింగ్ ఇచ్చి మరికొంత మందికి ఇవ్వకపోవడం బాధాకరం. బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలి. మోడల్ స్కూల్స్ సిబ్బందికి అవకాశాన్ని కల్పించాలి.ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలి.

- టి. సురేష్, ఆంధ్రప్రదేశ్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మున్సిపల్ గెలుపే రాజకీయ దిశానిర్దేశం!

**తెలంగాణలో పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు,స్థానిక సమస్యలపై అవగాహన కీలకంగా ఉంటాయి. పార్టీ ఇమేజ్ ఎంత బలంగా ఉన్నా, స్థానికఅభ్యర్థిపై అసంతృప్తి ఉంటే ఫలితాలు ప్రతి కూలంగా మారేఅవకాశం ఉంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల పార్టీకంటే అభ్యర్థి వ్యక్తిగత ప్రభావమే గెలుపును నిర్ణయించిన సందర్భాలున్నాయి. అందువల్ల ఈసారి కాంగ్రెస్, బీఆర్ ఎస్,బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేకజాగ్రత్తలు తీసుకుం టున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా కీలక సూచికగా మారనుంది. అయితే ఇటీవల పట్టణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం,సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ కావడంతో ఓటింగ్ శాతం పెరిగేఅవకాశాలున్నాయి.**

**రామ కిష్టయ్య సంగన భట్ల**

తెలంగాణలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల నేపథ్యం రాష్ట్ర రాజకీయాలను మరో కీలక మలుపు వద్ద నిలబెడుతోంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలుగాభావించే మున్సిపల్ ఎన్నికలు ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీకి, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌కు, అలాగే బీజేపీకి రాజకీయంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి.2023అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు అనంతరం తొలిసారిగా పట్టణ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని కొలిచే అవకాశం రావడంతో ఈ ఎన్నికలు కేవలం మున్సిపాలిటీ పాలనకే పరిమితం కాకుండా, రాష్ట్రస్థాయి రాజకీయ బలాబలాలను నిర్ణయించే పరీక్షగా మారాయి. అందువల్లే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు మినీ అసెంబ్లీ ఎన్నికలుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.తెలంగాణలో మున్సిపల్ పాలనకు ప్రత్యేక చరిత్ర ఉంది. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పట్టణీకరణ వేగంగా పెరిగింది. హైదరాబాద్‌తోపాటు వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రామగుండం వంటి పట్టణ కేంద్రాలు ఆర్థికంగా, జనాభా పరంగా విస్తరించాయి. 2011 జనగణన ప్రకారం తెలంగాణలో పట్టణ జనాభా సుమారు 38 శాతంగా ఉండగా, తాజా అంచనాల ప్రకారం ఇది 42శాతానికి చేరువవుతోంది. అంటే రాష్ట్ర రాజకీయాల్లో పట్టణ ఓటర్ల పాత్ర రోజురోజుకీ పెరుగుతోంది. ఈ పట్టణ ఓటర్లే మున్సిపల్ ఎన్నికల ద్వారా తమ అసంతృప్తి లేదా మద్దతును నేరుగా వ్యక్తంచేసే స్థితిలో ఉన్నారు. గత దశాబ్దంలో తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తే, అవి రాష్ట్ర రాజకీయాలకు సూచికలుగా ఎలా మారాయో స్పష్టంగా తెలుస్తుంది. 2019-20లో అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ (అప్పట్లో టీఆర్‌ఎస్) మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది.141మున్సిపాలిటీల్లో 88కి పైగా చోట్లబీఆర్‌ఎస్ ఆధిపత్యం కొనసాగింది. ఆ ఫలితాలు తరువాత జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ రాజకీయ వేడిని పెంచాయి. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు బీజేపీ ఎదుగుదలకు వేదికగా మారగా, బీఆర్‌ఎస్ తన పట్టును నిలుపుకుంది. ఈ పరిణామాలన్నీ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ దిశను ఎలా ప్రభావితం చేస్తాయో అప్పుడే నిరూపించాయి.ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు ముగింపు పలకడం తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పు. ఈ నేపథ్యంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ప్రజల ముందుకు వెళ్లే ఈఎన్నికల్లో ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలు, పాలన శైలి నేరుగా ప్రజా తీర్పుకు లోనవుతుంది. అందుకే కాంగ్రెస్‌కు ఈఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో మున్సిపల్ ఎన్నికలు రెండు విధాలుగా కీలకం. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో పొందిన ప్రజాభిమానాన్నిపట్టణ స్థాయిలోనూ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

మరోవైపు బీఆర్‌ఎస్ హయాంలో బలంగాఉన్న పట్టణస్థానిక సంస్థలపై తన పట్టుసాధించాల్సిన రాజకీయ అవసరం ఉంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 142 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో అధిక భాగం ఇప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభావంలోనే ఉన్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్‌ప్రభుత్వం పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో తన సామర్థ్యాన్ని చూపించాల్సి ఉంటుంది.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు పట్టణ ప్రజల్లో ఎంత మేరకు విశ్వాసం పొందాయన్నది కూడా ఈ ఎన్నికల్లో తేలనుంది. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత




బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం, జీవన వ్యయం, ఇంధన ధరలు, అద్దె భారం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలపై ప్రజల స్పందన కాంగ్రెస్‌కు కీలకంగా మారనుంది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌కు ఈ మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పునరుజ్జీవనానికి అవకాశంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న అంతర్గత అసంతృప్తులు, నాయకుల వలసలు, కార్యకర్తల్లో నైరాశ్యం వంటి పరిస్థితుల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు పరీక్షగా నిలుస్తున్నాయి. గతంలో పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు ఉన్న పార్టీగా పేరున్న బీఆర్‌ఎస్, ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే తన రాజకీయ స్థితిని తిరిగి బలపరుచుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, ఉత్తర తెలంగాణ పట్టణాల్లో బీఆర్‌ఎస్‌కు ఇప్పటికీ గణనీయమైన ఓటు బ్యాంకు ఉందన్న అంచనాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ వ్యూహం ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల చుట్టూ తిరగనుంది. అధికారంలోకి వచ్చి తక్కువ కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు కాలేదని, అభివృద్ధి పనులు నిలిచి పోయాయని, ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆరోపణలు చేస్తూ పట్టణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మున్సిపాలిటీలకు నిధుల కొరత, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికలు తన రాజకీయ ప్రాధాన్యత ఇంకా తగ్గలేదని నిరూపించుకునే వేదికగా మారాయి. మూడవ ప్రధాన పార్టీగా బీజేపీ కూడా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గణనీయమైన విజయాలు సాధించిన బీజేపీ, పట్టణ ఓటర్లలో తన పట్టు పెంచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి, యువత, వ్యాపార వర్గాల్లో తన ప్రభావాన్ని విస్తరించేందుకు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యపోటీని ఆసరాగా చేసుకుని కొన్ని పట్టణాల్లో కీలకపాత్ర పోషించాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధానంగా చర్చకువచ్చే అంశాలు పట్టణ జీవనానికి నేరుగా సంబంధించినవే. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, చెత్తనిర్వహణ, రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ సమస్యలు, అక్రమ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక లోపాలువంటి సమస్యలు ఓటర్లను ప్రభావితం చేస్తాయి. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కొన్ని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, అనేకచోట్ల అసమాన అభివృద్ధి జరిగిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలను ఎంత వేగంగా పరిష్కరిస్తుందన్నది ప్రజల తీర్పులో కీలకంగా మారనుంది.గణాంకాల పరంగా చూస్తే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రాధాన్యత మరింత స్పష్టమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి సుమారు 3,500కు పైగా వార్డులు ఉన్నాయి. ఒక్కోవార్డులో సగటున 3,000 నుంచి 5,000వరకు ఓటర్లు ఉంటారు. అంటే దాదాపు కోటిమంది పట్టణ ఓటర్లు నేరుగా ఈఎన్నికల్లో పాల్గొంటారు. ఈస్థాయి ఓటర్ల అభిప్రాయం రాష్ట్రరాజకీయాలకు స్పష్టమైన సంకేతాన్ని ఇస్తుంది. అంతేకాదు,ఈఎన్నికల ద్వారా వేలాది మంది ప్రజాప్రతినిధులు ఎంపిక అవుతారు. వీరిలో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఎదిగే నాయకులు ఉండే అవకాశం ఉంది.అందువల్ల అన్నిపార్టీలు ఈ ఎన్నికలను నాయకత్వ తయారీవేదికగాకూడా చూస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. తెలంగాణలో పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు,స్థానిక సమస్యలపై అవగాహన కీలకంగా ఉంటాయి. పార్టీ ఇమేజ్ ఎంత బలంగా ఉన్నా, స్థానికఅభ్యర్థిపై అసంతృప్తి ఉంటే ఫలితాలు ప్రతి కూలంగా మారేఅవకాశం ఉంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల పార్టీకంటే అభ్యర్థి వ్యక్తిగత ప్రభావమే గెలుపును నిర్ణయించిన సందర్భాలున్నాయి. అందువల్ల ఈసారి కాంగ్రెస్, బీఆర్‌ఎస్,బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేకజాగ్రత్తలు తీసుకుంటున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా కీలక సూచికగా మారనుంది. అయితే ఇటీవల పట్టణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం,సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ కావడంతో ఓటింగ్ శాతం పెరిగేఅవకాశాలున్నాయి. అధిక ఓటింగ్ ప్రభుత్వంపై అసంతృప్తిని సూచిస్తుందా లేక ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుందా అన్నది ఫలితాల అనంతరం విశ్లేషణకు అంశంగా మారనుంది. ●

# ప్రాణాల కంటే హక్కులే ముఖ్యమా?

**తిప్పర్తి శ్రీనివాస్**

దేశవ్యాప్తంగా వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకప్పుడు అరుదుగా వినిపించిన కుక్కల కాట్ల ఘటనలు, నేడు నిత్య వార్తలుగా మారాయి. చిన్నారులు, వృద్ధులు, పాదచారులు, కార్మికులు ఎవరూ మినహాయింపు కాదు. గాయాలపాలవుతున్న వారి సంఖ్య పెరుగుతుండగా, కొన్నిసందర్భాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇది కేవలం జంతు సమస్య మాత్రమే కాదు, ఇది ప్రజారోగ్యం, భద్రత, పాలనకు సంబంధించిన అత్యంత కీలక అంశం.కుక్కలుకరవడం కొత్త విషయం కాదు. అయితే ఇటీవలకాలంలో ఈ ఘటనలు అసాధారణంగా పెరిగాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వీధుల్లోకుక్కల గుంపులు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రివేళల్లో బయటకు రావడానికే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. స్కూల్‌కు వెళ్లే పిల్లలు, పనికి వెళ్లే మహిళలు,వృద్ధులు తమ ప్రాణభద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో రేబీస్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు కూడా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, మున్సిపల్ సంస్థలు తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తిస్తున్నాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. జంతు జనాభా నియంత్రణ, టీకాలు, ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రణాళికలున్నా,అమలు లోపించడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. ఇలాంటి నేపథ్యంలో వీధి కుక్కల నిర్వహణపై సుప్రీంకోర్టు కొన్ని కీలక సూచనలు చేయడం గమనార్హం. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, స్థానికసంస్థలు బాధ్యత తీసుకోవాలని, నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ సూచనలను జంతు ప్రేమిక సంఘా



లు తీవ్రంగా ఖండించడం మరో వివాదానికి దారి తీసింది. జంతు ప్రేమికుల వాదన కూడా పూర్తిగా విస్మరించదగినది కాదు. కుక్కలు కూడా జీవులు, వాటికి జీవించే హక్కు ఉందని వారు అంటున్నారు.అక్రమంగా లేదా అమానుషంగా కుక్కలను చంపడం మానవత్వానికి విరుద్ధమని హెచ్చరిస్తున్నారు. కుక్కలను చంపితే కేసులుపెడతామన్నహెచ్చరికలూ వినిపిస్తున్నాయి. కానీ ఇక్కడ ఒక కీలకప్రశ్న తలెత్తుతోంది. జంతు హక్కుల పేరుతో మానవ ప్రాణాల విలువను తక్కువ చేయవచ్చా? మానవ జీవితం అత్యున్నతమైనది అనే సత్యాన్ని ఎవ్వరూ విస్మరించలేరు. ఒకచిన్నారి ప్రాణం పోయిన తర్వాత, కుక్కలకూ హక్కులున్నాయి అనే వాదన బాధిత కుటుంబాలకు ఓదార్పునిస్తుందా? జంతు ప్రేమ మానవ భద్రతను మింగేయకూడదు. ఇక్కడ అవసరమైంది వైఖరులు కాదు, సమతుల్య దృక్పథం.వీధి కుక్కల సమస్యకు పరిష్కారం కేవలం చంపడంలో లేదు, అలాగే పూర్తిగా వదిలేయడంలో కూడా లేదు. శాస్త్రీయంగా, మానవీయంగా సమస్యను ఎదుర్కోవాలి. జనాభా నియంత్రణ కోసం సమర్థవంతమైన స్టెరిలైజేషన్ కార్యక్రమాలు, నిరంతర టీకాలు, ప్రత్యేక ఆశ్రయ కేంద్రాల ఏర్పాటు, చెత్త నిర్వహణలో క్రమశిక్షణ ఇవన్నీ సమగ్రంగా అమలుచేయాల్సినఅవసరంఉంది. కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా బాధ్యతతో వ్యవహరించాలి.జనసాంద్రత ఉన్నప్రాంతాల్లో గుంపులుగా ఆహారం పెట్టడం ప్రమాదాలకు దారితీస్తుందన్న అవగాహన కల్పించాలి.ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, జంతు ప్రేమికులు, ప్రజలు అందరూకలిసి ఆలోచించినప్పుడేపరిష్కారంసాధ్యం. ఒకరి మీద ఒకరు నిందలువేయడంవల్ల సమస్య పరిష్కారంకాదు. ప్రజల ప్రాణభద్రతతో రాజీపడకుండా,జంతువుల పట్లమానవత్వాన్ని కాపాడటం సాధ్యమే. చివరగా ఒక మాట వీధి కుక్కల సమస్యమన నాగరికతకు పరీక్ష. ఈపరీక్షలో మనం మానవత్వాన్ని కోల్పోకుండా, మానవ జీవితాన్ని కాపాడగలిగితేనే నిజమైన పరిష్కారం సాధించినట్టవుతుంది. ●

# బహుళజాతి సంస్థల ఆర్థిక ఆధిపత్యం!

**బొల్లిముంతసాంబశివరావు**

నేడు ప్రపంచంలో బహుళజాతి సంస్థల ఆర్థిక ఆధిపత్యం కొనసాగుతున్నది. ఈఆధిపత్యంలో అమెరికా సంస్థలు అగ్రస్థానంలో ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాతకాలంలో సామ్రాజ్యవాద శక్తికింద ఉన్న అనేక ప్రాంతాలు స్వయం పాలన పొందాయి. అమెరికా దాని దిగ్గజ సంస్థల ద్వారా అతిపెద్ద పారిశ్రామిక శక్తిగా అవతరించింది. ఈకార్పొరేట్లు తమ అనుబంధ సంస్థల ద్వారా వెనుకబడిన దేశాలకు మూలధనం ఎగుమతి చేయడం ప్రారంభించాయి. అమెరికా ఇప్పుడు దాని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్డిఐ) ద్వారా మూలధనాన్ని ఎగుమతిచేసే అత్యంత ఆధిపత్య దేశంగా మారింది. బహుళజాతి సంస్థలకు లాభాలు పెంచుకునే ఉద్దేశమే ప్రధానమైంది. లాభాలను తమదేశాలకు తరలించుకుపోవడం, రాయిల్టీ చెల్లింపులు, కమీషన్లు సాంకేతిక కన్సల్టెన్సీ రుసుముల ద్వారా బహుళజాతి సంస్థల దోపిడీ కొనసాగుతున్నది.ఇప్పుడు బహుళజాతి సంస్థలఆర్థికదోపిడీని నయావలసవాదంలేదానయాసామ్రాజ్యవాదంగావెనుకబడినదేశాలకువిస్తరింపచేశారు. తమశాఖల అనుబంధ సంస్థల ద్వారా వివిధ దేశాల పారిశ్రామిక మార్కెటింగ్ ప్రాంతాల్లో తమ కార్యక్రమాలను విస్తరించుకుంటాయి. అనేకరంగాల్లో పెద్దఎత్తున ఉత్పత్తులు చేస్తూ అనేక దేశాలపై వ్యాపార వ్యూహాన్ని విస్తరిస్తాయి. 1990 ప్రారంభంలో 37 వేల బహుళజాతి కంపెనీలు అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థను ఆక్రమించాయి. ఈకంపెనీలు భారీమొత్తంలో ఆర్థికవనరులు కలిగి ఉన్నాయి. 200వందల అగ్రశ్రేణి బహుళజాతి కంపెనీలు (ఎంఎన్సి)సంపాదించిన ఆదాయం 1982లో 3,046 బిలియన్ల డాలర్ల నుండి 1992నాటికి 5,862 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈకాలంలో ప్రపంచ జీడీపీలో బహుళజాతి సంస్థల వాటా 24.2 శాతం నుండి 26.8శాతానికిచేరింది. 1992లో బహుళజాతి సంస్థల మొత్తం లాభాలు 73.8 బిలియన్డాలర్లు. ఇందులో అతిపెద్ద 10బహుళజాతి సంస్థల వాటా 38.8 బిలియన్డాలర్లు. (అంటే 47శాతం) నేడు ప్రపంచంలో బహుళజాతి సంస్థల సంఖ్య 60 వేలుదాటింది.స్వాతంత్ర్యం వచ్చినదగ్గర నుంచిప్రపంచంలోని వివిధదేశాల నుంచి ముఖ్యంగా అమెరికానుంచి విదేశీ సహకారాల రూపంలో బహుళజాతి సంస్థలు భారతదేశంలోకి ప్రవేశించాయి. దేశ పాలకులు వాటిని ఆహ్వానించారు. భారత ఆర్థిక వ్యవస్థలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశించడం, దేశ ఆర్థికవ్యవస్థపై దాని దుష్ప్రభావం వెడల భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పాలకుల విధానాల వల్ల నేడు భారత ఆర్థికవ్యవస్థపై బహుళజాతి సంస్థల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. 1970లో కూడా అత్యున్నత స్థానంలో ఉన్నకంపెనీల ఆస్తులలో దాదాపు 37.7శాతం బహుళజాతిసంస్థల నియంత్రణలో ఉంది. పారిశ్రామిక లైసెన్సింగ్ విధాన విచారణ కమిటీ అంచనాల ప్రకారం 1966లో భారత దేశంలో 10కోట్ల రూపాయలు అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులతో దాదాపు 112 బహుళజాతి సంస్థలు పనిచేశాయి. ఈకంపెనీల్లో 48 కంపెనీలు విదేశీ శాఖల లేదా విదేశీ కంపెనీల భారతీయ అనుబంధ సంస్థలు 14 ఇతర కంపెనీలు భారీ రుణాలు, 54శాతంగా ఉంది. మిగిలినఇతర కంపెనీలు కూడా విదేశీ ఆధిపత్యంలోనేఉన్నాయి. 1960ల మధ్యకాలంలో పాశ్చాత్య విదేశీ మూలధనం దేశంలోని పెద్దవ్యాపారాలపై ఆధిపత్యం కలిగిఉంది. భారత దేశంలోని బహుళజాతి సంస్థల ముఖ్యమైన లక్షణం ఏమిటంటే,అవిభారత ఆర్థికవ్యవస్థ వనరుల్లోనే ఎక్కువ భాగాన్ని సేకరిస్తున్నాయి. సుదీప్చాదరి 1956 నుంచి1975 సంవత్సరం వరకు 50 అతిపెద్ద విదేశీ అనుబంధ సంస్థల నమూనాలను తీసుకుని బహుళ జాతి ఆర్థిక వనరులపై అధ్యయనం చేశాడు. ఈకంపెనీల మొత్తం ఆర్థిక వనరుల్లో 5.4 శాతం మాత్రమే విదేశీవనరుల ద్వారా అందించబడిందని మిగిలిన 94.6 శాతం భారతదేశవనరుల ద్వారా అందించబడిందని ఆయన అధ్యయనం వెల్లడించింది. బహుళజాతి కార్పొరేట్ సంస్థలు భారత దేశం నుంచి పెద్ద ఎత్తున లాభాలు తరలించుకుపోతున్నాయి. 2020-21లో 2లక్షల, 50 వేలకోట్ల రూపాయలుగా ఉన్న కార్పొరేట్ లాభాలు 2024-25 లో7లక్షల, వెయ్యికోట్ల రూపాయలకు చేరాయి. ఈ విషయాన్ని రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించింది. దేశంలో సంవత్సర కాలంలో కార్పొ రేట్ సంస్థల పన్నుల కంటే వాటి యజమానుల వ్యక్తిగత పన్నులు మించిపోయాయి. 2020-21నుంచి 2025 మధ్య కాలంలో బహుళజాతి సంస్థల లాభాలు మూడింతలు పెరిగినట్లు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. దేశంలో ఆర్థిక అసమానతల ముఖచిత్రాన్ని కార్పొరేట్ల లాభాలు బహిరంగ పరుస్తున్నాయి. దేశం మొత్తం జనాభాలోని 10శాతం మంది వద్ద 77 శాతం సంపద పోగుబడి ఉంది. ఒక్సాఫామ్ నివేదిక ప్రకారం 2017లో దేశసంపదలో 73 శాతం సంపద1 శాతం సంపన్నులకు చేరింది. కటిక పేద వారైన 67 కోట్ల ప్రజల్లో సగం మంది ఆస్తిలో కేవలం 1శాతం పెరుగుదల మాత్రమే ఉంది. కార్పొరేట్ల సంపద పెరుగుదలతోపాటు ప్రభుత్వం కూడా పెద్దఎత్తున రాయితీలతోపాటు, రుణాలను రద్దు చేస్తున్నది. రిజర్వుబ్యాంక్ ఇండియా ఇచ్చిన డేటా ప్రకారం 2014- 2024 వరకు భారతీయ బ్యాంకులు మొండి బకాయిల పేరుతో 16,61,310 కోట్ల కార్పొరేట్ల రుణాలు రద్దుచేశాయి. ఇవికాక 2024-25 ఆర్థికసంవత్సరంలో 91,260 కోట్ల రూపాయల బకాయిలు రద్దుచేశాయి. స్వతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి దేశ పాలకులు సామ్రాజ్య వాద ప్రయోజనాలు కాపాడుతూ, బహుళ జాతి సంస్థల ప్రవేశానికి గేట్లు బార్ల తెరిచారు. ఫలితంగా బహుళజాతి సంస్థల ఆర్థిక ఆధిపత్యం, వాటి దోపిడీ, సంపద తరలింపు దేశం నుంచి పెద్దఎత్తున కొనసాగుతున్నది. కేంద్రప్రభుత్వం కూడా వాటి ప్రయోజనాలకు అను గుణమైన విధానాలు అమలు జరుపుతున్నది. బహుళజాతి సంస్థల దోపిడీకి, దేశసంపద తరలింపుకి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భారత ప్రజలు ఉద్యమించాలి. ●

# ఆ 'డీల్'తో యుఎస్‌కే ప్రయోజనం

## వాణిజ్య ఒప్పందంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన విపక్షాలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3:** భారత్‌-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు.
ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. గతంలో 34 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా ప్రధాని బదులు ట్రంప్ నుంచి ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదని ఆ వ్యాఖ్యానించారు. అమెరికా తన ప్రయోజనాలు లేకుండా ఏ ఒప్పందమూ చేసుకోదని, దీని వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. అమెరికా చాలా తెలివైన వ్యాపారి. ఆయుధాల కొనుగోలు లేదా కొన్ని మార్గాల నుంచి చమురు కొనవద్దనే ఒత్తిడి వంటివి దీని వెనుక ఉండొచ్చు. వారు బహిరంగంగా ఒప్పుకోరు కానీ, కచ్చితంగా ఏదో దాగి ఉందని ఆయన అన్నారు. మరో కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథుర్ మాట్లాడుతూ, వాణిజ్య ఒప్పందం అయినా, మరోటైనా అన్నీ ట్రంపే చేస్తున్నారు. భారత్ అమెరికాకు లొంగిపోయిందా ఈ ఒప్పందం చుట్టూ ఎన్నో అనుమానాలు అలుముకున్నాయి. వ్యవసాయ ఒప్పందాలు, రైతుల హక్కుల సంగతేంటి రష్యా నుంచి కాకుండా వెనిజులా, అమెరికా నుంచి చమురు కొనాలనే ఒత్తిడి నిజమేనా వీటన్నింటిపై స్పష్టత రావాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రభుత్వం సభలో దీనిపై చర్చకు సిద్ధపడాలని డిమాండ్ చేశారు. రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల సంబంధాలను దెబ్బతీసేలా అమెరికా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రామన్ సింగ్ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న రష్యా చమురును కాదని, ఎక్కువ ధరకు వెనిజులా నుంచి కొనాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి.

# హెచ్1బి వీసా ప్రక్రియ మరింత కఠినం



## రిజిస్ట్రేషన్లకు తేదీలు వెల్లడి

**వాషింగ్టన్,ఫిబ్రవరి 3:** అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీ నిపుణుల కోసం ఇచ్చే హెచ్1బి వీసాల ప్రక్రియలో అగ్రరాజ్యం భారీ మార్పులు చేపట్టింది. 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వీసా రిజిస్ట్రేషన్ గడువును యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. ఈసారి నిబంధనలు గతంలో కంటే కఠినంగా ఉన్నాయి. మార్చి 4వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభించి మార్చి 19వ తేదీ ఫలితాలను వెల్లడిస్తారు. ట్రంప్ ప్రభుత్వం 2025 సెప్టెంబర్‌లో తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం కొన్ని రకాల హైస్కిల్డ్ పొజిషన్లకు ఎంపికైన వారు ఏకంగా రూ. లక్ష డాలర్ల అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత మారకం విలువల ప్రకారం భారత కరెన్సీలో కనిష్టంగా 90 లక్షలరూపాయలు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా అమెరికా వెలుపల ఉండి వీసా కోసం దరఖాస్తు చేసే వారికి ఈ భారం తప్పదు. ఇది కంపెనీలకు పెను ఆర్థిక భారంగా మారనుంది. అలాగే ప్రాథమిక రిజిస్ట్రేషన్ ఫీజును కూడా 10 డాలర్ల నుంచి 215 డాలర్లకు పెంచారు. ఇప్పటివరకు ఉన్న రాండమ్ లాటరీ విధానానికి బదులు ఈసారి వెయిటేజ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అంటే ఎవరికైతే ఎక్కువ జీతం ఆఫర్ చేస్తారో, వారికి వీసా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నైపుణ్యం గల వారికి ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యంగా ఈ మార్పు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. నియామక సంస్థలు ముందుగా యుఎస్‌సిఐఎస్ వెబ్‌సైట్‌లో అకౌంట్ తెరిచి తమ ఉద్యోగుల వివరాలను నమోదు చేయాలి. కేవలం లాటరీలో ఎంపికైన వారు మాత్రమే ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయిలో వీసా పిటిషన్లను దాఖలు చేయడానికి అర్హులు. ఈ భారీ ఫీజు పెంపు 1,00,000 డాలర్లు పై అమెరికాలోని పలు ఐటీ కంపెనీలు, వాణిజ్య మండలి కోర్టును ఆశ్రయించాయి. కోర్టు ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఈ ఏడాది దరఖాస్తు చేసే వారు ఈ ఖర్చుకు సిద్ధపడాల్సిందే. ముఖ్యంగా చిన్న తరహా కంపెనీలు, స్టార్టప్‌లు ఈ నిబంధన వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

# పారిశుద్ధ్య కార్మికురాలు పద్మను సత్కరించిన రజనీకాంత్



**చెన్నై,ఫిబ్రవరి 3:** సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన ఉదార స్వభావాన్ని, మంచి మనసును చాటుకున్నారు. నిజాయతీగా వ్యవహరించిన ఓ పారిశుద్ధి కార్మికురాలిని ఇంటికి పిలిచి స్వయంగా సత్కరించారు. ఆమె నిజాయతీని మెచ్చి ఓ బంగారు గొలుసును బహుమతిగా ఇచ్చి అభినందించారు. చెన్నైకి చెందిన పద్మ అనే మహిళ పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలో టీ నగర్‌లో వీధుల్లో ఉండగా, ఆమెకు ఓ పర్సు దొరికింది. దాన్ని తెరిచి చూడగా, అందులో 45 సవర్ల (తులాల) బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఏమాత్రం ఆశపడని పద్మ, వెంటనే తన పై అధికారులకు సమాచారం అందించి, ఆ బంగారాన్ని పాండీ బజార్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ జరిపి, ఆ ఆభరణాలను అసలు యజమానులకు అందజేశారు. పద్మ నిజాయితీ గురించి తెలిసి పలువురు ఆమెను ప్రశంసించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్వయంగా ఆమెను అభినందించి, లక్ష రూపాయల చెక్కును బహుమతిగా అందించారు. ఈ విషయం తెలుసుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్, మంగళవారం పద్మను తన నివాసానికి ఆహ్వానించారు. ఆమె నిజాయతీని ప్రశంసించి, ఓ బంగారు గొలుసును బహూకరించారు. పేదలకు కేవలం ఐదు రూపాయలకే పరోటాలు అమ్ముతున్న మధురైకి చెందిన తన వీరాభిమాని రజనీ శేఖర్‌ను కూడా రజనీకాంత్ కొన్ని రోజుల క్రితం ఇలాగే బంగారు గొలుసుతో సత్కరించిన విషయం తెలిసిందే.

# ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్ సూత్రధారి 'సెర్గియోగోర్'



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3:** భారత్ అమెరికాలమధ్య సుదీర్ఘకాలం చర్చల రూపంలో నలిగిన వాణిజ్య ఒప్పందం వెనుక భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ కీలకంగా వ్యవహరించారని తెలుస్తోంది. జనవరిలోనే రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్ ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య బంధాన్ని మరోస్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు వంటి వివిధ అంశాల కారణంగా ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలు విధించారు. ఇలాంటి సంక్లిష్ట వాతావరణంలో భారత్ లో రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో వాణిజ్య ఒప్పందంలో కీలక పాత్ర పోషించారు. అమెరికా, భారత్ మధ్య బలమైన స్నేహం వల్లే ఈ ఒప్పందానికి అంగీకారం లభించిందని, ఇప్పటి నుంచి రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని సెర్గియో అన్నారు. సెర్గియో గోర్ కుటుంబం అమెరికాకు 1990లలో వలస వచ్చింది. ఆయన తల్లిదండ్రులవి రష్యా మూలాలు. అమెరికా వచ్చిన కొంతకాలానికే గోర్‌కు పౌరసత్వం లభించింది. 2008లో పొలిటికల్ సైన్స్, అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు. మొదటి నుంచి ఆయన రిపబ్లికన్ పార్టీతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. 2020లో ట్రంప్ హయాంలో విక్టరీ ఫైనాన్స్ కమిటీకి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమితులయ్యారు. నాటి నుంచి ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు. భారత్‌కు రాయబారిగా కంటే ముందు, శ్వేతసౌధంలో పర్సనల్ డైరెక్టర్‌గా పని చేశారు. ట్రంప్ రాజకీయ అజెండాకు తగినట్లు నిర్ణయాలు అమలు చేస్తారు. వాణిజ్య ఒప్పందానికి కొన్ని రోజుల ముందు గోర్ మాట్లాడుతూ, ట్రంప్, మోదీల మధ్య నిజమైన స్నేహబంధం ఉందని, అమెరికాకు భారత్ తర్వాతే ఎవరైనా అని పేర్కొన్నారు.

# లోక్‌సభ నుంచి 8 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** లోక్‌సభలో మంగళవారం 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పేపర్లు చింపి స్పీకర్ చైర్‌పై విసిరేసిన ఘటనలో ఈ చర్య తీసుకున్నారు. చైర్‌లో దిలీప్ సైకియా ఉన్న సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు తమకు మైక్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ పేపర్లను చింపి విసిరేశారు. సస్పెండ్ అయిన వారిలో మాణికం ఠాగూర్, గురీత్ ఓజ్లా, రాజా వారింగ్, ఎబి ఈడెన్, కిరణ్ రెడ్డి, వెంకట్ రామన్ ఉన్నారు. స్పీకర్ చైర్‌పై పేపర్లు విసిరేయడాన్ని స్పీకర్ ఖండించారు. పార్లమెంటరీ హుందాతనాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని అన్నారు. బడ్జెట్ సెషన్‌లో ఇలాంటి ఘటనలను ఉపేక్షించలేమన్నారు. 8 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన తర్వాత లోక్‌సభను బుధవా రానికి వాయిదా వేశారు. పార్లమెంట్‌లో సమ స్యలను లేవనెత్తే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, సభ అన్నివర్గాల ఎంపిలకు చెందినదని, అర్థవంతమైన చర్చలు జరగాలని, కానీ సభా వ్యవహారాలను అడ్డుకోవడం సరికాదు అని, నిరసన పేరుతో సభా నిర్వహణను స్తంభింపచేయడం కుదరదని దిలీప్ సైకియా అన్నారు. ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తప్పుపట్టారు. ప్రతి సభ్యుడిని మాట్లాడే హక్కు ఉందని, వారి ఆందోళనలను వినిపించుకోవాలని ఆమె అన్నారు. ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

# రష్యాచమురు కొనుగోలుపై భారత్‌నుంచి ఎలాంటి సమాచారంలేదు

## రష్యా అధ్యక్షభవనం ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్



**మాస్కో, ఫిబ్రవరి 3:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్ నిర్ణయించుకున్నట్లు వస్తున్న వార్తలపై రష్యా స్పందించింది. ఈ విషయంపై భారత ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి, పుతిన్ సన్నిహితుడు దిమిత్రి పెస్కోవ్ మంగళవారం స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలను నిశితంగా గమనిస్తున్నామని, వాటిని విశ్లేషిస్తున్నామని తెలిపారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు ఆపేస్తే, భారత ఉత్పత్తులపై ఉన్న 25 శాతం సుంకాన్ని (టారిఫ్) తొలగిస్తామని అమెరికా సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ తర్వాత వైట్ హౌస్ ఈ ప్రకటన చేసింది. రష్యా చమురు కొనడం ఆపి, అమెరికా నుంచి కొనుగోళ్లు పెంచడానికి ప్రధాని మోదీ అంగీకరించారని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులపై సుంకం 18 శాతానికి తగ్గడం సంతోషకరం అని మాత్రమే ప్రస్తావించారు. రష్యా చమురు గురించి ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. ఈ పరిణామాలపై పెస్కోవ్ మాట్లాడుతూ, "అమెరికాభారత్ ద్వైపాక్షిక సంబంధాలను మేం గౌరవిస్తాం. అదే సమయంలో భారత్‌తో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్‌తో అన్నారు.



# హెలికాప్టర్ల తయారీకి అదానీ, లియోనార్డోల ఒప్పందం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్‌లో సమీకృత హెలికాప్టర్ తయారీ వ్యవస్థను ఏర్పాటుకు అదానీ గ్రూప్, ఇటలీకి చెందిన ప్రముఖ రక్షణ రంగ సంస్థ లియోనార్డో కీలక ఒప్పందం చేసుకున్నట్లు మంగళవారం ప్రకటించాయి. మేక్ ఇండియా ప్రయత్నాలకు, దేశాన్ని మరింత స్వయంసమృద్ధిగా మార్చడానికి ఇది గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా దేశ సైనిక అవసరాలకు అనుగుణంగా హెలికాప్టర్ల ఉత్పత్తిలో భారత్ స్వావలంబన పెంచడానికి ఉపకరిస్తుందని అంచనా. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, లియోనార్డో సంస్థలు మంగళవారం ఢిల్లీలో ఈ అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేశాయి.

# విమానప్రమాదంపై డిజిసిఎ దర్యాప్తు ముమ్మరం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) దర్యాప్తును ముమ్మరం చేసింది. వీఎస్ఆర్ వెంచర్స్‌పై స్పెషల్ ఆడిట్‌కు ఆదేశించింది. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆడిట్‌పూర్తిచేసేందుకు వీఎస్ఆర్ కంపెనీకి చెందిన బ్యాలెన్స్ షీట్స్, లాగ్ బుక్స్‌ను అధికారులు చెక్ చేయనున్నారు. ఈ చెకింగ్స్ ద్వారా ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన మెయిన్‌టెన్స్ వివరాలు తెలుసుకోనున్నారు. ప్రోటోకాల్ ప్రకారం లాగ్ బుక్ ఫిల్ చేస్తున్నారా లేదా గుర్తించనున్నారు. మరో వైపు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) కూడా ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తోంది. అజిత్ పవార్ లియర్‌జెట్ 45 విమానంలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురయ్యారు. ఈ లియర్‌జెట్ 45 ఎక్స్ఆర్ విమానం వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. విమానాలను అద్దెకు ఇచ్చే అతి పెద్ద సంస్థలలో వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఒకటి. ప్రమాదం జరిగిన తర్వాత సంస్థ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ నా దగ్గర ఉన్న విమానాలు అన్నీ చాలా మంచి కండీషన్‌లో ఉన్న వాటిని ఎందుకు నిలిపివేస్తాను. లియర్‌జెట్ విమానాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. అలాంటి వాటిని నేను కచ్చితంగా నిలిపివేయను అని స్పష్టం చేశారు. అజిత్ అనంతరావు పవార్ గతనెల 28వ తేదీన బారామతిలో జరిగే ఓ కార్యక్రమానికి వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లియర్‌జెట్ 45ఎక్స్ఆర్ విమానంలో బయలుదేరారు. బారామతి ఎయిర్‌పోర్టు వద్ద విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ల్యాండ్ కావాల్సిన విమానం మళ్లీ గాల్లోకి లేచింది. ఉదయం 8.45 గంటల సమయంలో నేలపై పడి పేలిపోయింది. అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ఈ ప్రమాదంలో చనిపోయారు.



## టెక్నాలజీ దిగ్గజం మెటాకు

# 'సుప్రీం'వార్నింగ్

## మాచట్టాలు అనుసరించకుంటే దేశం విడిచి వెళ్లిపోవచ్చు: సిజె సూర్యకాంత్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3:** టెక్నాలజీ దిగ్గజం, వాట్సాప్ ఓనర్లు మెటా కంపెనీకి మంగళవారం సుప్రీం కోర్టు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. వాట్సాప్ ప్రైవసీ పాలసీ అంశంలో కోర్టు తన హెచ్చరిక జారీచేసింది. ఓ కేసులో మంగళవారం సుప్రీంలో వాదనలు జరిగాయి. మా దేశ ప్రైవసీతో మీరు ఆటలాడుకోలేరని, మాకు చెందిన సింగిల్ డిజిట్ డేటాను కూడా షేర్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వబోమని, మా దేశ చట్టాలను ఫాలో అవ్వకుంటే, మీరు ఈ దేశాన్ని విడిచి వెళ్లవచ్చు అని చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీపై కోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. యూజర్ డేటాను కమర్షియల్ అవసరాల కోసం వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆ సమయంలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు. మా రాజ్యాంగాన్ని అనుసరించలేని పక్షంలో ఇండియాను వదిలివెళ్లాలన్నారు. ప్రైవసీ పాలసీ నిరక్షరాసులకు ఎలా అర్థం అవుతుందని కోర్టు ప్రశ్నించింది. కొన్ని సందర్భాల్లో మీ పాలసీలు అర్థం చేసుకోవడం మాకే ఇబ్బందిగా మారుతుందని, అలాంటప్పుడు గ్రామీణ భారత ప్రజలకు ప్రైవసీ ఎలా అర్థం అవుతుందని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతావాదించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి.

# మంత్రి పంకజ్ ముండేకు తప్పిన ప్రమాదం



**ముంబయి, ఫిబ్రవరి 3:** దివంగత మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్ విమాన ప్రమాదం మరువక ముందే మరో మంత్రి పంకజ ముండేకు హెలికాప్టర్ ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ టేకాఫ్ అవుతుండగా ఒక్కసారిగా సాంకేతిక లోపం తలెత్తింది. వెంటనే అప్రమత్తమైన పైలట్ టేకాఫ్ నిలిపివేశారు. దీంతో మంత్రితో పాటు అధికారులు పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మహారాష్ట్ర మంత్రి పంకజ ముండే ఛత్రపతి శంభాజీనగర్ నుంచి లాతూర్‌కు హెలికాప్టర్‌లో బయల్దేరారు. అయితే హెలికాప్టర్ టేకాఫ్ అవుతుండగా సాంకేతికలోపం తలెత్తింది. వెంటనే పైలట్ టేకాఫ్ అవ్వకుండా నిలిపివేశారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం కోసం పంకజ ముండే సంభాజీనగర్ నుంచి లాతూర్‌కు హెలికాప్టర్‌లో ప్రయాణించాల్సి ఉందని వర్గాలు తెలిపాయి. అయితే పైలట్ సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్ నిలిపివేశారు. దీంతో మంత్రి లాతూర్ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. ఇటీవల అజిత్ పవార్ ముంబయి నుంచి బారామతికి విమానంలో బయల్దేరారు. బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా విజిబులిటీ కారణంగా తప్పుగా ల్యాండింగ్ అవడంతో విమానం పేలిపోయింది. దాంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడి అజిత్‌పవార్‌తోపాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

# కేంద్ర ప్రభుత్వం రైతులనూ మోసం చేసింది: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** అమెరికాతో కుదుర్చుకున్న 'ప్రతికూల' వాణిజ్య ఒప్పందాన్ని అంగీకరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం భారత రైతుల ప్రయోజనాలను దెబ్బతీసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. 'అమెరికా రైతుల ఉత్పత్తులు ఇప్పుడు భారత మార్కెట్‌లో అమ్ముడవుతాయని, దీనివల్ల గ్రామీణ అమెరికాకు డబ్బు వస్తుందని యునైటెడ్ స్టేట్స్ పేర్కొంది. ఈ ఒప్పందం ద్వారా ట్రంప్ అమెరికన్ రైతులకు ప్రయోజనాలను కల్పించారు. భారతదేశంలోని లక్షలాది మంది రైతులు ఈ వాణిజ్య ఒప్పందం నిబంధనలు ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నారు. మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని అమెరికాకు పూర్తిగా తెరిచి ఉంచాలని ప్లాన్ చేస్తోందా? ప్రభుత్వం భారత రైతులను అమెరికన్ కంపెనీలతో ప్రత్యక్ష పోటీలోకి నెడుతుందా? మన రైతుల ప్రయోజనాలపై రాజీ పడ్డారా? ఈ పరిస్థితిపై ప్రజలకు తక్షణమే స్పష్టత ఇవ్వాలి' అని ప్రియాంక గాంధీ ఆ ట్వీట్‌లో రాసుకొచ్చారు.

# సంక్షిప్తంగా..

## అజిత్‌పవార్ అంత్యక్రియల్లో రెచ్చిపోయిన దొంగలు: ఏడుగురి అరెస్టు



**పూణె, ఫిబ్రవరి 3:** జనవరి 28న విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సహా ఐదుగురు మరణించిన విషయం తెలిసిందే. అయితే గతనెల 29 న బారామతిలో విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ఆయన అంత్యక్రియలు జరగ్గా కొందరు దొంగలు రెచ్చిపోయారు. ఈ కార్యక్రమంలో కొం తమంది దొంగలు తమ చేతివాటం చూపించారు. అంత్యక్రియలకు హాజరైన వారిలో దాదాపు 15మంది వ్యక్తులకు చెందిన రూ.30లక్షల విలువ చేసే బంగారు వస్తువులను కొట్టేశారు. బాధితుల ఫిర్యాదు మే రకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితులను రాజ్‌కుమార్ బాబురావు అథవాలే, మహ్మద్ అనీస్, ఎజాజ్ భగు మిరావాలే, మహ్మద్ సాదిక్, బాలు అలియాస్ దత్తాత్రయ బాబాన్‌ధోత్రే, తుషార్ కైలాస్ మసాల్, నితిన్ అంకుష్ గైక్వాడ్‌లుగా గుర్తించారు.

## అత్యాచార నిందితుడిని చితకబాదిన లాయర్లు

**భోపాల్,ఫిబ్రవరి 3:** భోపాల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాలికపై అత్యాచారం, బ్లాక్‌మెయిల్ కేసులో అరెస్టయిన నిందితుడిని పోలీసులు కోర్టుకు తీసుకురాగా, ఆగ్రహంతో ఉన్న కొందరు న్యాయవాదులు, ప్రజలు అతడిపై దాడి చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, న్యాయవాదులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. కోహెఫిజా ప్రాంతంలో 11వ తరగతి విద్యార్థినిపై అత్యాచారం చేసిన కేసులో ఒసాఫ్ అలీ ఖాన్ అనే వ్యక్తిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. మంగళవారం అతడిని కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకురాగా, అప్పటికే అక్కడ గుమిగూడిన కొందరు న్యాయవాదులు అతడిని చితకబాదారు. పోలీసులు నిందితుడిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ గందరగోళంతో కోర్టు కార్యకలాపాలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

## మహాత్మాగాంధీ కాంస్యవిగ్రహం ఎత్తుకెళ్లిన దుండగులు



**మెల్‌బోర్న్,ఫిబ్రవరి 3:** ఆస్ట్రేలియాలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. మెల్‌బోర్న్‌లో భారతీయులు అధికంగా నివసించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన గాంధీ కాంస్య విగ్రహాన్ని కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గాంధీ కాంస్య విగ్రహాన్ని కట్ చేసిన వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని విదేశాంగ శాఖ డిమాండ్ చేసింది. దొంగతనానికి గురైన విగ్రహాన్ని గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలుతీసుకోవాలని ఢిల్లీలోని ఆస్ట్రేలియా దౌత్యాధికారులకు అల్టిమేటమ్ ఇచ్చింది. మెల్‌బోర్న్‌లో భారత సంతతి ప్రజలు ఎక్కువగా నివసించే రోవ్‌విల్లే ప్రాంతంలోని గాంధీ కాంస్య విగ్రహాన్ని కొందరు ధ్వంసం చేశారు. అంతటితో ఊరుకోకుండా విగ్రహాన్ని పాదాలు మాత్రమే ఉంచి కాళ్ల వరకు కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఇండియన్ కమ్యూనిటీ స్థానిక విక్టోరియా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## జైలు వాహనంలోనే వచ్చి ఎమ్మెల్యేగా ప్రమాణం



**పాట్నా,ఫిబ్రవరి 3:** బీహార్ రాజకీయాల్లో మరోసారి బాహుబలి మార్క్ కనిపించింది. డాన్ నుంచి రాజ కీయ నాయకుడిగా మారిన అనంత్ కుమార్ సింగ్ మంగళవారం బీహార్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. భారీ భద్రత మధ్య జైలు వాహనంలో అసెంబ్లీకి చేరుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొకామా నియోజకవర్గం నుంచి జేడీయూ టిక్కెట్‌పై గెలిచిన అనంత్ కుమార్ సింగ్ ప్రస్తుతం దులార్‌చంద్ యాదవ్ హత్య కేసులో నిందితుడిగా పాట్నాలోని బేర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ఆయన జైలులో ఉండటంతో ప్రమాణ స్వీకారంపై ఇన్నాళ్లూ సందిగ్ధత నెలకొంది. ఎంపీ, ఎమ్మెల్యేల కేసుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ మాలవీయ ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారానికి అనుమతిని ఇచ్చారు. దీంతో పోలీసులు ఆయన్ను నేరుగా జైలు వాహనంలోనే అసెంబ్లీ హాలుకు తీసుకు వచ్చారు.

## భారత్ అమెరికాల మధ్య బెస్ట్ డీల్: పీయూష్ గోయల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్‌కు అమెరికా నుంచి బెస్ట్ డీల్ కుదిరిందని కేంద్ర వాణిజ్యమంత్రి పియూష్ గోయల్ వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య జరిగిన ఈ ఒప్పందం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ మరింతగా బలపడుతుందని పేర్కొన్నారు. వాణిజ్య పరంగా అనేక అవకాశాలను ఈ డీల్ మెరుగు పరుస్తుందని తెలిపారు. అమెరికాతో వెరీ గుడ్ డీల్ జరిగిందని స్పష్టం చేశారు. ఈ ఒప్పందంతో భారత్‌లోని రైతులుఏమాత్రం నష్టపోరని తెలిపారు. భారత్‌కు ముమ్ముందు శుభ ఫలితాలు సమకూరుతాయని మంత్రి స్పష్టం చేశారు. ఒప్పందంపై భారత్, అమెరికా ప్రజలకు అభినందనలు తెలిపారు.



# పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

● ఎపిలో యేటా సగటున 8 వేల మంది మృతి ● మృతుల్లో అత్యధికులు ద్విచక్రవాహనదారులే

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా సగటున 8 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఏపీ క్రైమ్ పోలీసు విభాగం తెలిపిన సమాచారం మేరకు రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక ద్విచక్రవాహనదారులే ఉంటున్నారు. తలకు బలమైన గాయాలవ్వడం వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. 2025లో విజయవాడ కమిషనరేట్ పరిధిలో గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 366 మంది మృతి చెందగా అందులో 209 మంది ద్విచక్ర వాహన ప్రయాణికులే. వీరిలో ఎక్కువ మంది ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించలేదు. ప్రాణనష్టం అధికంగా ఉండటానికి ఇదే కారణమైంది. బైక్ నడిపేవాళ్లు, వెనక కూర్చొన్న వాళ్ల హెల్మెట్ ధరిస్తే ప్రమాదం జరిగినా, ప్రాణాలు నిలబడతాయని తెలిసినా ఇంకా చాలా మంది నిర్లక్ష్యంగానే ఉంటున్నట్లు, ఏమవుతుందిలే అన్న ధీమా వారి ప్రాణాలను బలిగొంటోంది. హెల్మెట్ ధరించకపోవటం వల్ల రాష్ట్రంలో ఏటా సగటున 2,5003,000 ప్రాణాలు రోడ్డుపాలవుతున్నాయి. అతి వేగం కారణంగానే ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. మితిమీరిన వేగంతో బండి నడిపేటప్పుడు ఆకస్మికంగా వాహనాన్ని అదుపు చేయడం కష్టమవుతోంది. దీంతో తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బైక్ డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్‌లో మాట్లాడటం, మద్యం మత్తులో వాహనం నడపటం, నిబంధనలు సరిగ్గా పాటించకపోవడం కూడా ప్రమాదాలను సంఖ్యను పెంచుతున్నాయి. ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు ఎక్కువ యాక్సిడెంట్లు చోటు చేసుకుంటున్నాయి. ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించాలంటే ఎంత వేగంతో వెళ్లాలనేది కచ్చితంగా అంచనా వేయలేకపోవటం, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయటం వంటివి ఘటనల సంఖ్యను పెంచుతున్నాయి.

రాష్ట్రంలో 2020 నుంచి 2025 నవంబరు వరకూ 1,20,657 రోడ్డు ప్రమాదాలు జరగగా అందులో 59,724 (49.49 శాతం) ద్విచక్ర వాహన ప్రమాదాలే. ఆరేళ్ల గణాంకాలు విశ్లేషిస్తే సగటున ప్రతి గంటకూ రెండు నుంచి, మూడు ప్రమాదాలు జరుగుతున్నట్లు తేలింది. వాటిలో ఒకటి ద్విచక్ర వాహన ప్రమాదం. 2025లో నవంబరు 30 వరకూ రాష్ట్రంలో 18,837 ప్రమాదాలు జరగ్గా 8,466 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో దాదాపు 45 శాతానికి పైగా ప్రమాదాలు, ప్రమాద మరణాలు ద్విచక్ర వాహనాలతో చోటు చేసుకున్నవే. ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు కనీసం ఒక్క మరణమైనా చోటు చేసుకునే ముప్పు అధికంగా ఉంటోంది. 2020 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో జరిగిన ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో 16,141 మంది మృతి చెందారు. అందులో 11,139 మంది (69.01 శాతం) ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించలేదు. తలకు బలమైన గాయాలవడం వల్లే వారు ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు తలకు గాయాలవ్వటం వల్లే సంభవిస్తున్నాయనేది పోలీసులు, రవాణా శాఖాధికారుల మాట. తలపై ఓ మోస్తరు దెబ్బ తగిలినా లోపలి భాగంలో రక్తస్రావమయ్యే ప్రమాదముంది. ఇది ప్రాణాంతకమవుతోంది. ప్రాణాలతో బయటపడ్డా కొన్ని సందర్భాల్లో నెలల తరబడి కోమాలోనే ఉండాల్సి వస్తోంది. ప్రమాదకరంగా ఓవర్ టేకింగ్ చేయటం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ వాహన నిర్వహణ సరిగ్గా లేకపోవడం ఎక్కువ దూరం బైక్‌పై ప్రయాణించటం వల్ల అలసిపోవటం, మంచు కమ్మేసిన సందర్భాల్లో ముందున్న వాహనాలు సరిగ్గా కనిపించకపోవటం, రాత్రి వేళల్లో రహదారులు సరిగ్గా కనిపించకపోవటం, జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనం నడిపేటప్పుడు లేన్ డిసిప్లేన్ పాటించకపోవటం వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం, నైపుణ్యం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపటం వంటి రోడ్డు ప్రమాదాలకు 9 ప్రధాన కారణాలుగా పోలీసులు తెలుపుతున్నారు.



జయహో పుస్తకంను ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.

## బుక్ రీడింగ్‌తో మొబైల్ కల్చర్ తగ్గింపు

**- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ, ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త ప్రతినిధి): విద్యాసంస్థలన్నింటిలోనూ ఒక సెషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు బుక్ రీడింగ్ అలవాటు చేసేలా ఉపాధ్యాయులందర్నీ మోటివేట్ చేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమం చేపట్టిన హైదరాబాద్ నుంచి అమరావతికి పుస్తకంతో బస్సుయాత్ర విజయవాడ మజిలీలో భాగంగా మంగళవారం ఉదయం విజయవాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. ఆ బస్సుయాత్రకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. బస్సుయాత్ర చేస్తున్న పుస్తక ప్రేమికులు, రచయితలు, ఉద్యమకారులు ఆత్మీయంగా పలకరించారు. బస్సుయాత్ర విశేషాలను ఉద్యమ స్ఫూర్తి మంచికంటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పెరిగిపోయిన మొబైల్ కల్చర్‌ను తగ్గించాలంటే బుక్ రీడింగ్ ఒక్కటే మార్గమన్నారు. మొబైల్ నిర్మాణ టెక్నాలజీ కూడా పుస్తకం చదవడం ద్వారానే వచ్చిందన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటు బాగా పెంచాలన్నారు. వాళ్ళను గ్రంథాలయాలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ దిశగా ఉద్యమిస్తున్న మరో గ్రంథాలయ ఉద్యమ నాయకులు దర్నీ అభినందించారు. ఈ ఉద్యమ స్ఫూర్తితో ఎన్టీఆర్ జిల్లాలోని విద్యాలయాల్లో వారానికి ఒక్కరోజు పాఠ్యాంశేతర పుస్తకాలు చదివే విధంగా ఒక సెషన్ ఏర్పాటు చేసేలా ఉపాధ్యాయుల్ని మోటివేట్ చేస్తామన్నారు. అవకాశమున్న పార్కుల్లో మినీ మొబైల్ గ్రంథాలయాల ఏర్పాటు గురించి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా "జయహో పుస్తకం" పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, మంచికంటి, బండారు విజయ, కాసుల రవికుమార్, సిపి ప్రసాద్, కాంతి నల్లూరి, షైదిమత్రి విజయ, కందుకూరు రాము, కస్తూరి ప్రభాకర్, కాసుల కోతారాణి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిదంతా హింసాత్మక రాజకీయం




విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు ఎలాంటి పొంతన లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కార్యకర్తల కోపాన్ని అదుపు తప్పకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులకు వాస్తవాలను వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను గుర్తు చేసి.. వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించామన్నారు హోంమంత్రి. టీడీపీ కార్యకర్తలను గత 20 నెలలుగా పూర్తి అదుపులో పెట్టాం కాబట్టే రాష్ట్రంలో మంచి వాతావరణం నెలకొందని తెలిపారు. కార్యకర్తల కడుపు మంటను అర్థం చేసుకున్నప్పటికీ, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా సరైన సమయంలో హితబోధ చేసిన నాయకుడు చంద్రబాబు అని అనిత కొనియాడారు. బూతులు, హింసాత్మక చర్యలతో వైసీపీ నేతలను ప్రోత్సహించారే తప్ప ఏనాడైనా తప్పుని చెప్పారా అంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మంత్రి అనిత హెచ్చరించారు.

# రాష్ట్రాల అవసరాల మేరకు యూరియా సరఫరా

● యూరియా కొరత, ఎరువుల సరఫరాపై ఫిర్యాదులు ● వైసిపి ఎంపి రఘునాథ్ రెడ్డికి కేంద్రమంత్రి స్పష్టం

రాజంపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్రాలలో ఖరీఫ్, రబీ సీజన్లలో అవసరాలను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించే నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఎరువులు సరఫరా చేస్తుందని కేంద్రమంత్రి స్మాత్ అనుప్రియ పటేల్ స్పష్టం చేశారు. గత ఆరు నెలలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవసరమైన ఎరువులు సరఫరా చేయడం జరిగిందని తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమైన యూరియా కొరత, ఎరువుల సరఫరాపై వైసిపి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాధ రెడ్డి పార్లమెంట్ సమావేశాల్లో మంగళవారం ప్రస్తావించారు. యూరియా సమస్యపై రాష్ట్రం నుంచి ఐదు ఫిర్యాదులు అందినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రాల అంతటా యూరియా లభ్యత తగినంతగా ఉందన్నారు. ఎరువులను నిత్యావసర వస్తువుల చట్టం, 1955 ప్రకారం ముఖ్యమైన వస్తువుగా ప్రకటించారని, ఎరువుల నియంత్రణ ఉత్తర్వు, 1985



కింద నోటిపై చేశారని పేర్కొన్నారు. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం బ్లాక్ మార్కెటింగ్, అధిక ధర నిర్ణయించడంలో పాల్గొన్న వ్యక్తులపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని స్పష్టం చేశారు. అయితే గత ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎరువుల లభ్యత, బ్లాక్ మార్కె టింగ్, అధిక ధరలకు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారానికి ఆన్‌లైన్ ద్వారా 5 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లా స్థాయిలో రాష్ట్రంలో ఎరువుల పంపిణీ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జరుగుతుంది కాబట్టి, అవసరమైన చర్య కోసం ఈ ఫిర్యాదులను రాష్ట్ర ప్రభుత్వా నికి పంపామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా దేశంలో ఎరువులు సకాలంలో తగినంత లభ్యతను నిర్ధారించడానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి, రాష్ట్రాల వారీగా, నెలవారీగా ఎరువుల అవసరాన్ని అంచనా వేస్తుందని వివరించారు. క్షేత్ర స్థాయిలో అంచనా వేసిన అవసరాల ఆధారంగా, డిఓఎఫ్ నెలవారీ సరఫరా ప్రణాళికను జారీ చేయడం ద్వారా రాష్ట్రాలకు తగినంత పరిమాణంలో ఎరువులను కేటాయిస్తుందని, దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన సబ్సిడీ ఎరువుల కదలికను ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే ఆన్‌లైన్ వెబ్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థ పర్యవేక్షిస్తుందని చెప్పారు.



అవార్డులను ప్రదానం చేస్తున్న శ్రీనివాసరావు, ప్రభాకర్, కిరణ్, శ్రీకాంత్ తదితరులు

## విద్యార్థుల్లోని ప్రతిభకు పట్టంకట్టి ప్రోత్సహించాలి

**- ఎమ్మెల్యే ఘంటా శ్రీనివాసరావు**

హైదరాబాద్(రవీంద్రభారతి), ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి పట్టంకట్టి జీనియస్ అవార్డులతో సుచిరిండియా ఫౌండేషన్ ప్రోత్సహించడం హర్షదాయకమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడు ఘంటా శ్రీనివాసరావు సంస్థను, ఛైర్మన్ లయన్ కిరణ్‌లను అభినందించారు. విద్యార్థుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం, విద్య, ఆరోగ్యం పట్ల కార్యోన్ముఖులను చేయడం శ్లాఘనీయమని అన్నారు. ప్రముఖ సామాజిక సేవాసంస్థ సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఏపి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఘంటా శ్రీనివాసరావు విశిష్ట అతిథులు సినీ నటుడు శ్రీకాంత్, శివాజీరాజా, లయన్ కిరణ్ తదితరులతో కలిసి జ్యోతి ప్రకాశనంచేసి ముందుగా సూచిరిండియా ఫౌండేషన్ కాఫీటేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా నిర్వహించిన 33వ జాతీయస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో ఎంపికైన 20మందికి గోల్డ్ మెడల్స్, 20మందికి నేషనల్ ర్యాంక్స్, 20మందికి రాష్ట్రస్థాయి మెడల్స్, 450 మందికి జిల్లాస్థాయి ర్యాంకులు పొందిన యువ ప్రతిభావంతులైన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా అందజేశారు.

## విద్యాసంస్థల్లో 6 వరకు ఆధార్ క్యాంపులు

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ఈ నెల 6 వరకూ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. 15 నుంచి 17 ఏళ్ల మధ్య వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. అలాగే ఈ నెల 16 నుంచి 20 వరకు మరో విడత పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ తెలిపారు.

# కార్మిక, వైద్య రంగంలో విప్లవాత్మక అభివృద్ధి

**మాటల్లో కాదు.. ఆస్పత్రులు, సేవలు, సంస్కరణల్లో కనిపిస్తోంది: మంత్రి వాసంశెట్టి సుభాష్**

సచివాలయం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాష్ట్రం పునర్నిర్మాణ దిశగా వేగంగా అడుగులు వేస్తుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్న స్పష్టమైన సంకల్పంతో, ముఖ్యంగా కార్మికవర్గ సంక్షేమం, వారి ఆరోగ్య భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది కేవలం ప్రకటనలకు పరిమితం కాదు. ప్రజల జీవితాల్లో ప్రత్యక్షంగా కనిపించాలి. చంద్రబాబు నాయుడు పాలనలో అదే జరుగుతోందన్నారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ విభాగాన్ని బలోపేతం చేసే దిశగా తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 50పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం ద్వారా రాయలసీమ ప్రాంతంలోని వేలాది కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోనికి వచ్చాయని మంత్రి తెలిపారు. డాక్టర్లు, నర్సులు, సాంకేతిక సిబ్బంది నియామకాలతో సేవల నాణ్యత మరింత పెరిగిందన్నారు. వైద్య మౌలిక వసతుల విస్తరణలో భాగంగా కర్నూలు, గుంటూరు జిల్లాల్లో కొత్త ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణానికి భూముల కేటాయింపులు పూర్తయ్యాయని చెప్పారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈఎస్ఐ డిస్పెన్సరీలు నిర్మాణానికి ఉచితంగా భూములు కేటాయించడం ద్వారా గ్రామీణ స్థాయిలోనే ప్రాథమిక వైద్యం అందుబాటులోనికి వచ్చిందన్నారు. దీనివల్ల కార్మికుల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు.

**విశాఖకు గర్వకారణం ఈఎస్ఐ మెడికల్ కాలేజ్**

విశాఖలో 400పడకల ఈఎస్ఐ ఆస్పత్రిలో అనుసంధానంగా 50ఎంబిబిఎస్ సీట్లతో ఈఎస్ఐ మెడికల్ కాలేజ్‌కు అనుమతి రావడం రాష్ట్ర



ఆరోగ్యరంగంలో చారిత్రాత్మక మైలురాయిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో స్థానిక కమిటీల ఏర్పాటు ద్వారా ఈఎస్ఐ పథకాల అమలు మరింత పారదర్శకంగా ప్రజలకు దగ్గరగా మారిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి ఆస్పత్రులు, సేవలు, సంస్కరణల రూపంలో ప్రజల జీవితాల్లో స్పష్టంగా కనిపిస్తుంని మంత్రి వ్యాఖ్యానించారు.

## హనీట్రాప్... మహిళ అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఓ బాధితుడు ఫిర్యాదు చేయడంతో హనీట్రాప్ మోసానికి పాల్పడిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. తంగెళ్లబీడుకు చెందిన కనపర్తి రేణుక అనే మహిళ యువతులను ఆకర్షించేలా అమ్మాయిల ఫొటోలు చూపిస్తూ వ్యక్తులను మాయలో పడేసి డబ్బులు దోచుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో మాధవరావు అనే వ్యక్తిని పిలిపించి అతని వద్ద నుంచి ఉంగరం, రూ.5 వేల నగదును కాజేసింది. అనంతరం అత్యాచారం కేసు పెడతానని బెదిరిస్తూ మరో రూ.2 లక్షలు డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, రేణుకతో పాటు ఆమెకు సహకరించిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు.

## అమరావతి రెవెన్యూ ఉద్యోగుల జెఎసి చైర్మన్‌గా భూపతిరాజు రవీంద్ర

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా ఒక ఐక్య ఉద్యమ కార్యాచరణను చర్చించి రూపొందించేందుకు నగరంలోని ఫిలిం ఛాంబర్ నందు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయడమైనది. రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులు వీఆర్ఏ మొదలుకొని డిప్యూటీ కలెక్టర్ వరకు ఒకే ఉద్యమ కార్యాచరణ ఉండాలనే ఉద్దేశంతో రెవిన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఎ. విఆర్ఓ. సర్వేయర్లు. జూనియర్ సీనియర్ అసిస్టెంట్లు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు. డిప్యూటీ తహశీల్దార్‌లు, మండలం తహశీల్దార్‌లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు. అందరూ ఏకతాటపై కన్నతల్లి లాంటి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో కలిసి మెలిసి ఒకే తల్లి బిడ్డలుగా ఐక్యంగా ఉండాలని రెవెన్యూ జేఏసీ ఏర్పాటు సమస్యల పరిష్కారమే ఏకైక అజెండాగా పనిచేయడానికి అందరూ అన్ని క్యాడర్లలో, ఉన్న రెవెన్యూ ఉద్యోగులతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నందు రెవెన్యూ జేఏసీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రం నలుమూలలు నుండి రెవిన్యూ ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరానే ధ్యేయం

**'కరెంటోళ్ల జనబాట'లో ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



తిరుపతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలనే ధ్యేయంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా కొనసాగుతున్న "కరెంటోళ్ళ జనబాట" కార్యక్రమం మంగళవారం తిరుపతి సర్కిల్ ఎస్ఇ చంద్రశేఖర రావు, ఇఇ దేవాశీర్వాదంతో కలిసి తిరుపతి జిల్లా నారాయణవనం సమీపంలోని బ్రాహ్మణతంగేళి గ్రామంలో పర్యటించారు. ఆ గ్రామంలో విద్యుత్తు లైన్లను పరిశీలించి, విద్యుత్ సరఫరా తీరుపై వినియోగదారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రూఫ్ టాప్ సోలార్, స్మార్ట్ మీటర్ల ఉపయోగాలను వినియోగదారులకు వివరించారు. అనంతరం అదే గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకొని, సలహాలు, సూచనలను అందజేశారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యుత్ సరఫరా తీరును తెలుసుకున్నారు. ఆ తర్వాత నారాయణవనం 33/11కెవి సబ్‌స్టేషన్ ను తనిఖీ చేశారు. అనంతరం శివశంకర్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్మార్ట్ మీటర్ల అంశంపై వినియోగదారుల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలూ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడం, లోవోల్టేజ్ సమస్యను అధిగమించడం తదితర సమస్యల సత్వర పరిష్కారం కోసమే ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో అధికారులు తమ సిబ్బందితో నిర్దేశిత గ్రామాల్లో పర్యటిస్తూ, ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని వివరించారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయప్రకాష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్‌పిడిసిఎల్‌లో పదోన్నతులు

**ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి ఉత్తర్వులు**



చీఫ్ జనరల్ మేనేజర్ సిహెచ్ రామచంద్రరావు

తిరుపతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ సంస్థలో అర్హులైన పలువురికి పదోన్నతులు కల్పిస్తూ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ రామచంద్ర రావుకు చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హెచ్‌ఆర్‌డి విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. శోభా వాలెంటీనా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలను సిహెచ్ రామచంద్రరావుకు అప్పగించారు.

అలాగే సంస్థలో పిఎంఎం విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన పి.హెచ్. జానకిరామ్ గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేయడంతో ప్రాజెక్ట్స్ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జె. రమణా దేవికి ఆ విభాగపు చీఫ్ జనరల్ మేనేజర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కర్నూలు సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.లతకు జనరల్ మేనేజర్(ఐటి ,ఎస్ఎపి) గానూ, కార్పొరేట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. హేమలతకు సూపరింటెండింగ్ ఇంజనీర్(డిపిఇ) గానూ పదోన్నతి కల్పించారు.

సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎన్.డేవిడ్ లివింగ్ స్టోన్, ఎల్. ప్రసాద్, ఎస్.కళ్యాణ్ చక్రవర్తిలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగాను, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.లలితకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గానూ పదోన్నతి కల్పించారు. కార్పొరేట్ కార్యాలయంలో ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ కారణంగా మరో చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టు ఖాళీ ఏర్పడనుంది.

## భూ తగాదాల్లో తల్లీకొడుకు దారుణహత్య



శింగనమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: అనంతపురం జిల్లా శింగనమల మండలం తరిమెల గ్రామంలో భూ తగాదాలలో సోమవారం రాత్రి తల్లికొడుకులను దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తరిమెల గ్రామానికి చెందిన నల్లప్పకి ఇద్దరు భార్యలు. కొద్ది సంవత్సరాల క్రితం నల్లప్ప చనిపోవడంతో రెండు కుటుంబాల మధ్య భూ తగాదలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా రెండవ భార్య యల్లమ్మ(38) అంగన్వాడి టీచర్, ఆమె కొడుకు చిన్న(22) సోమవారం రాత్రి హత్యకు గురయ్యారు. పోలీసులు విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి ఘటనకు దారితీసిన పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు గత కొంత కాలంగా ఆస్తికి సంబంధించిన వివాదాలు వారి కుటుంబ సభ్యుల మధ్య కొనసాగుతున్నట్లు తెలిసింది. గ్రామస్తుల వివరాల మేరకు హత్యకు గురైన యల్లమ్మను వెంటాడి తలనరికి కాలనీలో తిప్పడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురైనట్లు తెలిపారు. ఆమె కుమారుడు చిన్నను సైతం నరికి, తలపై బండరాయి వేసి హతమార్చినట్లు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేసిన ప్రత్యేక బృందంచే దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఐదుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్



మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లాలో పొలంలో గంజాయి సాగు చేసి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మంగళవారం మదనపల్లె డిఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.

పీటీఎం మండలం, మల్లెల గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి తన పొలంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తూ విక్రయాలు చేస్తున్నాడు. ఆ పంటను డబ్బు ఆశ చూపి సురేంద్ర, అఫ్రీద్, పురుషోత్తం, ఆదిల్ అనే యువకుల ద్వారా మార్కెట్లోకి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న బి. కొత్తకోట పోలీసులు నిఘా ఉంచి, ముఠా సభ్యులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.10 లక్షల విలువైన 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఎన్‌డిపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేసే మత్తు పదార్థాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, సాగు చేసినా, అమ్మినా జైలు శిక్ష తప్పదని ఎస్పీ హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచిన మదనపల్లి డిఎస్పీ మహేంద్ర, బి.కొత్తకోట సీఐ గోపాల్ రెడ్డి, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

**శివరాత్రి పర్వదినాన 2లక్షల మంది దర్శనాలకు ఏర్పాటు**



సాంస్కృతిక వేదిక ముస్తాబు

# భోళాశంకరుని తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏటా నిర్వహించే శివయ్య తిరునాళ్ళను అంగరంగ వైభవంగా గతం కన్న భిన్నంగా నిర్వహించాలన్న పాలకుల సూచనలతో అధికారులు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే శాసనసభ్యుడు, జిల్లా కలెక్టర్, ఎస్పిలతో వేరువేరుగా సమీక్షా సమావేశాలు జరిపారు. ఈ ఏడాది రూ.6 కోట్ల ప్రాథమిక అంచనాలతో శివరాత్రి నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిణ వేదికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఊరంతా విద్యుత్ వెలుగులతో ముస్తాబు చేసారు. అన్ని పనులకు సంబంధించి టెండర్లను ఖరారు చేసారు. పనులను చకచకా జరగటానికి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కాగా శివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగస్వాములైన మున్సిపల్ అధికారులు మంగళవారం సాయంత్రం ప్రత్యేకంగా సమావేశం అయి తమ సిబ్బందితో సమీక్షించుకున్నారు. ఈ ఏడాది సాంస్కృతిక కార్యక్రమాల్లో కొత్తదనం ఉండాలని సూచించారు. విమర్శలకు, ఆరోపణలకు అవకాశం లేకుండా నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల్లో ప్రధానంగా సాంస్కతిక కార్యక్రమాల నిర్వహణ ఎంతో ప్రాధాన్యత కల్గి ఉండటంతో ఈ అంశాన్ని పరిగణలో తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక వేదికను రూపకల్పన చేస్తున్నారు.

# ప్రభుత్వం కేటాయించే ప్రతి రూపాయి ప్రజలకు చేరాలి



● రాష్ట్ర శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు

నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త: ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ప్రతి రూపాయిని కూడా ప్రజలకు చేరువ చేయడమే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ప్రధాన లక్ష్యమని కమిటీ చైర్మన్ వి. జోగేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావుతో పాటు సభ్యులు మద్దిపాటి వెంకటరాజు, పాశం సునీల్‌కుమార్, వి.వి సూర్య నారాయణ రాజు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ సెక్రటరీ భిక్షం, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. సమావేశంలో తొలుత జిల్లాలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలను ఆయా శాఖల అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు. సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ సంక్షేమ శాఖలు, డీఆర్‌డిఎ, మెప్మా, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇరిగేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు తమ శాఖలకు సంబంధించిన బడ్జెట్ వినియోగంపై సమగ్రంగా వివరించగా, కమిటీ సభ్యులు చర్చించారు. సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, జిల్లాలో శాఖల వారీగా ఎంత బడ్జెట్ విడుదలైంది, ఎంత మేర ఖర్చు జరిగింది అనే అంశాలపై సమగ్రంగా కమిటీ అధ్యయనం చేస్తుందన్నారు. జిల్లాలో ఏ పథకానికి ఎక్కువ డిమాండ్ ఉందో గుర్తించి, ఆ పథకానికి అధికంగా నిధులు విడుదల అయ్యేలా ఎస్టిమేట్స్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. జిల్లా స్థాయి నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ శాసనసభ వరకు చేరుతుందని, దాని ద్వారా జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు మరింత అవకాశం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వివరించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై సమగ్ర వివరాలతో బుక్‌లెట్ తయారు చేయడం పట్ల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను ప్రత్యేకంగా అభినందించారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన బడ్జెట్ కేటాయింపులపై సమీక్ష నిర్వహించామని, అధికారులు పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ఖర్చు చేసినట్లు తెలిపారు. సమావేశంలో పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, పాఠశాల భవనాల పరిస్థితి సంతృప్తికరంగా లేదన్న అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరిశీలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ప్రతి రూపాయి ఉపయోగపడేలా ఎక్కడ అవసరమో అక్కడే నిధులు ఖర్చు చేయాలని, పథకాల ద్వారా పేదలకు ఎంతమేర లాభం చేకూరుతోందో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ బడ్జెట్‌ను కేవలం ఖర్చు చేయడమే కాకుండా, ఆ ఖర్చుతో ప్రజలకు ఎంతమేర మేలు జరుగుతోందో కూడా అధికారులు అధ్యయనం చేయాలని సూచించారు. చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ ఫలాలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అమలవుతున్న కార్యక్రమాల ద్వారా సమాజానికి వాస్తవ ప్రయోజనం కలగాలన్నారు. కమిటీ సభ్యులు, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. చేసిన ప్రతి ఖర్చుకు స్పష్టమైన లెక్కలు చూపాల్సి ఉంటుందన్నారు. అన్ని రంగాల్లో అనుభవం కలిగిన సభ్యులతో కూడిన ఈ ఎస్టిమేట్స్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ తప్పిదాలు జరగకుండా పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. హాస్పిటల్స్, పాఠశాల భవనాల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల కూల్చివేతకు నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను కోరారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయాలని సూచించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా తమ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురవుతోందని, బడ్జెట్ కేటాయింపుల్లో ఉదయగిరికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గండిపాలెం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించి మెట్టప్రాంత రైతులకు అండగా నిలవాలని, సాగునీటి రంగ అభివృద్ధికి నిధులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయ్ కుమార్, డిఆర్‌డిఎ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు నాగరాజకుమారి, గంగాభవాని, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, మత్స్య, పశుసంవర్ధక శాఖ జేడీలు రమేష్ నాయక్, శాంతి, డీఎంఅండ్ హెచ్‌వో సుజాతతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## వైభవంగా కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి పరిధిలోని తిరుపతిలో కపిలేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 8 నుండి 17వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి జెఇఒ వి. వీరబ్రహ్మం చెప్పారు. కపిలేశ్వర స్వామివారి ఆలయంలో మంగళ వారం ఆయన అధికారులతో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముందు నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుందన్నారు. ఈనెల 15న మహాశివరాత్రి సందర్భంగా అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు అన్న ప్రసాదాలు, బాదంపాలు నిరంతరాయంగా అందించాలన్నారు. భక్తులను ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయంలో పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచాలని, ఆకర్షణీయంగా రంగులు, రంగోలీ, విద్యుత్, పుష్పాలంకరణలు ఏర్పాటు చేయాలన్నారు. స్వామివారి వాహనాల మరమ్మత్తులు, పటిష్టంగా క్యూలైన్లు, తిరుపతి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆర్చ్ లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు, తాగునీరు, అన్నప్రసాదాలు అందించేందుకు వీలుగా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆలయ అర్చకులు, ఆలయ ప్రత్యేక అధికారి డి.ఫణికుమార్, రవాణా విభాగం జిఎం శేషారెడ్డి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇఇ మల్లికార్జున్, అన్న ప్రసాదం డిప్యూటీ ఇఒసెల్వం, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

## కోవూరులో భారీ చోరీ

**- 58 సవర్ల బంగారు నగలు, 2.50 కిలోల వెండి**

**- 3.30 లక్షల నగదు అపహరణ**

కోవూరు, (నెల్లూరు), ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : తాళాలు వేస్తే చాలు.. దొంగల పని హల్‌చల్‌గా మారింది. ఎక్కడ తాళాలు వేస్తే అక్కడే చోరీ చేయడం పరిపాటిగా ఈ గుర్తు తెలియని దొంగల బృందం ఎంచుకుంది. ఈ నేపథ్యంలో కోవూరులోని బుద్ధివారి వీధి ప్రాంతంలోని గొల్లవీధిలో సోమవారం భారీ చోరీ చోటు చేసుకుంది. ఈ ప్రాంతానికి చెందిన కొప్పోలు సుధాకర్ ఇంటికి తాళాలు వేసి నెల్లూరులోని సౌత్ రాజుపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తీరా సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు తీసి బీరువా తెరిచి ఉండడం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన చోరీ జరిగిన ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా క్లూస్ టీమ్ రావడంతో నిశిత పరిశీలన చేపట్టారు. ఈ మేరకు బాధితుడు సుధాకర్ కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 58 సవర్ల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి వస్తువులు, 3.30 లక్షల నగదు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటన గొల్లవీధి ప్రాంతంలో సంచాలనం కలిగించింది. ఇటీవల కాలంలో కోవూరు ప్రాంతంలో ప్రశాంతంగా ఎటువంటి చోరీలు జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఇంత పెద్ద మొత్తంలో సుమారు 1.5 కోట్ల మేరకు నగలు, వెండి వస్తువులు పోవడంతో బాధితులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పది, ఇంటర్‌లో ప్రతి విద్యార్థి పాసవ్వాలి
# 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



● మంత్రి బాల వీరాంజనేయస్వామి ● వార్డెన్‌ల పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణపై ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయాల సేకరణ

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: పది, ఇంటర్ పరీక్షల్లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ప్రతి విద్యార్థి పాసవ్వాలని అన్ని హాస్టళ్లలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళసోషల్ వెల్ఫేర్ డీడీలతో మంత్రి జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే అంశంపై మంత్రి సమీక్ష చేశారు. ముందుగా గత ఏడాది పరీక్ష ఫలితాలను జిల్లాల వారీగా జిల్లాల వారీగా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని హాస్టల్స్ లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి, అందుకనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందించి విద్యార్థులను సన్నద్ధం చేయాలి. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ట్యూటర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. విద్యార్థుల చేత రైజింగ్ స్టార్, షైనింగ్ స్టార్ పుస్తకాలు చదివించాలి.
విద్యార్థులకు వార్డెన్‌లు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి, ఎంసెట్, ఐఐటీ నీట్‌కి దరఖాస్తు చేయించాలి. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ ప్రతి జిల్లాలో ఒక చోట వసతి, భోజన సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలి. మెనూ, వార్డెన్‌ల పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణపై ఐవిఆర్ఎస్ ద్వారా విద్యార్థుల నుంచి అభిప్రాయాల సేకరిస్తున్నాం. విద్యార్థుల సంతృప్తి పెంపే లక్ష్యంగా వార్డెన్ల పనితీరు, పారిశుధ్య నిర్వహణ ఉండాలి. విద్యార్థుల ఆరోగ్యం భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో ఔట్సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా శానిటేషన్ వర్కర్స్ నియమిస్తున్నాం. అన్ని హాస్టల్లలో ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పీఎం అజయ్ కింద రాష్ట్రంలో 26 నూతన హాస్టళ్ల నిర్మిస్తున్నాం. నిర్మాణ పనుల్ని డీడీలు పర్యవేక్షించాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అధికారుల్ని ఆదేశించారు. ఈ సమీక్షలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి, అన్ని జిల్లాల డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## బాబు, జగన్, పవన్ మోడీ తొత్తులే
### ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి



శ్రీ సత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, జగన్మోహన్ రెడ్డిలు సైతం మోడీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైయస్.షర్మిల రెడ్డి తూర్పార పట్టారు. మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి నందు ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2006 లో ఇదే అనంతపురం జిల్లా నుంచి ఉపాధి హామీ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారనీ గుర్తు చేశారు. ఈ పథకం వైయస్. రాజశేఖర్ రెడ్డి ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న పథకం అన్నారు. మన్రేగా ను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తొలగించి వి బి జి ఆర్ ఏ ఎం జి నీ ప్రవేశపెడుతున్నారని, అందులో ఎన్నో లోపాలు ఉన్నాయన్నారు. 100 రోజుల పాటు ఉపాధి హక్కును 125 రోజులు ఇస్తామని బుటకపు కబుర్లు చెబుతూనే, పనులు నిర్ణయాధికారాన్ని గ్రామసభల కు కాకుండా కాంట్రాక్టర్లకు సమర్పించుకుంటున్నారన్నారు. గ్రామానికి అవసరమైన పనులు చేసుకొనే హక్కు ఇక పై లేదనీ, కేంద్రం నోటిపై చేసిన పనులు చేయాలని చెబుతున్నారని, కాంట్రాక్టర్లకు లేబర్ ను సప్లై చేసేలా కొత్త చట్టం తెచ్చారనీ మండిపడ్డారు. మన్రేగా పథకంలో పని చేసే సమయం 6 గంటలుగా ఉంటే, ఇప్పుడు కొత్త చట్టం క్రింద 12 గంటలకు పెంచుతున్నారని ఆరోపించారు. చట్టాన్ని పూర్తిగా నీరుగార్చేందుకు రాష్ట్రాల మీద భారం మోపారనీ, రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వక పోతే ఇక పథకం నిలిచి పోయినట్లే అన్నారు. ఇప్పటికే 11 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రంపై 5 వేల కోట్ల భారం పడుతుందన్నారు. ఈ చట్టం ద్వారా రాష్ట్రానికి ఎలా లాభమో చంద్రబాబు చెప్పాలన్నారు. గడచిన ఐదేళ్లలో 50 లక్షల ఉపాధి కార్డులు తొలగించారన్నారు. వేతనాలు నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారనీ, రాష్ట్రంలో మన్రేగా పరిరక్షణ కి అందరూ కలసి రావాలనీ ఆమె పిలుపునిచ్చారు.

## ఎపిఎండిసికి మరో 6 బీచ్ శాండ్ లీజులు

విజయవాడ, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థకి దాదాపు ఐదు వేల హెక్టార్లలో మరో ఆరు బీచ్ శాండ్ లీజుల మంజూరుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు అణు ఇంధన శాఖ తాజాగా కేంద్రానికి సిఫార్సు చేసింది. దీంతో శ్రీకాకుళం, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో ఆరు లీజులు ఏపీఎండీసీకి దక్కనున్నాయి. దీనికి కేంద్ర గనుల శాఖ ప్రాథమిక అనుమతి జారీ చేస్తే, రాష్ట్ర గనుల శాఖ ఏపీఎండీసీకి ఆ లీసులు మంజూరు చేసే ప్రక్రియ చేపడుతుంది. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు మొత్తం 16,604 హెక్టార్లలో 16 లీజుల మంజూరు కోసం గతం నుంచి ఏపీఎండీసీ ప్రయత్నాలు చేస్తోంది. వీటిలో 211 మిలియన్ టన్నుల బీచ్ శాండ్ నిల్వలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని 909.85 హెక్టార్లలో రెండు లీజులు, విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో 90.15 హెక్టార్లలో ఒక లీజు కలిపి వెయ్యి హెక్టార్లలో మూడు లీజులు ఏపీఎండీసీకి గతంలో మంజూరయ్యాయి. వీటిలో తవ్వకాలు మొదలుపెడితే మిగిలిన లీజులు మంజూరు చేస్తామని గతంలో కేంద్రం తెలిపింది. ఈ మూడు లీజులకు టెండర్లు పిలిచి, మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్ గుత్తేదారును ఎంపిక చేశారు. తవ్వకాలలకు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు వివిధధ అనుమతులు తీసుకుంటున్నారు. దీంతో ఇప్పుడు కొత్తగా మరో ఆరు లీజులు ఇచ్చేందుకు సానుకూల నిర్ణయం వెలువడింది. దీంతో ఏపీఎండీసీకి మొత్తం 9 బీచ్‌శాండ్ లీజులు దక్కినట్లు అవుతుంది. బీచ్ శాండ్‌లో మోనజైట్, ఇల్మినైట్, రూటైల్, లుకోక్సెన్, జిర్కాన్, గార్నెట్ సిల్లిమనైట్ వంటి ఖనిజాలు ఉంటాయి. మోనజైట్‌లో అణుధార్మికత ఎక్కువగా ఉంటుంది. మిగిలిన ఖనిజాల్లో పరిమితంగా ఉంటుంది. బీచ్ శాండ్ తవ్వకాలు చేసి, వాటిలో ఆయా ఖనిజాలను వేరుచేసి, తర్వాత విలువ జోడించే ప్రక్రియ చేపడతారు. ఇప్పటికే మంజూరైన మూడులీజుల్లో తవ్వకాలు, ఖనిజాలను వేరుచేయడం వాటికి వాల్యూ యాడ్ చేయడం తదితరాల కోసం పిలిచిన టెండర్లను అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లువియర్ హెవీ మినరల్స్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ తవ్వకాలు తదనంతర ప్రక్రియ చేపట్టి, ఆయా ఖనిజాల విక్రయాలు మొదలుపెడితే ఏపీఎండీసీకి ఏటా రూ.150 కోట్ల వరకు రాబడి వస్తుంది. ఇప్పుడు కొత్తగా మరో ఆరు లీజులకు కూడా టెండర్లు నిర్వహించి, తవ్వకాలు చేపడితే ఏపీఎండీసీ రాబడి భవిష్యత్తులో మరింత పెరగనుంది.

## పవన్‌ని విమర్శించినప్పుడు కాపు నేతలు ఏమయ్యారు?



తిరుపతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్తప్రతినిధి: కాపు నేత ముసుగులో వైసిపి జెండాను మోస్తున్న అంబటి రాంబాబు కాపులను రెచ్చగొట్టి, వైసిపి చిల్లర రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని జనసేన నేత కిరణ్‌రాయల్ మండిపడ్డారు. కాపులు తాగుబోతులు, మాంసం తిని నిద్రపోతారని.. రాజకీయాలకు పనికిరారని గతంలో అంబటి అవమానించలేదా?అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ భార్య బిడ్డలను, చిరంజీవిని వైసిపి నేతలు దూషించినప్పుడు అంబటి రాంబాబుకి కాపులు గుర్తురాలేదా అని ఎద్దేవాచేశారు. విశాఖలో పవన్ కళ్యాణ్ ని అడ్డుకుని, రోడ్డుపై పడుకోబెట్టినప్పుడు కాపుల పౌరుషం ఏమైందన్నారు. తిరుమల లడ్డూ వివాదాన్ని, అంబటి రాంబాబు రాసలీలలను పక్కదోవ పట్టించడానికే కుల రాజకీయాలను తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. వైసిపి హయాంలో కాపులపై అక్రమ కేసులు పెట్టి, రౌడీషీట్లు తెరిచినప్పుడు అంబటి ఎక్కడ దాక్కున్నావంటూ వ్యంగ్యోక్తులు చేశాడు. అంబటి రాంబాబు ఒక కాపు నేత కాదు.. కాపుల పాలిట జోకర్ అని కిరణ్‌రాయల్ విమర్శించారు. తప్పు చేసిన వ్యక్తిని కులానికి ఆపాదించి వెనకేసుకురావడం అంబటి రాంబాబుకే చెల్లిందన్నాడు.



## బోజ్జనపల్లిలో భూ ఆక్రమణలు
### పట్టించుకోని రెవెన్యూ అధికారులు

రాపూరు(నెల్లూరు), ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: మండలంలోని బోజ్జనపల్లి పంచాయితీలోని రాపూరు నెల్లూరు ప్రధాన రహదారిలో వున్న పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల పక్కనే వున్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు ఏ మాత్రం ఆగడం లేదు. సోమవారం ఈ భూములలో మొక్కలు తీస్తుండగా గ్రామస్తులు అడ్డుకోని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అక్కడి నుండి వెళ్లిపోయిన కబ్జాదారులు, మంగళవారం తెల్లవారు జామున జెసిబిల సాయంతో ఈ భూములలో మొక్కలు తీసి చదును పెట్టారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారు అడిగిన వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. గత రెండు రోజులుగా ఈ భూ ఆక్రమణలు ప్రధాన రహదారి పక్కనే జరుగుతున్నప్పటికి రెవెన్యూ అధికారులు ఈ ఆక్రమణలపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల అండతోనే కబ్జాదారులు ఈ భూ ఆక్రమణ లకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు.
ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ ఉన్నతా ధికారులు స్పందించి రాపూరు మండలంలో కొనసాగుతున్న భూ ఆక్రమణ లపై దృష్టి సారించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు వారికి సహ కరిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.
మండలంలో ఇంకా అక్కడక్కడా కొద్దిపాటిగా మిగిలివున్న ప్రభుత్వ భూములను భూబకాసారుల నుండి కాపాడాలని వారు కోరుతున్నారు.

## విద్యార్థి నేతల కిడ్నాప్‌లో మోహన్‌బాబు, మంచు విష్ణును అరెస్టు చేయాలి



తిరుపతి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్తప్రతినిధి: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి శాంతి యుతంగా నిరసన తెలిపేందుకు వెళుతున్న విద్యార్థిసంఘాల నేతలను అర్ధాంతరంగా అపహరణ చేసి, వారిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు.
తిరుపతి సమీపంలోని ఎ,రంగంపేటలోని శ్రీవిద్యానికేతన్‌లో అనేక సమస్యలపై ఆందోళనలకు సిద్ధమైన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఎస్వీయూ నాయకుడు వినోద్ లను ఆ విశ్వవిద్యాలయంకు చెందిన కొందరు బౌన్సర్లు జిల్లా కలెక్టరేట్ వద్దే దౌర్జన్యంగా కిడ్నాప్ చేసి తమ వాహనాల్లో తీసుకువెళ్లడాన్ని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు తీవ్రంగా ఖండించారు. సినిమా తరహాలో నిజజీవితంలో కూడా చట్టవ్యతిరేకమైన పనులు చేసి తప్పించుకోవచ్చని ఆ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు మోహన్ బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణు వ్యవహారం మారిందన్నారు. విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి తమ పబ్బం గడుపుకోవాలని చూడటం హేయమైన చర్య అన్నారు. తక్షణం దీనిపై పోలీసులు విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, లోతైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## బంగారు, వెండి ధరల హెచ్చుతగ్గులతో బంగారు దుకాణాలు బంద్



ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో బంగారు దుకాణాలను యాజమాన్యాలు బంద్ చేశాయి. ఇటీవల బంగారు, వెండి ధరల హెచ్చుతగ్గులతో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆన్ లైన్ ధరలకు, బంగారు సప్లై చేసే మధ్యవర్తులు ధరలకు తేడా అధికంగా ఉండటం ఆన్ లైన్ ధరలకు విక్రయిస్తే నష్టపోవడంతో పాటు కొద్ది రోజుల క్రితం హెచ్చు ధరల సమయంలో బంగారు కొనుగోలు చేసిన వినియోగదారులు పాత ధరకే వెనుక తీసుకోవాలని ఒత్తిడి తెస్తుండటం జరుగుతుంది. దీంతో ఏమి చేయాలో పాలుపోక కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో బంగారు, వెండి వ్యాపారస్తులు తమ దుకాణాలు బంద్ చేసుకున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 19 వ తేదీ నుండి పెళ్లిళ్ల సీజన్ మొదలు అవుతుండగా క్రయవిక్రయాలు ఎలా జరపాలో అర్థం కావడం లేదని వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలను ఈ రోజు ఒక్క రోజే బంద్ చేయాలా..? లేదా బంగారు, వెండి ధరలు నియంత్రణలోకి వచ్చే దాక దుకాణాలు బంద్ చేయాలో యూనియన్ నాయకులు సమావేశమై నిర్ణయిస్తారని వ్యాపార యజమాన్యులు తెలిపారు.

## యువతకు ఉచిత జిఎస్టీ ఫైలింగ్ శిక్షణ
### స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్, టాక్స్ బార్ అసోసియేషన్ మధ్య ఒప్పందం

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వ జీరో పావర్టీ పి-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) చొరవలో భాగంగా, ‘బంగారు కుటుంబం పథకం కింద నిరుద్యోగ యువతకు ఉచిత జీఎస్టీ ఫైలింగ్ శిక్షణ అందించేందుకు స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్,. ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ మధ్య మంగళవారం లైలా కాలేజ్ ఆడిటోరియం ఎదురుగా గల స్థానిక వెంకటేశ్వర కాలనీలో స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా ఉచిత శిక్షణ ఇవ్వాలని టాక్స్ బార్ అసోసియేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ చెరుకూరి కుటుంబరావు సమక్షంలో, ఫౌండేషన్ సీఈఓ జె. విజయలక్ష్మి, ఏపీ టాక్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.
ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ చెరుకూరి కుటుంబరావు మాట్లాడుతూ జీఎస్టీ ఫైలింగ్‌లో ఒక నెల రోజుల ఉచిత శిక్షణ ఉంటుందని, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు లేదా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు వివిధ వ్యాపార సంస్థలకు సంబంధించి నెలవారీ జీఎస్టీ రిటర్నులను ఫైల్ చేస్తూ స్వయం ఉపాధిని పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ టాక్స్ బార్ అసోసియేషన్ సెక్రటరీ సురేష్ కుమార్, ట్రెజరర్ ఫణి కుమార్, జీఎస్టీ ట్రైనర్ చక్ర రమణ, స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిసి హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు
### ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్య అందించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా బిసి హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు మంజూరు చేశామని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. రాజధాని అమరావతి రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో బిసి సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో 2026-27 బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టబోతున్న పథకాలు, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధులు రాబట్టడంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, 202526కు సంబంధించి రూ.20 కోట్ల మేర సాస్కి నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీచేసిందన్నారు. ఈ నిధులను రాష్ట్రంలో 238 హాస్టళ్లలో మరమ్మతులకు వినియోగించనున్నట్లు తెలిపారు. రెండు నెలల కిందట రూ.60 కోట్ల సాస్కి నిధులు విడుదల చేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలోనూ రూ.25 కోట్లను హాస్టళ్ల మరమ్మతుల కోసం విడుదల చేశామని, ఇలా ఏడాదిలో రూ.105 కోట్లను హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి వెచ్చించామన్నారు. బిసి హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ రుచికరంగా అందించాలనే ఉద్దేశంతో ఇటీవల కుక్‌లు, కమాటీలను నియమించామన్నారు. సన్న బియ్యంతో బిసి బిడ్డలకు రుచికరమైన భోజనం అందిస్తున్నామన్నారు. బిసి విద్యార్థులకు ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**నేడు సిఎం చంద్రబాబుతో సమీక్షా సమావేశం**

రాబోయే బడ్జెట్ నేపథ్యంలో సీఎం చంద్రబాబుతో బిసి సంక్షేమ శాఖ పరిధిలో పథకాల అమలు, అభివృద్ధి పనులపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో బిసిల అభ్యున్నతికి అవసరమైన నిధులు రాబట్టడానికి కృషి చేయాలన్నారు.


ఆలయ చైర్మన్‌కు విరాళము అందిస్తున్న దాతలు

# పాంచాహ్నిక దీక్షా పూర్వక మహాశివరాత్రి ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో 13 (శుక్రవారం) నుండి 17 (మంగళవారం) వరకు పాంచాహ్నిక దీక్షా పూర్వక మహాశివరాత్రి ఉత్సవాలు, 18 బుధవారం నుండి 20 శుక్రవారం వరకు ద్వాదశ ప్రదక్షిణల పవళింపు సేవలు నిర్వహించనున్నారు. ఆ క్రమంలో 13న ఉదయం 8 గంటలకు ఎ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులను మంగళ స్నానములు, వధూవరులుగా అలంకరించుట, సాయంత్రం 4 గంటలకు గణపతి పూజ పుణ్యాహవాచనం, అంకురార్పణ మండపారాధన కలశ స్థాపన ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనములు బలిహరణ హారతి మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, 14,15తేదీల్లో ప్రతి రోజు ఉదయం సాయంత్రం నిత్య పూజలు నిర్వహణ అనంతరం 15న ఆదివారం రాత్రి 9 గంటలకు మహాన్యాసం, లింగోద్భవ కాల అభిషేకము మహా నివేదన హారతి మంత్ర పుష్పములు తదుపరి "శ్రీ గంగా కనకదుర్గా సమేత మల్లేశ్వర స్వామి వార్ల దివ్య లీలా కళ్యాణోత్సవము" 16న సోమవారం నిత్య పూజలు అనంతరం సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా కనకదుర్గా నగర్ మీదుగా బ్రాహ్మణ వీధి, పాత శివాలయం, మెయిన్ బజార్, కెనాల్ రోడ్డు మీదుగా రథోత్సవము కనకదుర్గా నగర్ మీదుగా శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల ఆలయానికి చేరుకుంటారు. 17న మంగళవారం ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, ధ్వజకోత్సోత్సవం, వసంతోత్సవము అనంతరం దుర్గా ఘాట్‌లో అవభృథోత్సవము, ధ్వజావరోహణము నిర్వహించబడతాయి. 18 నుండి 20 వరకు పంచ హారతులు ద్వాదశ ప్రదక్షిణలు అనంతరం పవళింపు సేవ నిర్వహించబడతాయని ఆలయ ఈవో శీనానాయక్ తెలియపరిచారు. 15న మహాశివరాత్రి రోజు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవ ఆర్జిత సేవలో పాల్గొనుటకు దంపతులకు ఉభయ రుసుము రూ.1,116/-లుగా నిర్ణయించడమైనది. పాల్గొన్న భక్తులకు శేషవస్త్రము, రవిక, శ్రీవక్ర లడ్డు ప్రసాదము అందచేస్తారు.

**నిత్యాన్నదానం విరాళ దాతలు:** ఇంద్రకీలాద్రి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిత్యము నిర్వహించే నిరతాన్నదాన పథకమునకు హైదరాబాద్ వాస్తవ్యులు చల్లా చంద్రమౌళి, సరోజిని దంపతులు రూ.1,00,000/-లు విరాళాన్ని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు (గాంధీ) అందచేశారు. వారికి ఆలయంలో అమ్మవార్ల దర్శనానంతరం వేద పండితులచే వేదాశీర్వచనం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం తీర్థప్రసాదములు అందచేశారు.

# క్షమాపణ చెప్పమన్నందుకే మాపై దాడులు

## • తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని నివేదిక • తప్పుడు ప్రచారం చేసినందుకు భక్తులకు సారీ చెప్పాల్సిందే: మాజీ మంత్రి విడదల రజిని



గుంటూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసినందుకే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, నాపైన కూటమి నాయకులు దాడులతో తెగబడ్డారని మాజీ మంత్రి విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ సీబీఐ సిట్ చార్జిషీట్‌తో తిరుమల లడ్డూకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని తేలిపోయిందని సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా శ్రీవారి లడ్డూపై చేసిన తప్పుడు ప్రచారం కూటమి ప్రభుత్వానికి ఉరి తాడులా బిగుసుకుందని దాని నుంచి బయటకు రాలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. తప్పుడు ప్రచారాలకు క్షమాపణలు అడగాల్సిందిపోయి దిగజారిపోయి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి శ్రీవారి ప్రతిష్టను ఇంకా దిగజారుస్తున్నారని ఆమె మండిపడ్డారు. కూటమి కుట్రలను నమ్మకపోవడంతో ప్రజలను డైవర్ట్ చేయడానికి ప్రణాళిక ప్రకారం వైయస్సార్సీపీ నాయకులపై చంద్రబాబు దాడులు చేయిస్తున్నాడని ఆరోపించారు. ఆయన చెప్పినట్టు రూల్ ఆఫ్ లా అమలు జరిగేట్టుంటే టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి, కేంద్ర మంత్రి పెమ్మసాని ఈ పాటికే జైల్లో ఉండేవారని దీటుగా స్పందించారు. దాడులు చేసిన వారిని వదిలేసి బాధితులమైన మాపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ రాజ్యాంగం అమలు చేస్తున్నామని చంద్రబాబు ఎలా చెప్పుకుంటారని మాజీ మంత్రి విడదల రజిని ప్రశ్నించారు. దాడులు చేసిన టీడీపీ ఎమ్మెల్యేను ఎలా వదిలేశారు? తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు, కోట్లాది మంది శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని సీబీఐ సిట్ చార్జిషీట్ కాపీని పట్టుకుని డిమాండ్ చేసినందుకే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల ఇళ్లపై కూటమి నాయకులు దాడులతో తెగబడ్డారు. రూల్ ఆఫ్ లా అమలు చేస్తామని చెబుతున్న సీఎం చంద్రబాబు, అంబటి రాంబాబు ఇంటిపై తామే దాడి చేసి విధ్వంసం సృష్టించామని మళ్లీ కూడా దాడి చేస్తామని మీడియా సాక్షిగా టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి రెచ్చిపోయి మాట్లాడుతుంటే ఆమెను ఇంతవరకు అరెస్ట్ చేయలేదు. ఆమెతోపాటు కేంద్ర మంత్రి పెమ్మసాని సైతం వైయస్సార్సీపీ నాయకులకు 24 గంటల్లో సినిమా చూపిస్తామని బహిరంగ సభల్లో హెచ్చరికలు జారీచేశాడు. ఇదంతా చూస్తుంటే పక్కా ప్రణాళిక ప్రకారం వైయస్సార్సీపీ నాయకుల మీద జరుగుతున్న దాడులేనని ఎవరికైనా తెలిసిపోతుంది. ఆవేశంలో తాను మాట్లాడిన మాటలకు చింతిస్తున్నానని అంబటి రాంబాబు ప్రకటించిన తర్వాతైనా నెమ్మదించకుండా ఇంకా రెచ్చిపోయారంటే ఇది ప్రణాళిక ప్రకారం జరిగిన దాడిగానే చూడాలి. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు శాంతి భద్రతలను కాపాడాల్సింది పోయి తానే విధ్వంసాలకు పథక రచన చేస్తూ రాష్ట్రంలో అశాంతికి కారణమవుతున్నాడు. దాడులు దౌర్జన్యాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. వివాదానికి కారణమైన ఫ్లెక్సీలకు పోలీసు రక్షణా? చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రచారం చేసినట్టుగా ఆ నెయ్యిలో పంది కొవ్వు, ఆవు కొవ్వు, చేపల నూనెలు కలవలేదని ఎన్‌డీడీబీ, ఎన్డీఆర్ఐ వంటి ప్రముఖ సంస్థల ల్యాబ్ రిపోర్టుల ద్వారా నిర్ధారణ అయ్యిందని సీబీఐ సిట్ చార్జిషీట్‌లో స్పష్టం చేసింది. ఆఖరుకి వైయస్సార్సీపీ నాయకులు గుడికి పోయి దేవుడికి పూజలు చేసినా తప్పేనా? వైయస్సార్సీపీలో ఉండే వారు గుడికి వెళ్లకూడదని కూడా జీవో ఇస్తారేమో. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే రాష్ట్రాన్ని ఏ వైపునకి తీసుకెళ్లాలని చంద్రబాబు చూస్తున్నాడో అర్థం కావడం లేదు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఏది.. రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం రక్షణ లేదు. మాజీ మంత్రినైన నాపైన ఇప్పటికే పదిసార్లు దాడులు చేశారు. ఇక సామాన్య మహిళలకు ఈ రాష్ట్రంలో రక్షణ ఎక్కడ ఉంటుంది? రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో 20 నెలలుగా రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్‌ని లోకేష్ పీనల్ కోడ్ గా మార్చేశారు. పాలనలో పూర్తిగా విఫలమైన చంద్రబాబుకి అప్పులు తప్ప అభివృద్ధి చేయడం చేతకావడం లేదు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్ష వైయస్సార్సీపీ ప్రశ్నిస్తుంటే వారు ఓర్చుకోలేక పోతున్నారు. చంద్రబాబుకి చేతనైతే వైయస్ జగన్ గారికన్నా మంచి పాలన ఇచ్చి ప్రజల మన్ననలు పొందాలే కానీ ఇలాంటి దాడులతో వైయస్సార్సీపీని అడ్డుకోవాలని చూడటం అవివేకమని విడదల రజిని అన్నారు.



# సీమకు అన్యాయం చేసింది జగనే

## - ప్రభుత్వవిప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: రాయలసీమ ప్రాంతానికి అన్యాయం చేసి ఐదిమాజీ సిఎం వైఎస్ జగన్ అని ప్రభుత్వవిప్, కడ పిఎస్ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం గుడుపల్లె మండలం పాపానురువద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎంపిపి ఛైర్మన్ జిపిఎం రాజుతో కలిసి మాట్లాడారు. రాయలసీమకు అన్యాయం జరిగిందంటూ వైఎస్సార్సీపీ నేతలు నిస్సిగ్గుగా ప్రవర్తిందడమనుకున్నారు. 2014-19మధ్య సిఎం చంద్రబాబునాయుడు రాయలసీమ ప్రాజెక్టుకు 12వేల కోట్లు ఖర్చు చేస్తే 2019-24మధ్య వైఎస్ జగన్ 2వేల కోట్లు మాత్రం ఖర్చు చేశారన్నారు. సిఎం చంద్రబాబు పులివెందులకు నీళ్ళిచ్చి చీనీతోటలు, అరటి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. వర్షాలు లేని సమయంలో రెయిన్‌గన్లు పెట్టి పంటలను కాపాడారన్నారు. సిఎం చంద్రబాబు ఈ 18నెలల కాలంలోనే సీమలో 8వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ కాలువకు 3780కోట్లు ఖర్చు పెట్టి శ్రీశైలం నుంచి కుప్పంలో చివరి పాయింట్ పరమసముద్రం దాకా నీరుతెచ్చారన్నారు. ప్రస్తుతం కుప్పంలో 150చెరువులుకృష్ణాజలాలతో జలకళ సంతరించుకున్నాయన్నారు. అదే వైఎస్ జగన్ 2024 ఎన్నికల సందర్భంగా కుప్పంలో సినిమా సెట్టింగ్‌లు వేయడంతోపాటు ఆయనహెలికాప్టర్ గాల్లో ఎగిరేలోగా నీళ్లు ఆవిరైపోయి యనా నారు. వైఎస్సార్సీకి ప్రజలే బుద్ది చెబుతారని 2029ఎన్నికల్లో గుండుసున్నా మిగులుతుందన్నారు. ఎన్నికలముందు ఇచ్చిన హామీ మేరకురాయలసీమ మిషన్‌ను అమలుచేస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబుమాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో గ్రామాల్లో రక్తం చిందితే నేడు చంద్రబాబు పాలనలో నీళ్ల ప్రవహిస్తున్నాయన్నారు. సిఎం చొరవతో రిజర్వాయర్లు నిండాయన్నారు. వైఎస్ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేసు _న్నారనివిమర్శించారు. సమావేశంలో మండలఅధ్యక్షుడు సుబ్బు, మాజీఎంపిపి డా॥ వెంకటేష్, కార్పోరేషన్‌డైరెక్టర్ హేమా ఒంబరగౌడు, రెస్కోడైరెక్టర్ అమీర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# మైనింగ్ బ్లాక్‌ల అనుమతులకు రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ


విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి: వేలం నిర్వహించిన మైనింగ్ బ్యాక్‌లను వివిధ అనుమతులు వేగంగా లభించేలా చూసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీని నియిమస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీచేసింది. ఈ కమిటీకి సీఎస్ ఛైర్మన్‌గా ఉంటారు. గనులు, అటవీ-పర్యావరణ, పరిశ్రమలు, రెవెన్యూ శాఖల కార్యదర్శులు, కేంద్ర గనులశాఖ సంయుక్త కార్యదర్శి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ మదింపు సంస్థల సభ్య కార్యదర్శులు, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్‌లు సభ్యులుగా ఉంటారు. గనుల శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. న్యాయ నిపుణులు, మైనింగ్ రంగానికి చెందిన వారిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తారు. ఈ కమిటీ శాఖల మధ్య కోఆర్డినేషన్ ద్వారా ఆయా మైనింగ్ బ్లాక్‌లకు పర్యావరణ, అటవీ ఇతర అనుమతులు, రెవెన్యూ శాఖ నుంచి ఎన్వోసీలు వేగంగా దక్కేలా చూస్తుంది. త్వరగా ఆయా లీజుల్లో కార్యకలాపాలు మొదలయ్యేలా కృషి చేస్తుంది. ఆయా లీజులకు ఏయే అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి? రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎక్కడ సమస్యలు ఉన్నాయి? సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ తీర్పులు ఏం చెబుతున్నాయి? వంటివి పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుంది. సింగిల్ విండో క్లియరెన్స్ విధానానికి ప్రోత్సాహం అందిస్తుంది. ఈ కమిటీ నెలకు ఓ సారి సమావేశం అవుతుంది. వీటిపై ఏటా రాష్ట్రస్థాయి వర్క్‌షాపులు నిర్వహించి ఉత్తమ విధానాలు తీసుకొచ్చేలా చూడాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

# హైడ్రోజన్ టెక్నాలజీ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

విజయవాడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో హైడ్రోజన్ టెక్నాలజీ కోసం ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారాయణరావు తెలిపారు. ఎపిలో హైడ్రోజన్ ఎనర్జీ హబ్ ఏర్పాటులో భాగంగా నోడల్ ఏజెన్సీగా ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీఎపి జాయింట్ వెంచర్ సంస్థ జెకె శ్రీవాస్తవ హెన్‌ఫ్రా మధ్య మంగళవారం విజయవాడలో ఎంఓయు జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం ఈడి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. యూనివర్శిటీలో ఏర్పాటు చేసే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా స్వదేశీ సాంకేతికతతో ఎలక్ట్రోలైజర్ల తయారీ, హైడ్రోజన్ నిల్వ సామర్థం పెంపు, హైడ్రోజన్ ఆధారిత విమానాల కోసం రిఫ్యూయలింగ్ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయని అన్నారు. 18న మూలపేట భారీ ప్రాజెక్టును శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం 282 ఎకరాలు భూమిని ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. నెడ్‌క్యాప్ ఎమ్‌డి ఎం.కమలాకర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 202930 నాటికి రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని 10 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. యూనివర్శిటీ విసి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా ఎఐ, క్వాంటం కంప్యూటింగ్, హైడ్రోజన్ టెక్నాలజీని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. జెకె శ్రీవాస్తవ ఇన్‌ఫ్రా ఛైర్మన్ శ్రీవాస్తవ మాట్లాడుతూ హైడ్రోజన్ రంగంలో 27 ఏళ్ల అనుభవంతో ఈఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంకజ్ శ్రీవాస్తవ, ఆర్థర్ కోలాకోవస్కీ, పావల్ ట్రోజనోవస్కీ, ఎస్ఆర్ఎం యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ పార్థసారథి పాల్గన్నారు.


# రాజీ లేకుండా ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల, దోపిడిపై పోరాడుతాం

## - బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై, దోపిడీపై తమ పోరాటం రాజీలేకుండా కొనసాగుతుందని భారత చైతన్య యువజన (బిసివై) పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో "మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 2023 జూలై 23న స్థాపించిన బిసివై పార్టీ, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. బిసివై పార్టీ ఏ పార్టీకి తోక పార్టీగా ఉండదని, తన ప్రాణం ఉన్నంతవరకు ఏ పార్టీలో విలీనం కాదని రామచంద్ర యాదవ్ తేల్చిచెప్పారు. ప్రత్యామ్నాయ పార్టీగానే కొనసాగుతుందని, అందుకు మానసికంగా సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు.

# రాష్ట్రానికి నిధులపై ప్రత్యేక కార్యాచరణ



## సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో సిఎస్ రామకృష్ణారావు సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి3:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం డా. బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలప్రకారం నిర్వహించిన ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్‌లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం ఉందని, దీనిలో భాగంగా వరంగల్‌లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమీషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో వినియోగం కాకుండా ఉన్న మిగులు నిధులను రాష్ట్రానికి దక్కేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వి. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్,జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్,ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్.శ్రీధర్ వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలపై త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి భారీ ప్రకటన

## తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు: బల్మూరి వెంకట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి 3:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించింది నిరుద్యోగులేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొలువుల పండగ ఎలా జరిగిందో తెలంగాణ యువతకి తెలుసునన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు ఎందుకు ఇచ్చామంటే యువతకి భరోసా కల్పించేందుకేనని వివరించారు. నోటిఫికేషన్స్ ఇస్తే కొలువు వస్తుందనే భరోసా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు కల్పించామని చెప్పారు. మంగళవారం నాడు నాంపల్లిలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేటీఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలను అంగట్లో సరకులు అమ్మినట్టు అమ్మారని విమర్శించారు. 10 ఏళ్లలో నిరుద్యోగులను బాధపెట్టిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులపై వెంకట్ మండిపడ్డారు. వాళ్లకి చిత్తశుద్ధి ఉంటే 10 ఏళ్లలో అమ్ముకున్న ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం.. కేసీఆర్, కేటీఆర్ గడీ కాదన్నారు. తాజాగా టీజీపీఎస్సీ వన్ టైమ్ పాస్‌వర్డ్ రిజిస్ట్రార్లు ప్రాసెస్ చేస్తుందని వివరించారు. పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ చేస్తామని పేర్కొన్నారు.

ఇప్పుడు ఎవరిని రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నారంటూ కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే భారీ ప్రకటన చేస్తారని చెప్పారు. తప్పుడు ప్రచారాలను నమ్మకండంటూ యువతకు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు.

# సిఎం ప్రజావాణిలో 290 దరఖాస్తులు

**బేగంపేట ఫిబ్రవరి 3,ప్రభాతవార్త** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 290దరఖాస్తులు అందాయి.వాటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 90దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 29దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్లకోసం 132,ప్రవాసీ ప్రజావాణీకి 01దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 38దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.సీఎం ప్రజావాణీ స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్,అదనపు కలెక్టర్ సూర్యప్రకాష్,ఏసీపీ ఉమేందర్ దరఖాస్తులు స్వీకరించారు.


# డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య హత్యను ఖండిస్తున్నాం

## సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 03:** రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిజామాబాద్ జిల్లా మోపాల్ గ్రామానికి చెందిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ సౌమ్యను డ్రగ్స్ మాఫియా అతి దారుణంగా కార్ యాక్సిడెంట్ చేసి హత్య చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను శిక్షి ంచేందుకు తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ముఖ్య జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో డ్రగ్స్ మాఫియా అరాచకాలు పెచ్చుమీరుతున్నాయని, రంగారెడ్డి జిల్లా పరిధిలో పోలీసులు జరిపిన దాడుల్లో డ్రగ్స్ నిరంతరం పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని, ప్రతి జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా విచ్చలవిడిగా సాగుతోందని, ప్రభుత్వం వాటిని అరికట్టడంలో విఫలమవుతోందన్నారు. మాదకద్రవ్యాల వల్ల యువత పెడదారి పట్టి అరాచక శక్తులుగా మారుతున్నారని, దానివల్ల మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయని, వరుస హత్యలు జరుగుతున్నాయన్నారు.

రక్షణ కల్పించాల్సిన పోలీసులపైనే దాడులు జరుగుతుంటే, సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కేవలం అరెస్టులకే పరిమితం కాకుండా, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా వేళ్లతో సహా పెకిలించాలన్నారు.


కామారెడ్డి ఆకాశవాణి రిలే కేంద్రంలో అగ్ని ప్రమాదం కారణంగా ఎగసిన మంటలు

# కామారెడ్డి ఆకాశవాణి రిలే కేంద్రంలో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి పక్కన గల ఆకాశవాణి రిలే కేంద్రంలో మంగళవారం సాయంత్రం స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ కేంద్రంలో గల ఎండు కట్టెల్లో సాయంత్రం నాలుగున్నర గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ వున్న సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేయగా వారు వెంటనే రంగంలో దిగి అరగంట వ్యవధిలోనే మంటలను ఆర్పివేశారు. అయితే ఆకాశవాణి రిలే కేంద్రంలో ఎండు కట్టెలు ఉన్నట్లుండి ఎందుకు మంటలకు ఆహుతయ్యాయనేది ఎవరికి అర్థం కావడం లేదు. ఎవరైనా సిగరెట్లు తాగి వాటిపై పడవేశారా...? మరేదైనా కారణాల వల్ల మంటలు చెలరేగాయా...? అనే దానిపై అగ్నిమాపక శాఖ అధికారులు విచారిస్తున్నారు.

# మణిపూర్ సిఎంగా యమ్నం ఖేమ్‌చంద్

## ఢిల్లీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న శాసనసభా పక్షం

**ఇంఫాల్, ఫిబ్రవరి 3:** జాతుల వైరంతో రెండున్నరేళ్ల పాటు అట్టుడికిన ఈశాన్యరాష్ట్రం మణిపూర్‌లో ఇపుడు ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటివరకూ కొనసాగిన రాష్ట్రపతి పాలన ముగియడంతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధం అయింది. బిజెపి శాసనసభా పక్ష నాయకుడిగా మణిపూర్ ఎమ్మెల్యే యుమ్నం ఖేమ్‌చంద్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైన్మార్, బంగ్లాదేశ్‌లకు సరిహద్దుల్లో ఉన్న ఈ రాష్ట్రంలో వచ్చే 13వ తేదీనాటికి రాష్ట్రపతి పాలన అమలయి ఏడాది పూర్తవుతుంది. ఢిల్లీలో మణిపూర్ బిజెపి నేతలు ఎమ్మెల్యేలు, ఎన్డీయే కూటమి పార్టీల ఎమ్మెల్యేలు సమావేశం అయి ఖేమ్‌చంద్‌ను శాసనసభా పక్ష నాయకునిగా ఎన్నుకోవడంతో కథ సుఖాంతం అయింది. మణిపూర్ కేంద్ర పరిశీలకులు తరుణ్‌చుఘ్, ఈశాన్యరాష్ట్రాల ఇన్‌ఛార్జి సంబిత్‌పాత్రాలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జాతుల వైరంతో అట్టుడికిపోయిన మణిపూర్‌ను చక్కదిద్దేందుకు 2025 ఫిబ్రవరినుంచి రాష్ట్రపతి పాలన విధించారు.

# హైదరాబాద్ భరోసా కేంద్రాన్ని సందర్శించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** జంట నగరాలలో లైంగిక దాడులకు గురైన మహిళలు, చిన్నారులకు అండగా నిలుస్తున్న భరోసా కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సిపిసిఆర్) ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా విభాగం డిసి పి లావణ్యా నాయక్ జాదవ్ వారికి స్వాగతం పలికారు. అనంతరం భరోసా కేంద్రం పనితీరును డిసిపి లావణ్యా జాదవ్ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి సహా ఇతర ప్రతినిధులకు వివ రించారు. ఈ సందర్బంగా కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు అపర్ణ, చందన, సరిత, ప్రేమలత అగర్వాల్, వచన్ కుమార్‌లు భరోసా కేంద్రం పనితీరుపై సమీ క్షించారు. భరోసా కేంద్రం ఉద్దేశాలను, లక్ష్యాలను వారు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు బాధితులకు అందిన సహాయంపై వివరాలను తెలుసుకున్నారు. సమీక్ష తరువాత భరోసా కేంద్రం పనితీరును ఎసిపి సరిత కమిషన్ ప్రతి నిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డిసిపి లావణ్యా జాదవ్ మాట్లాడుతూ భరోసా కేంద్రం సాధించిన ఫ లితాలను వివరించారు. బాధితులకు భరోసా కేంద్రం ఎలా ఆదుకుంటున్నదీ కూడా వివరించారు. బాధితుల కోసం ఏర్పాటైన చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు గు రించి ఆమె కమిషన్ ప్రతినిధులకు వివరించారు. చిన్నారుల పట్ల అనుసరిస్తున్న విధానాలను డిసిపి వివరించారు. గత ఏడాది ఫోక్సో కేసుల్లో 38 మంది నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీసులు సఫలమయ్యారని డిసిపి తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది అత్యుత్తమని ఆమె చెప్పారు. నేరగాళ్లకు శిక్షల శాతం ఎక్కువగా వుండడం భరోసా కేంద్రం, పోలీసుల సమిష్టి కృషి వల్లే సాధ్యమయ్యిందని డిసిపి తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధులు భరోసా కేంద్రాన్ని సందర్శించడం తమకు ఎంతో సంతోషంగా వుందని ఆమె అన్నారు. అనంతరం కమిషన్ ప్రతినిధులు భరోసా కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించి అక్కడి అధికారులు, ఇతర సిబ్బందితో భేటీ అయి, వారు సాధి ంచిన ఫలితాలపై సంతోషం వ్యక్తం చేశారు. బాధితుల పట్ల భరోసా కేంద్రం చూపుతున్న ఔదార్యాన్ని వారు కొనియాడారు. భరోసా కేంద్రానికి బాల ల హక్కుల పరిరక్షణ కమిషన్ పూర్తి మద్దతు వుంటుందని ఛైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, ఇతర సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం అధికారులతో పాటు భరోసా కేంద్రం అధికారులు కూడా పాల్గొన్నారు.

# కాకతీయ జూ పార్క్‌లో తెల్లపులి మృతి

**ప్రభాతవార్త సుబేదారి:**హనుమకొండ జిల్లా హంటర్ లోని కాకతీయ జూ పార్కులో 14 సంవత్సరాల తెల్ల పులి మరణించింది పులులు సాధారణ జీవిత కాలం 12 సంవత్సరాలు కానీ ఈ తెల్ల పులి 14 సంవత్సరాలు జీవించి వృద్ధాప్య, గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమైన విషయమని అటవీశాఖ అధికారి మయూరి తెలియజేశారు.
నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనట్లు తెలిపారు.



# అరుదైన జీవరాశులపై అధ్యయనం

**ఒక వైపు ఉన్నత ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నానే... మరోపక్క దేశంలోని వివిధ ప్రాంతాలను అన్వేషిస్తూ అరుదైన జీవరాశులపై అధ్యయనం చేస్తున్నారు. విద్యార్థులు, యువ పర్యావరణవేత్తలను ముందుకు నడిపిస్తూ అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు. సైంటిస్ట్ డాక్టర్ చిత్ర శంకర్.**

నేను పుట్టి పెరిగింది తమిళనాడులో, స్కూలు, కాలేజీ విద్య కూడా ఇక్కడే సాగింది. తర్వాత కోయంబత్తూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి కీటక శాస్త్రంలో డాక్టరేట్ పొందాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసర్చ్ ప్రొఫెసర్‌గా చేస్తున్నాను. ఇక్కడ వరి పంటకు సంబంధించిన కీటకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. లోపల భాగంగానే సీతాకోక చిలుకలు, వివిధ రకాల పక్షుల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. చిన్నతనం నుంచి ప్రకృతిని పరిశీలించడమంటే ఇష్టం. అందుకే 30 ఏళ్ల నుంచి లద్దాఖ్, మణిపూర్, నాగాలాండ్ మినహా అన్ని ప్రాంతాలను కలిగి ఉంది. ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రకృతి అందాలను ఫోటోలు, వీడియోల రూపంలో కెమెరాలో బందించడం అలవాటు. ఇప్పటి వరకూ దేశం అంతా తిరిగి 800 రకాల పక్షి జాతులు, 250 సీతాకోక చిలుకలను సొంతంగా గుర్తించా, తెలంగాణలో ప్రయోగాత్మకంగా బటర్‌పై. మాత్(చిమ్మట)లను సర్వే చేయడానికి ములుగు జిల్లాకు వెళ్లా. ఏటూరునాగారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఎంతో విశాలమైనది. తాడ్వాయి, మేడారం, లక్నవరం మూడు ప్రాంతాలలో 91 రకాల సీతాకోక చిలుకలను గుర్తించాం. ఉద్యోగ విరమణ అనంతరం దేశం మొత్తంమ్మీద ఉన్న జాతీయ పార్కులు సందర్శించాలి. విదేశాల్లో ఉండే జీవజాతుల మీద కూడా పరిశోధనలు చేయాలి. జీవ వైవిధ్యం కాపాడటం కోసం దేశవ్యాప్తంగా పర్యటించి అవగాహన కార్య క్రమాలను చేపట్టాలి. ఒక మహిళ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. అందుకే మహిళలందరూ కెరియరన్‌పై దృష్టిపెడుతూనే ఆసక్తి రంగంవైపు అడుగులు వేయాలి. అప్పుడే మంచి ఫలితాలు సాధించొచ్చు. ◻

# ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు!



**ఒక్కో సారి చెప్పిన మాట తడబడుతుంటుంది.. ఆ వెంటనే తిరిగి మామూలుగా అవడంతో పెద్దగా పట్టించుకోం..**

అప్పుడప్పుడూ ఛాతీలో నొప్పి వస్తుంది.. గ్యాస్ట్రిక్ సమస్యేమోనని నిర్లక్ష్యం చేస్తున్నాం.. సడంగా బరువు తగ్గడం, జుట్టు ఎక్కువగా రాలడాన్ని అంత సీరియస్‌గా తీసుకోరు అయితే ఇలాంటి లక్షణాలు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. కొంతమంది జ్వరాన్ని తేలిగ్గా తీసుకుంటారు. ట్యాబ్లెట్స్, యాంటీ బయాటిక్స్ తో ఈ సమస్య నుంచి బయటపడ తారు. కానీ జ్వరం ఎక్కువ రోజుల పాటు కొనసాగినా. 103 డిగ్రీ వరకు చేరినా.. ఇది ఒక్కోసారి వివిధ రకాలు ఆటో ఇమ్యూన్ వ్యాధులకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయక పోవడం మంచిదని అంటున్నారు.

కొంతమందికి చూపించండి మాట తడబడుతుంటుంది.. ముద్దగా వస్తుంది. కాసేపటికి అదే సెట్ అవుతుంది అని దీన్ని నిర్లక్ష్యం చేస్తారు. అయితే ఈ లక్షణం శరీరంలో కొన్ని అనారోగ్యాలకు సంకేత మని నిపుణులు అంటున్నారు. రక్తంలో సోడియం చక్కెర స్థాయులు పడిపోవడం, అమ్మోనియా స్థాయులు పెరగడం, కాలేయ సంబంధిత సమస్యలు, మెదడు సంబంధిత సమస్యలు వంటి సమస్యలున్న ప్పుడు ఇలా జరిగే అవకాశాలు కనిపిస్తు న్నాయి. కాబట్టి ఇలాంటి కనిపించిన వెంటనే స్వం చేయ కుండా లక్షణాలు వైద్యులను సంప్రదించడం వల్ల అసలు సమస్యను గుర్తించవచ్చుంటున్నారు. ◻



# అయ్యప్ప తత్వం

శివుడు, విష్ణువు వేరుగా కనిపించినా.. ఒకే పరబ్రహ్మ స్వరూపం. ఈ శివకేశవ అభేదాన్ని అవతారరూపం లో చూపించేది అయ్యప్ప స్వరూపం అద్వైతాను భూతికి ఆచరణ రూపమే హరిహరసుత అయ్యప్ప అవతారం. పరమేశ్వరుడు మహాశక్తి స్వరూపుడు. ఆయన అనేకమై జగత్తును నడిపిస్తున్నాడు. ఆ యోగమాయె పురుషరూపంలో నారాయణుడు. స్త్రీ రూపంలో జగదాంబ అమ్మ క్రోధంలో కాళి, సమరంలో దుర్గ. భోగభాగ్యాల్లో భవాని, క్షీ రసాగర మథనం వేళ అమృతాన్ని అర్హులకు పంచడంలో నారాయణి, అసురులకు అందకుండా చేయడంలో మోహిని అయ్యింది. పరమశివుడు లోకరక్షణకై మోహినికి ఆకర్షితుడై మహిషి అనే రాక్షసిని (మహిషాసురుడి సోదరి) సంహరించేందుకు శక్తిని సృష్టించాడు. ధనుర్మాసం ఉత్తరా నక్షత్రంలో అవతరించిన ఆ శక్తి స్వరూపమే అయ్యప్ప. పౌరాణిక కథనాలను అనుసరించి కైలాసంలో గణపతి, సుబ్రహ్మణ్య స్థానాలతో పాటు మహాశాస్త్ర (జ్ఞానాన్ని, ముక్తిని ప్రసాదించే) స్థానం కూడా ఉంది హరిహర సంయోగంతో అవతరించిన శిశువును దేవతలు పంపానదీ తీరంలో వదిలేశారు. ఆ సమయంలో పందళ దేశాధీశుడైన రాజశేఖరుడు వేటకు వచ్చాడు. సంతానం లేని అతడు ఆ బిడ్డను ఈశ్వర ప్రసాదంగా భావించి రాజభవనానికి తీసుకెళ్లాడు. కంఠంలో మణిమాల ఉండటాన మణికురుడిగా పిలుచుకున్నారు. ఆ బాలుడు వచ్చిన వేళావిశేషంతో రాణికి సంతానం కూడా కలిగింది. పులిపాలు.. మహిషి సంహారం మహావీరుడైన మణికంఠ చిన్నతనంలోనే తన పరాక్రమంతో రాజ్యాన్ని శత్రువుల బారి నుంచి రక్షించాడు. భవిష్యత్తులో తన సొంత కుమారుడికి మణికంఠుడు అడ్డుగా ఉంటాడేమోనని భయపడింది రాణి. తీవ్ర అనారోగ్యంతో నటించి అది తగ్గడానికి పులిపాలు కావాలని రాజును ఒత్తిడి చేసింది. పులిపాలు తెచ్చేందుకు బయల్దేరిన మణికంఠ మార్గమధ్యంలో మహిషిని సంహరించి, పూర్వజన్మ శాపాన్ని తొలగించి ఆమెకి దైవత్వాన్ని ప్రసాదించాడు. తర్వాత తల్లి అజ్ఞానుసారం పులిపాలే కాదు. ఏకంగా పులిపై స్వారీచేసి రాజ్యానికి తిరిగొచ్చాడు. ఈ సంఘటనలను గమనించినప్పుడు అయ్యప్ప అవతార మూలతత్వం కనిపిస్తుంది. ◻



# చినిగితే.. ప్యాచ్ ఉందిగా!

ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న డ్రెస్ పొడవైన, చినిగిన టైలర్ దగ్గరికి పరుగెత్తాల్సిందే! సమయమంటే సరే... లేకపోతే? అంతేనా, అది సరిగా కుదరక పోయినా, అతుకు అమరకపోయినా ఇంకో ఇబ్బంది. కొన్నిసార్లు పక్కన పడే యాల్సిందే. ఈ ఇబ్బందులన్నీ ఎందుకు? ప్యాచ్ వేయండి చాలు.

**రంగులున్నాయ్! ...** కుర్చీలు, వాహనాలు... మన దుస్తులకు శత్రువులు ఒకటా రెండా. చిటికెలో వ్యాధి పడేలా చేస్తుంది. చిన్నవైతే దాచేయొచ్చు. కానీ పెద్దగా కనిపిస్తోంటే వేసుకోవడమూ కష్టమే. ఐరన్ ఆన్ ప్యాచ్లు తెచ్చి ఉంచుకోండి. ఇవి అన్ని రకాల రంగుల్లో దొరుకుతాయి. తగిన రంగు ఏంచుకుని చినిగిన ప్రదేశంలో ఉంచి, ఐరన్ చేయడమే. చక్కగా కలిసి పోతుంది. భిన్న రంగు వేస్తే కాంట్రాస్ట్ గానూ తోస్తుంది. కొన్ని కుట్టుకునే రకాలు ఉన్నాయి. వాటిని తెచ్చుకున్నా సరే. మడత పెట్టేయొచ్చు! అందంగా దాచేయొచ్చు..



**కుట్టండి లేదా ఐరన్ చేయండి...** డ్రెస్ లో ఏదో లోటు. అందంగా కనిపించట్లేదు అనిపిస్తోంది. అంటారా? అయితే ఈ ఫ్లోరల్ ప్యాచెస్ ప్రయత్నించొచ్చు. సమస్య ఉన్న ప్రాంతంలో కుట్టొచ్చు లేదా వస్త్రం మీద ఉంచి, వెనకవైపుగా ఐరన్ అయినా చేయొచ్చు. లోపాన్ని అందంగా దాచేయొచ్చన్న మాట. సాదా దుస్తుల అందాన్ని పెంచాలన్నా వీటిని తీసుకోవచ్చు. బాగా ఉన్నాయి కదూ! ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. కావాలంటే ప్రయత్నించండి. ◻

# ఎండే మనసుకు అండాదండా!



కొందరు చిన్న విషయాలకే అతిగా స్పందిస్తుంటారు. లేనిపోని విషయాల గురించి అతిగా ఆలోచిస్తుంటారు. ఎప్పుడూ ఏదో కోల్పోయినట్టు దిగాలుగా ఉంటారు. వీరి మానసిక ప్రవర్తనకు ఎన్నో కారణాలు ఉండొచ్చు. మిగతా సంగతులు పక్కన పెడితే.. ఇలా మానసికంగా కుంగి పోవడానికి విటమిన్ డి లోపం కారణమని చెబుతున్నారు పరిశోధకులు. కొందరు చిన్న విషయాలకే అతిగా స్పందిస్తుంటారు. లేనిపోని విషయాల గురించి అతిగా ఆలోచిస్తుంటారు. ఎప్పుడూ ఏదో కోల్పోయినట్టు దిగాలుగా ఉంటారు. వీరి మానసిక ప్రవర్తనకు ఎన్నో కారణాలు ఉండొచ్చు. మిగతా సంగతులు పక్కన పెడితే.. ఇలా మానసికంగా కుంగి పోవడానికి విటమిన్ డి లోపం కారణమని చెబుతున్నారు పరిశోధకులు. శరీరంపై ఎండ పడకపోవడం వల్ల విటమిన్ డి లోపం తలెత్తుతుంది. ఇలా విటమిన్ డి సరిపడా లేనివాళ్లు చిన్న సమస్యకు కూడా ఎక్కువగా స్పందిస్తారట. అంతేకాదు, భావోద్వేగాలను ఆపుకోలే రని, మానసికంగా కుంగిపోతారని హెచ్చరిస్తున్నారు. ◻



# ఆమ్లా పౌడర్ ఇంట్లోనే ..

ఆరోగ్య సిరి ఉసిరి కాయలతో పౌడర్ చేసి ఉంచితే.. అనేక వంటల్లో ఉపయోగించ వచ్చు. పదార్థాలకు రుచి వస్తుంది. శరీరానికి సివిటమిన్ అందుతుంది. ఎలా చేయాలంటే.. పెద్దవి, తాజావి అయిన పది ఉసిరి కాయలు తీసుకోవాలి. వాటిని బాగా కడిగి తడి లేకుండా తుడవాలి. చిన్న చిన్న ముక్కలుగా కోసి విత్తనాలు తీయాలి. ఈ ముక్కలను శుభ్రమైన వస్త్రం మీద పరిచినట్లుగా ఉంచి.. రెండు మూడు రోజులు ఎండబెట్టాలి. వాటిని ప్యాన్లోకి తీసి సన్న సెగ మీద వేయించాలి. నూనె వేయనవసరం లేదు. ముక్కలు వేగి.. కరకరలాడేలా ఉండాలి. చల్లారిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఒకసారి జల్లించి.. బరకగా ఉన్నదాన్ని మళ్లీ గ్రైండ్ చేయాలి. ఈ పౌడర్‌లో ఉప్పు, నూనె వంటివేమీ కలపకూడదు. దీన్ని గాలి చొరబడని సీసాలోకి.. తేమ లేని చల్లని ప్రదేశంలో ఉంచాలి. తడి స్పూన్ వాడకూడదు. ఇలా చేస్తే చాన్నాళ్ళు నిలవుతుంది. ఎలా ఉపయోగించాలంటే.. టొమాటోపప్పు, వంకాయ, బీరకాయ వంటి కూరలు, చారు, రసం, రోటిపచ్చళ్లు, మజ్జిగ పులుసు, సూప్స్ ఇలా ఎందులో వేసినా.. వాటికి అదనపు రుచి వస్తుంది. దీంతో ఆమ్లా రైస్ కూడా చేయొచ్చు. ◻

# కురులకు పెరుగు

**జుట్టు పొడిగా ఉంటే ఎంత ఎక్కువగా ఉంటుందో కదూ! మరి ఇలాంటి కురులను మృదువుగా, తేమ నిలిచి ఉండేలా చేసుకోవాలంటే ఇంట్లోనే ఈ ప్యాక్ ప్రయత్నించవచ్చుంటున్నారు నిపుణులు.**



ప్యాక్ ఇలా! గడ్డ పెరుగు తీసుకుని పేస్ట్ లాగా అయ్యేంత వరకు కలుపుతూనే ఉండాలి. ఇలా తయారైన పేస్టు జుట్టుకు, మాడుకు పట్టించి ఒక మాస్క్ లాగా వేసుకోవాలి తర్వాత తల చుట్టూ కాటన్ టవల్ చుట్టుకొని అరగంట పాటు అలాగే ఉంచుకోవాలి. తర్వాత పాంపూతో తలస్నానం చేసి కండిషనర్ రాసుకోవాలి. దీనివల్ల జుట్టు మృదువుగా తయారవడంతో పాటు మెరుపు కూడా వస్తుందట. నార్మల్ హెయిర్ ఉన్న వారు వారానికోసారి, పొడి జుట్టు ఉన్న వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ ట్రై చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ◻

# 'నాగబంధం' టీజర్ మహాశివరాత్రికి రిలీజ్



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వం వహించిన మోస్ట్ ఎవైటెడ్ మైథలాజికల్ యాక్షన్ డ్రామా ఖినాగబంధంఖి. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్లు అద్భుతమైన రెస్పాన్ తో అంచనాలను పెంచాయి. ఈ చిత్రం టీజర్‌ను ఫిబ్రవరి 15, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆకట్టుకునే టీజర్ పోస్టర్‌లో ఒక పురాతన ఆలయం లోని రహస్య నిధి చుట్టూ రక్షణగా చుట్టుకుని ఉన్న ఒక మహా నాగుపాము కనిపిస్తుంది. ఇది సినిమాలోని ఆధ్యాత్మిక దైవిక రహస్యాన్ని సూచిస్తుంది. భారతదేశంలోని చారిత్రాత్మక విష్ణు దేవాలయాల నేపథ్యంలో సాగే ఈ కథాంశం ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుంది.నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్‌సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్న ఈ విజువల్ వండర్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది.కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న నాగబంధం చిత్రం తుది నిర్మాణ దశకు చేరుకుంది. ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో భారీ పాన్ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.

తెర

# 'శ్రీ చిదంబరం గారు' సినిమాతో వాళ్ల మనోభావాలు సంతృప్తి : దర్శకుడు వినయ్ రత్నం



శ్రీమతి. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా రూపొందిన శ్రీ చిదంబరం. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయమవు తున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

**'శ్రీ చిదంబరం గారు' అనే ఈ కథ ఎందుకు చెప్పాలనుకున్నారు?**

ఈ ప్రజెంటేషన్ మోర్ ఇన్‌ఫరియట్ కాంప్లక్స్, ఇన్‌సెక్యూరిటీస్‌తో ఫీలవుతూ వాళ్ల లైఫ్‌ను కాన్ఫిడెంట్‌గా లీడ్ చేయాలేకపోతున్నారు.

**ఈ కథ ద్వారా మీరు ఎలాంటి అంశాన్ని డీల్ చేస్తున్నారు?**

అద్దంలో నిలబడి మనల్ని మనం చూసుకుని మనం బాగున్నామని ముందు మనం నమ్మాలి. ఒక మనిషిని నువ్వు ప్రేమించగలగాలి అంటే మొదట నిన్ను నువ్వు ప్రేమించాలి అనేది ఈ కథ సారాంశం.

**మీ నేపథ్యం ఏమిటి:?**

ఈ సినిమా అవకాశం ఎలా వచ్చింది? 25 షార్ట్ ఫిల్మ్ చేశాను. రాజమండ్రి మాది. నిహారిక కొణిదెలగారి సమర్పణలో ఫిల్మ్ ఫెస్టివల్స్ కోసం ఓ షార్ట్ ఫిల్మ్‌చేశాను. థియేట్రికల్‌గా ఇది మొదటి సినిమా. మొదట ఈ సినిమా క్రౌడ్ ఫండింగ్‌తో స్టార్ట్ చేశాము.

**ఈ సినిమాలో ఆర్టిస్టుల ఎంపిక ఎలా జరిగింది?**

ఈ సినిమాలో చిదంబరం అనే పాత్రకు సింగిల్ టేక్‌లో ప్లే చేయాలి. ఈ కథ అనుకున్నప్పుడే వంశీని హీరోగా అనుకున్నాను. మెల్ల కన్నుతో ఈ పాత్ర చేయడం అంతా ఈజీ కాదు . దానికి చాలా ప్రాక్టీస్ కావాలి.

**ఈ సినిమాలో వినోదానికి ఎంత వరకు స్కోప్ ఉంది?**

ఇది పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం కాదు. ప్యూర్ ఎమోషనల్ జర్నీ ఇది. కాకపోతే ఈ సినిమాలో ఎవ్వరిని ఇబ్బంది పెట్టని క్లీన్ కామెడీ ఉంటుంది.

**శ్రీ చిదంబరం గారు అనే టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?**

మెల్లకన్ను ఉన్నా వాళ్లను ఈస్ట్ గోదావరిలో చిదంబరం అని ఏడిపిస్తుంటారు. ఈ సినిమాలో కూడా హీరోని చిదంబరం అని పిలిచి పిలిచి అతన్ని వర్జినల్ పేరు కూడా మరిచిపోతాడు సినిమాలో ఇక కథ విన్న తరువాత పాత్ర మీద రెస్పక్ట్ పెరిగి శ్రీ చిదంబరం అన్నాం.


# 'బరాబర్ ప్రేమిస్తా' ప్రీ రిలీజ్



'బరాబర్ ప్రేమిస్తా' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకుడు జయంత్ సి పరాన్జీ.. ఆటిట్యూడ్

స్టార్ చంద్రహాస్ హీరోగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం˘బరాబర్ ప్రేమిస్తా. కాకర్ల సత్య నారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ ('ఇష్టంగా' ఫేమ్) ప్రతినాయకుడిగా నటించారు. ఈ మూవీని ఫిబ్రవరి 6న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ..చంద్రహాస్ మాట్లాడుతూ.. .. జయంత్ గారు తీసిన తీన్ మార్, శంకర్ దాదా చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. ఆది అన్న అద్భుతమైన కమ్ బ్యాక్ ఇచ్చారు. ఆది అన్నే నాకు స్ఫూర్తి. జేడీ చక్రవర్తి గారు అప్పటికీ ఇప్పటికీ ఒకేలా ఉన్నారు. నాకోసం ఇంత మంది రావడం ఆనందంగా ఉంది. అన్నారు...ఆది సాయి కుమార్ మాట్లాడుతూ.. ..ప్రభాకర్ అన్నతో నేను నెక్స్ట్ నువ్వే మూవీని చేశాను. అప్పుడు నాకు చంద్రహాస్ గురించి ఎక్కువగా చెబుతుండేవారు. మంచి హీరో అవుతా దని అప్పుడే అనుకున్నాను. చంద్రహాస్ పడే కష్టాన్ని చూస్తున్నాను. ఎంతో నిజాయితీగా కష్టపడుతున్నాడు. అని అన్నారు.

# 'కపుల్ ఫ్రెండ్లీ' ట్రైలర్ లాంచ్



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ". ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ "కపుల్ ఫ్రెండ్లీ" చిత్రంలో మిత్ర అనే క్యారెక్టర్ లో నటించాను. ఇలాంటి బ్యూటిఫుల్ క్యారెక్టర్ లో నటించే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. . అన్నారు.డైరెక్టర్ అశ్విన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మీ అందరికీ "కపుల్ ఫ్రెండ్లీ" మూవీ ట్రైలర్ నచ్చిందని నమ్ముతున్నాను. నిజాయితీ గల ఒక టీమ్ నిజాయితీగా చేసిన ప్రయత్నమిది. . అన్నారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ యూవీ క్రియేషన్స్ అంటే ఎంతో ప్యాషనేట్‌గా మూవీస్ చేసే ప్రొడక్షన్ హౌస్. ఈ సంస్థ జర్నీ ఇన్స్ పైర్ చేస్తుంటుంది. అన్నారు.హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ యూవీ క్రియేషన్స్ నా ఫ్యామిలీ లాంటిది. ఈ బ్యానర్ లో వచ్చే ప్రతి సినిమా మాది అనుకుంటాం. డైరెక్టర్ అశ్విన్ చంద్రశేఖర్ చేయబోయే ఎన్నో మంచి చిత్రాల్లో మొదటిదిగా "కపుల్ ఫ్రెండ్లీ" రిలీజ్ కు వస్తోంది. అన్నారు.

# 'వింటర్' చిత్రం ఘనంగా ప్రారంభం

'వింటర్' చిత్రం ఘనంగా ప్రారంభం.. క్రిసెంట్ సినిమా, టీఎస్ఆర్ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం˘వింటర్‌. రామ్, ఆదిత్య సూరజ్ సింగ్, కుసుమ చందక, శశికళ, శ్రీజిత ఘోష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని రియాజ్ అహ్మద్, టి. శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. ˘రాచరికం సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న సురేష్ లంకలపల్లి ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమాతో రిజ్వాన్ అలీ విలన్‌గా తెరకు పరిచయం కానున్నారు. ఇక ఈ మూవీని కశ్మీర్ లో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ˘వింటర్‌ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాల్ని ఇటీవలె ఘనంగా నిర్వహించారు. చిత్ర ప్రారంభోత్సవంలో టీం అంతా పాల్గొంది. సినిమా అద్భుతంగా రావాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు



జరగకూడదని కోరుకుంటూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, ఇతర టెక్నికల్ టీంకు సంబంధించిన వివరాల్ని ప్రకటించనున్నారు.

# ఫిబ్రవరి 6న 'ఎర్రచీర' విడుదల



'ఎర్రచీర' ట్రైలర్‌లోని షాట్‌ను అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా సినిమాలో కాపీ కొట్టారు: దర్శకుడు సుమన్ బాబు.. ఫిబ్రవరి 6న ఎర్రచీర గ్రాండ్ రిలీజ్.. బీ,సీ సెంటర్స్‌లో ఆడియన్స్‌కు బంపర్ ఆఫర్ ప్రకటించిన మూవీ టీమ్..బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ˘ఎర్రచీర – ది బిగినింగ్". మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించగా, దర్శకుడు క్రియేటివ్ స్టార్ సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్రను కూడా పోషించారు. సినిమా విడుదలకు సమీపిస్తున్న సందర్భంగా దర్శకుడు క్రియేటివ్ స్టార్ సుమన్ బాబు ప్రింట్, వెబ్ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎర్రచీర – ది బిగినింగ్ ఒక విలక్షణమైన కథాంశంతో రూపొందిన సినిమా. మదర్ సెంటిమెంట్‌కు హారర్, యాక్షన్ అంశాలు బలంగా మిళితమయ్యాయి" దర్శకుడు క్రియేటివ్ స్టార్ సుమన్ బాబు అన్నారు. ఇంకా మాట్లాడుతూ.. నా స్నేహితుడి ఇంటి పక్కన జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ కథను తీసుకున్నా. షూటింగ్ 37 రోజుల్లో పూర్తయినప్పటికీ, సీజీ వర్క్ కారణంగా సినిమా ఆలస్యమైంది. ఇందులో కేవలం 20 మాత్రమే వాస్తవ కథ ఉంటుంది, మిగిలినది కల్పితం. బాబాల గురించి కూడా ఇందులో చూపించాఇది రెగ్యులర్ హారర్ సినిమా కాదు. మదర్ సెంటిమెంట్, యాక్షన్ ఉన్న డిఫరెంట్ కంటెంట్. అందుకే పోటీ గురించి భయం లేదు.

## విబిసి క్రీడా అవార్డులకు హర్మన్, స్మృతి, దివ్య, సురుచి, జ్యోతి నామినేట్



**న్యూఢిల్లీ:** చారిత్రాత్మక మహిళల ప్రపంచ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, డిప్యూటీ కెప్టెన్ స్మృతి మంధాన తోపాటు, చెస్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ ప్రతిష్టాత్మక 2025 బిబిసి ఇండియన్ స్పోర్ట్స్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డులకు నామినేట్ అయ్యారు. అలాగే పిస్టల్ షూటింగ్ సంచలనం సురుచి సింగ్, ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ మరో ప్రతిష్టాత్మక వార్షిక అవార్డుకు నామినేట్ అయ్యారు. కెప్టెన్ హర్మన్ గత నవంబర్‌లో తొలి ఐసీసీ మహిళల ప్రపంచ కప్ టైటిల్‌కు నడిపించింది. ఆమె ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ 88 బంతుల్లో 89 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించింది. 29 ఏళ్ల ఎడమచేతి వాటం మంధాన అంతర్జాతీయ వన్డేలలో రెండవ అత్యధిక సెంచరీలు కలిగిన రికార్డు ఉంది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఆమె ఆస్ట్రేలియాపై 50 బంతుల్లో సెంచరీ చేసింది. ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసి విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టింది. అలాగే 20 ఏళ్ల చెస్ ప్లేయర్ దివ్య గత ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్స్‌లో, తొలి గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపిని ఓడించి సంచలన విజయం సాధించింది. ఇక ప్రపంచ కప్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లతో సహ అంతర్జాతీయ పోటీలలో స్థిరంగా పతకాలు గెలుచుకోవడం ద్వారా షూటర్ సురుచి 2024లో జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 7 బంగారు పతకాలు గెలుచుకుని వార్తల్లో నిలిచింది. ఆమె 3 వ్యక్తిగత బంగారు పతకాలను గెలుచుకుంది. ఇక యర్రాజీ 2024 పారిస్ క్రీడలలో ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌కు అర్హత సాధించిన మొదటి భారతీయ మహిళగా ఆమె నిలిచింది.

## ప్రపంచ 18వ ర్యాంక్‌లోకి
# అనహాత్



**న్యూఢిల్లీ:** స్క్వాష్‌లో భారత్‌కు చెందిన టీనేజ్ అమ్మాయి అనహాత్ సింగ్ ప్రపంచ ర్యాంకింగ్స్ టాప్ 20లో చోటు సంపాదించుకుంది. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పిఎస్ఎ) మంగళవారం విడుదల చేసిన మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 12స్థానాలుఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచ ర్యాంక్ 19కి చేరుకుంది. అమెరికాలోని వాషింగ్టన్‌లో ఈ నెల 1న జరిగిన 2026 స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్‌లో ఆమె మొట్టమొదటి టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత ఈ ఎత్తుకు ఎదిగింది. వాషింగ్టన్‌లో టైటిల్ గెలుచుకునే మార్గంలో ఆమె ఫైనల్‌లో ప్రపంచ 10వ ర్యాంక్ క్రీడాకారిణి, ఇంగ్లాండ్‌కు చెందిన టాప్ సీడ్ జార్జినా కెనెడ్డీని ఓడించింది. ఢిల్లీకి చెందిన 17 ఏళ్ల ఈమె ప్రస్తుతం 13 టోర్నమెంట్లలో 387 పాయింట్లు కలిగి ఉంది. మహిళల సింగిల్స్‌లో అత్యధిక ర్యాంక్ పొందిన భారతీయురాలుగా చరిత్ర సృష్టించింది. ఇదే విభాగంలో తదుపరి అత్యుత్తమ ర్యాంక్ పొందిన భారతీయుల్లో అనుభవజ్ఞురాలు జోష్నా చినప్ప ఈ ర్యాంకింగ్స్‌లో 74వ స్థానానికి చేరుకుంది.

ఎటిపి డబుల్స్ 20 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో యూకీ భాంబ్రీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ కెరీర్‌లో అత్యధికంగా 20వ స్థానానికి ఎగబాకాడు. రోహన్ బోపన్న తర్వాత టాప్ 20లోకి ప్రవేశించిన మొదటి భారతీయ పురుషుల డబుల్స్ ఆటగాడిగా నిలిచాడు. 33 ఏళ్ల అతను గతంలో 22వ ర్యాంక్ నుండి పైకి వెళ్లాడు. గత ఏడాది అతను దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో తన తొలి ఎటిపి 500 డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఈ సీజన్ ప్రారంభంలో, భాంబ్రి భారతదేశంలో నంబర్ 1 డబుల్స్ స్థానానికి చేరుకున్నాడు.




# టి 20 హిస్టరీలో ప్లేయర్లు పరుగుల వర్షం

## టాప్ 5లో ఇద్దరు టీమిండియా స్టార్స్

**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రపంచంలో పొట్టి ఫార్మాట్ అంటేనే పరుగుల వర్షం కురవాల్సిందే. ముఖ్యంగా ఐసీసీ టీ20 ప్రపంచకప్ వేదికపై ప్రపంచ స్థాయి బౌలర్లను అడ్డుకుని, పరుగుల జోరు కనపరచాలంటే ఏ బ్యాటర్‌కైనా సవాలే. 2007 నుంచి మొదలైన ఈ టీ20 వరల్డ్‌కప్ మెగా టోర్నీలో ఎందరో దిగ్గజాలు తమదైన శైలిలో విరుచుకు పడి అత్యధిక పరుగులు చేశారు. ఇప్పటి వరకు ఉన్న లెక్కల ప్రకారం (ఫిబ్రవరి 2026 నాటికి), టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఐదుగురు ఆటగాళ్లలో ఇద్దరు టీమిండియాకు చెందినవారు ఉన్నారు. ఈ జాబితో రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. 2012 నుంచి2024 వరకు అతడు 35 మ్యాచ్‌ల్లో అద్భుతమైన సగటుతో (58.72) ఈ పరుగులు సాధించాడు. 2014 ఎడిషన్‌లో కోహ్లీచేసిన 319 పరుగులు ఒకేప్రపంచకప్‌లో ఒకబ్యా టర్ చేసిన అత్యధిక పరుగులుగా రికార్డుసృష్టించాయి.ఈ జాబితాలో భారత మాజీ కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ రెండో స్థానంలో నిలిచాడు. 2007 ప్రారంభ ఎడిషన్ నుంచి 2024 వరకు అన్ని ప్రపంచకప్‌లలో ఆడిన ఏకైక భారతీయ ఆటగాడు రోహిత్. ఓపెనర్‌గా జట్టుకు దూకుడైన ఆరంభాన్ని ఇవ్వడంలో ఆయన శైలేవేరు. శ్రీలంక బ్యాటర్ మహేళ జయవర్ధనే టీ20 ప్రపంచకప్‌లో 1,000 పరుగుల మైలురాయిని దాటిన తొలి ఆటగాడిగా నిలిచాడు. క్లాసిక్ షాట్లతో టీ20లలో కూడా పరుగులు సాధించవచ్చని ఆయన నిరూపించాడు. ప్రస్తుత తరంలో అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్లలో జోస్ బట్లర్ ఒకరు. ఇంగ్లాండ్ కెప్టెన్‌గా జట్టుకు ప్రపంచకప్‌ను అందించడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా అద్భుతమైన గణాంకాలను కలిగి ఉన్నాడు. ప్రస్తుతం టాప్5లో ఉన్న ఏకైక యాక్టివ్ ప్లేయర్ ఇతనే కావడం విశేషం. ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. 2021లో ఆస్ట్రేలియా మొదటిసారి టీ20 ప్రపంచకప్ గెలవడంలో వార్నర్ కీలక పాత్ర పోషించాడు. ఎడమచేతి వాటం బ్యాటర్‌గా ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టడంలో ఆయన సిద్ధహస్తుడు.

# భారత్ గెలుపు

## 38 రన్స్ తేడాతో అమెరికా ఓటమి

**న్యూఢిల్లీ:** అమెరికా ప్రపంచకప్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఆయుష్ బదోని సారథ్యంలోని భారత్ ఏ జట్టు38పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఏ నిర్ణీత 20ఓవర్లలో 3వికెట్లకు 238 పరుగులు చేసింది. నారాయణ్



జగదీషన్(55 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 104) సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ ఆయుష్ బదోని(26 బంతుల్లో6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 60 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో బరిలోకి దిగిన తిలక్ వర్మ 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38 పరుగులు చేశాడు. 158.33 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అమెరికా బౌలర్లలో అలీ ఖాన్, జస్‌దీప్ సింగ్, శుభమ్ రంజనే తలో వికెట్ తీసారు. అనంతరం అమెరికా 19.4 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. సంజయ్ కృష్ణమూర్తి(18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 41), ఆండ్రీస్ గౌస్(31 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44) టాప్ స్కోరర్లుగా నిలిచారు. రవి బిష్ణోయ్(3/37) మూడు వికెట్లతో సత్తా చాటగా.. నమన్ ధీర్(2/6), ఖలీల్ అహ్మద్(2/25) రెండేసి వికెట్లు తీసారు. కాగా ఈ నెల 4న ముంబైలోని డివైపాటిల్ స్టేడియంలో భారత ప్రపంచకప్ జట్టు సౌతాఫ్రికా వరల్డ్ కప్ టీమ్‌తో వామప్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ తరఫున కూడా తిలక్ వర్మ బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. తిలక్ వర్మ రాకతో భారత తుది జట్టులో సంజూ శాంసన్ అవకాశం కోల్పోనున్నాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఇషాన్ కిషన్ సత్తా చాటడంతో సంజూ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ఆసియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్..
## భారత్ పురుషుల టీమ్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** పురుషుల క్వాడ్రంట్ ఫైనల్‌లో జపాన్‌ను ఓడించి ఆసియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్-2026లో భారత్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. నగోయా సిటీ మిజుహొపార్క్ జిమ్నాసియంలో మంగళవారం జరిగిన పురుషుల క్వాడ్రంట్ టైటిల్ పోరులో భారత్ 15-10, 12-15, 15-12 తేడాతో గెలిచింది. సెమీఫైనల్లో థాయిలాండ్‌ను వరుస సెట్లలో ఓడించడానికి ముందు, మలేషియా, దక్షి ణ కొరియాపై విజయాలతో గ్రూప్ బి లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయం భారతదేశం క్రీడలో ఇటీవలి పురోగతికి తోడ్పడుతుంది. ఇక మార్చి 2025లో పాట్నాలో జరిగిన అంతర్జాతీయ సెపక్టక్రా ఫెడరేషన్ ప్రపంచ కప్‌లో తొలిసారిగా పురుషుల రెగు (ముగ్గురు ఆటగాళ్ల జట్టు) స్వర్ణాన్ని గెలుచుకుంది. 2026 ఆసియా క్రీడలపై దృష్టి సారించే ముందు, భారతదేశం మే నెలలో మలేషియాలో జరిగే పురుషుల ఆసియా కప్ మరియు జూలైలో థాయిలాండ్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడుతుంది.






## మళ్లీ రూ. 20 వేలు పెరిగిన కిలో వెండి

# తులం బంగారం రూ.6వేలు పెరుగుదల

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** బంగారం, వెండిధరలు మరోసారి పెరిగాయి. అమెరికా ఫెడ్ ఛైర్మన్ నియామకం, ట్రేడ్‌డీల్‌లో సుంకాలు 18శాతానికి తగ్గిస్తామన్న ట్రంప్ ప్రకటనలతోబులియన్ మార్కెట్‌కళకళలాడింది. వీటి అవకాశంగా ఇన్వెస్టర్లు లాంగ్‌టర్మ్ లక్ష్యంగా కొనుగోళ్లకు దిగారు. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 4887 డాలర్లవద్ద కొనసాగింద.ఇ వెండిధరలు కూడా 85.98 డాలర్లుగా ట్రేడ్ అయింది. దేశీయంగా కూడా రెండులోహాలపై ధరలు పెరిగాయి. పదిగ్రాముల పసిడి బంగారం రూ.1.56 లక్షలకు పైబడింది. కిలో వెండిధరలు కూడా రూ.2.74 లక్షలుగా నమోదయింది. ముందురోజు ధరలతోప ఒలిస్తే బంగారం సుమారు రూ.6 వేలు పెరిగితే వెండిదరలు కిలోకు రూ.20 వేలు పెరిగింది. కమోడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసిఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్ట రూ.1.51 లక్షలవద్దట్రేడ్ అయితే కిలో వెండి రూ.2.60 లక్షలవద్ద కొనసాగింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ కమోడిటీ రీసెర్చ్ హెడ్ హరీష్ వి మాట్లాడుతూ గత వారం భారీ అమ్మకాల తర్వాత బంగారం, వెండి ధరలు స్థిరపడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. బులియన్ మార్కెట్‌కు మద్దతిచ్చే ఫండమెంటల్స్ ఇప్పటికీ బలంగానే ఉన్నాయని, ఇటీవల వచ్చిన దిద్దుబాటు ప్రధానంగా తాత్కాలిక కారణాల వల్లేనని ఆయన తెలిపారు. బంగారంతో పాటు వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. మార్చి 2026 డెలివరీకి సంబంధించిన లీదిశ్రీ వెండి ధర 1 కిలోకు దాదాపు రూ.2.7 లక్షల స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం వెండి రూ.2,67,890 వద్ద ట్రేడవుతుండగా, ఇది దాదాపు 13.4 శాతం లాభాన్ని సూచిస్తుంది. ఇంట్రాడేలో వెండి ధర రూ.2,69,654 గరిష్టాన్ని తాకింది. అంతర్జాతీయంగా స్పాట్ సిల్వర్ కూడా 11 శాతం కంటే ఎక్కువగా పెరిగింది.

## ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్‌తో అదానీకి భారీ లాభం




**ముంబయి, ఫిబ్రవరి 3:** స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో మంగళవారం దిగ్గజ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ షేర్లు దూసుకెళ్లాయి. ఒక్కరోజే 12 శాతం మేర పెరిగాయి. భారత్ అమెరికా మధ్య ట్రేడ్ అగ్రిమెంట్ ఖరారయిందన్న వార్తలతో భారత్‌పై విధించిన సుంకాలను 18 శాతానికి తగ్గిస్తామని అమెరికా ప్రకటించడం వంటివి స్టాక్ మార్కెట్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. దీనితో అదానీ గ్రూప్‌నకు కలిసొచ్చింది. అదానీ షేర్లను సైతం భారీగా కొనుగోలు చేశారు. నిఫ్టీ 50 బెంచ్‌మార్క్‌లో అదానీ ఎంటర్ ప్రైజెస్ టాప్ గెయినర్‌గా నిలిచింది. 12 శాతం మేర పెరిగి ఇంట్రాడే హై స్థాయి రూ.2,233.40 ని తాకింది. ఈ స్టాక్ 7.75 శాతం లాభంతో ట్రేడింగ్ మొదలు పెట్టగా ఆ తర్వాత దూసుకెళ్లింది. వరుసగా రెండో రోజు పెరిగింది. రెండు రోజుల్లో 14 శాతానికి పైగా పెరిగింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ షేర్లు ఎన్ఎస్ఈలో 8.33 శాతం మేర లాభంతో రూ.1520 వద్ద ట్రేడవుతున్నాయి. గత రెండు సెషన్లలోనే 12 శాతం మేర లాభపడింది. బెంచ్ మార్క్ ఇండెక్స్‌లో అత్యధికంగా లాభపడిన స్టాక్స్‌లో ఇదీ ఒకటి. మరోవైపు అదానీ గ్రూప్ కంపెనీలైన అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లలోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బలమైన ఇంధన వాణిజ్య సంబంధాలు, లోతైన ద్వైపాక్షిఆర్థిక సంబంధాలు,మౌలిక సదుపాయాల అవకాశాల నుంచి ఈ గ్రూప్ సంస్థలు లాభం పొందవచ్చనే అంచనాల మధ్య షేర్లు రాణిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేసారు. భారత్ అమెరికా ట్రేడ్ డీల్ ద్వారా లబ్ధిపొందే వాటిల్లో అదానీ గ్రూప్ కంపెనీలు సైతం ఉంటాయని గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ జెఫరీస్ పేర్కొంది. అలాగే అదానీ పవర్, అదానీ పోర్ట్స్ ఈ డీల్ ద్వారా లబ్ధిపొందుతాయని దేశీయ బ్రోకరేజీ సంస్థ యాంటిక్యూ సూచించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 5.14 శాతం మేర పెరిగి ఇంట్రాడే హై స్థాయి 85,871 ని తాకింది. నిఫ్టీ 1250 పాయింట్ల మేర పెరిగి 26,341 గరిష్ఠ స్థాయిని తాకింది.

## ఎల్ఐసిలో ప్రభుత్వ వాటాను తగ్గిస్తున్న దీపమ్




**ముంబయి, ఫిబ్రవరి 3:** ప్రభుత్వరంగంలోని జీవిత బీమా సంస్థ ఎల్ఐసికి 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ మలి విడత పబ్లిక్ ఆఫర్‌కు వస్తోందని ఇందుకోసం కసరత్తుజరుగుతోందని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు వెల్లడించారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాను మరోసారి విక్రయించనుందని చెప్పొచ్చు. ప్రస్తుతం ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వ వాటా ఏకంగా 96.5 శాతంగా ఉంది. గతంలో ఐపీఓ రూపంలో రాగా ఇప్పుడు ఎఫ్‌పీఓ రూపంలో రాబోతుందని చెప్పొచ్చు. ఇందులో భాగంగా ఇప్పటికే లిస్టింగ్ అయిన కంపెనీ కొత్తగా ఇన్వెస్టర్ల కోసం మళ్లీ షేర్లను జారీ చేస్తుందని చెప్పొచ్చు. 2022 మే నెలలో ఎల్ఐసీ.. తొలి పబ్లిక్ ఆఫర్ వచ్చింది. అప్పుడు ప్రభుత్వం ఎల్ఐసీలో సుమారు 3.5 శాతం వాటాను విక్రయించింది. ఇక్కడ ఐపీఓ కోసం ఎల్ఐసీ ఇష్యూ ధర సుమారు రూ. 902-949 రేంజ్‌లో ఉండగా ప్రభుత్వానికి సుమారు రూ. 21 వేలకోట్ల మేర నిధులు సమకూరాయి. ఇష్యూ ధరతో పోలిస్తే 5 శాతం వరకు తక్కువతో లిస్టింగ్ అయి తొలిరోజు రూ. 875 వద్ద ముగిసింది. తర్వాత కూడా పెద్దగా రాణించింది లేదు. ఎల్ఐసీలో ఇప్పటికే ప్రభుత్వ వాటాను తగ్గించమని పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగాన్ని (దీపమ్) కోరినట్లు నాగరాజు తెలిపారు. ఈ క్రమంలోనే మార్కెట్ పరిస్థితులు బాగానే ఉండి అన్ని అనుమతులు వస్తే గనుక వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఎఫ్‌పీఓ ఉంటుందని తెలిపారు.

# మార్కెట్లకు ఇండో-యుఎస్ ట్రేడ్‌డీల్ సపోర్ట్

## ఒక్కరోజే రూ.12 లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

### అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల జోరు..



**ముంబయి, ఫిబ్రవరి 3:** భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ప్రకటిండంతో మంగళవారం దేశీయ స్టాక్‌మార్కెట్లు భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. గ్లోబల్ పాజిటివ్ సంకేతాలు, ముఖ్యంగా భారత్-అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ఇన్వెస్టర్లలో భారీ ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా మార్కెట్లు ఓపెనింగ్ నుంచే బుల్ రన్‌లోకి దూసుకెళ్లాయి. ఇన్వెస్టర్లసంపదకు రెక్కలొచ్చాయి. బిఎస్ఇ విలువల్లో చూస్తే ఇన్వెస్టర్లకు రూ.12 లక్షలకోట్లు లాభంచేకూరింది. బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీ లమొత్తం విలువలురూ.12 లక్షలకోట్లుపెరిగి రూ.467.35 లక్షలకోట్లకు పెరిగింది. బీఎస్ఈ సెన్సెక్స్ 2,072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 639.15 పాయింట్లు పెరిగి 25,725.67 స్థాయిలో ముగిసింది. ఓపెనింగ్ సెషన్‌లోనే సెన్సెక్స్ 3,600 పాయింట్ల వరకూ ఎగబాకడం విశేషం. నిఫ్టీ 26,300 మార్క్‌ను తాకి రికార్డు స్థాయిని అందుకుంది. మార్కెట్ ప్రారంభం నుంచే అన్ని రంగాల్లో కొనుగోళ్లు జోరుగా కనిపించాయి. అమెరికా భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అంగీకరిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో పాటు, భారత్ ఉత్పత్తులపై ఉన్న ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై విధించిన అదనపు సుంకాలు ఈ తగ్గింపులో భాగం కావడంతో భారత ఎగుమతులకు పెద్ద ఊరట లభించనుంది. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు గేమ్ చేంజర్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేసారు. నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. బ్యాంకింగ్, రియాల్టీ, ఆటో, ఐటీ, మెటల్ రంగాల షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 2.5 శాతం పైగా ఎగబాకింది. ఐటీ సూచీ దాదాపు 5.8 శాతం పెరిగితే, ఆటో 5 శాతం, మెటల్ 3.8 శాతం, ఫార్మా 4.2 శాతం లాభపడింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు కూడా 4 శాతం కంటే ఎక్కువగా పెరిగి విస్తృత ర్యాలీని సూచించాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ మాట్లాడుతూ, ఈ ట్రేడ్ డీల్ భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద బూస్ట్ ఇస్తుందని చెప్పారు. బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు, టెలికాం, క్యాపిటల్ గూడ్స్, ఐటీ రంగాలు ముందంజలో ఉండొచ్చని అంచనా. రూపాయి మారకం విలువ కూడా బలపడింది. డాలర్‌తో పోలిస్తే నిన్న 91.49 వద్ద ముగిసిన రూపాయి నేడు 90.30 స్థాయికి చేరింది. విదేశీ ఇన్వెస్టర్లలో సానుకూల ధోరణులు పెరగడంతో కరెన్సీ మార్కెట్‌లో కూడా మెరుగైన ధోరణి కనిపిస్తోంది. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగియగా, ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో పయనించాయి. జపాన్ నిక్కీ 3 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతంగా పెరిగాయి. ఈ గ్లోబల్ సానుకూలత దేశీయ మార్కెట్లకు అదనపు మద్దతు ఇచ్చింది. భారత్-అమెరికా ట్రేడ్ ఒప్పందం మార్కెట్ సెంటిమెంట్‌ను పూర్తిగా మార్చేసింది. ఇన్వెస్టర్ల విశ్వాసం పెరగడంతో రాబోయే రోజుల్లో కూడా మార్కెట్లు కొత్త రికార్డులను సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బిఎస్ఇ పరంగాచూస్తే 3304 షేర్లుపెరిగి 981 షేర్లుమాత్రమే క్షీణించాయి. 151 షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ 2నాటి సెటిల్‌మెంట్లు 5.73శాతంపెరిగి రూ.1,52,235కి చేరాయి. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 4921 డాలర్ల వద్ద ఉంది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్‌నాటి సెటిల్‌మెంట్లలో 19 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 66.11 డాలర్లుగా ట్రేడ్ అయింది. డాలరుతో పోలిస్తే గ్లోబల్ మార్కెట్లో రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా ట్రేడ్ డీల్ తర్వాత ఒక్కరోజులోనే 1.36 బలపడింది. దీంతో ఈరోజు రూపాయి విలువ 90.26కు చేరింది. సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 9.12 శాతం పెరగగా బజాజ్ ఫైనాన్స్ 6.68 శాతం, ఇండిగో 5.51 శాతం, సన్ ఫార్మా 4.54 శాతం మేర లాభపడ్డాయి.

## రిలయన్స్‌సహా టాప్ 10 కంపెనీల మార్కెట్‌క్యాప్ భారీ ర్యాలీ!




**ముంబయి, ఫిబ్రవరి 3:** భారత్ అమెరికాలమధ్య వాణిజ్యడీల్ ఖరారయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించిన మరుసటిరోజునుంచే భారీ కంపెనీలు షేర్లుపెరిగాయి, రిలయన్స్ చీఫ్ ముఖేష్ అంబానీకి కలిసి వచ్చింది. టాప్ 10 కంపెనీలలో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు 7 పెరిగాయి, ఇన్ఫోసిస్, టిసిఎస్ షేర్లు 5 కంటే ఎక్కువ లాభాలను పొందాయి. అలాగే ఎస్‌బిఐ కూడా 6 పెరిగింది. ప్రధాన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ ఒక్కరోజులోనే రూ.5.40 లక్షల కోట్లకు పైగా పెరిగింది. అలాగే ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 4,200 పాయింట్లకు పైగా దూసుకువెళ్లింది. మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 7 శాతానికి పైగా పెరిగాయి. అలాగే కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.1,33,768.49 కోట్లు పెరిగి రూ.20,14,985.17 కోట్లకు చేరుకుంది. ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు దాదాపు 7 శాతం పెరిగాయి. బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.96,488.38 కోట్లు పెరిగి, రూ.15,23,500.64 కోట్లకు చేరుకుంది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీలలో ఒకటైన ఇన్ఫోసిస్ షేర్లు 6 శాతం పెరిగింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.41,068.96 కోట్లు పెరిగి, రూ.7,17,865.49 కోట్లకు చేరువ అయ్యింది. టీసీఎస్ షేర్లు 5.28శాతం పెరిగాయి. కంపెనీ మార్కెట్ క్యాప్ విలువ రూ.60,563.02 కోట్లు పెరిగి, రూ.12,07,172.33 కోట్లకు చేరుకుంది. ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు 4.72 శాతం పెరిగాయి. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.45,637.64 కోట్లు పెరిగి, రూ.10,12,898.08 కోట్లకు చేరువ అయ్యింది. ఎస్బీఐ షేర్లు కూడా దాదాపు 6 శాతం మేర పెరిగాయి. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ విషయానికి వస్తే రూ.56,803.76 కోట్లు పెరిగి, రూ.10,05,948.20 కోట్లకు చేరుకుంది. దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసిజి కంపెనీ హిందుస్తాన్ యూనిలీవర్ షేర్లు దాదాపు 2 శాతం పెరిగి మార్కెట్ క్యాప్ రూ.10,291.21 కోట్ల పెరిగి మొత్తం విలువ రూ.5,63,807.91 కోట్లకు చేరుకుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.